: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM
ఖమ్మం
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

26-7-2026
ఆదివారం సంపుటి: 32
సంచిక: 176 పేజీలు: 8+16 వెల: 8.00



కేంద్రమంత్రి రాజీనామాతో శనివారం న్యూఢిల్లీలో హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న సిజెపి చీఫ్ అభిజిత్, విద్యార్థులు



## కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్
# రాజీనామా

### పదిరోజుల పరిణామాలు ఎంతో బాధించాయి..
### వ్యక్తిగత ప్రతిష్టకంటే యువత భవిష్యత్తే ముఖ్యం: ధర్మేంద్ర

**న్యూఢిల్లీ,జులై 25:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను ఎక్స్‌లో పోస్టు చేశారు. లేఖలో తన రాజీనామాకు గల కారణాలను సోదాహరణంగా వివరించారు. గత 10 రోజుల నుంచి జరుగుతున్న పరిణామాలు తనను ఎంతో బాధకు గురిచేసినట్లు మంత్రి ప్రధాన్ పేర్కొన్నారు. ఇది నా వ్యక్తిగత ప్రతిష్టకు చెందిన విషయం కాదు అని అన్నారు. భారత యువశక్తియే ఈ దేశానికి అసలైన శక్తి అని అన్నారు. దేశ యువ శక్తిని భ్రమలో పడకుండా చూస్తానన్నారు. ఇదే తన సంకల్పం అని మంత్రి పేర్కొన్నారు. జంతర్ మంతర్ కానీ, ఇతర ప్రదేశాల్లో జరిగిన సంఘటనలతో దేశ >>2

రాజధాని ఢిల్లీలో విద్యార్థుల నిరసనలు సద్దుమణిగాయి. ప్రధాన డిమాండ్ అయిన విద్యామంత్రి ధర్మేంద్ర రాజీనామాతో ఆందోళనలు విరమిస్తున్నట్లు సిజెపి ప్రకటించింది. మరికొన్ని డిమాండ్లకు కూడా కేంద్రం సమ్మతించింది. ఢిల్లీలోని జంతర్‌మంతర్ నుంచి విద్యార్థులందరు స్వస్థలాలకు పయనం కావడంతో పది రోజుల తర్వాత ప్రశాంతత ఏర్పడింది.

## తాత్కాలిక విద్యామంత్రిగా ప్రహ్లాద్ జోషికి అదనపు బాధ్యతలు 2లో

## జంతర్‌మంతర్‌కు
# గుడ్‌బై

### మంత్రి రాజీనామాతో సిజెపిలో సంబురాలు
### ఆందోళన విరమించి స్వస్థలాలకు వెళ్తున్న విద్యార్థులు

**న్యూఢిల్లీ,జులై 25:** కాక్రోచ్ జనతాపార్టీ నిర్వహించిననిరవధిక ఆందోళనలతో కేంద్రం దిగివచ్చింది. కేంద్రమంత్రి దర్మేంద్రప్రధాన్ రాజీనామాతో నిరసనలు సద్దుమణుగుతున్నాయి. ఇప్పటివరకూ నిరసనలతో హోరెత్తిన ఢిల్లీ ఇప్పుడు విద్యార్థుల సంబరాలతో నిండిపోయింది. నీట్ పరీక్షా పేపర్ల లీక్ తదనంతర పరిణామాలతో విద్యార్థులు రోడ్డెక్కారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోసం తొలి నుంచి డిమాండ్ చేస్తున్నారు. గత వారం రోజులుగా ఢిల్లీ కేంద్రంగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు నిరసనలో పాల్గొన్నారు. ఛలో పార్లమెంట్ ఉద్రిక్తంగా మారింది. ప్రధాని మోడీ స్వయంగా విద్యార్థులకు హామీ ఇచ్చారు. పరీక్షా పత్రాల లీక్ చేస్తే కఠిన చర్యలు తప్పవని కొత్త చట్టం తీసుకొచ్చారు. విద్యార్థుల భవిష్యత్ తమకు ముఖ్యమని ప్రధాని >>2



శనివారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రులు నడ్డా, జితేంద్రతో చర్చలు జరుపుతున్న సిజెపి ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్

# చర్చలు సానుకూలం

### కేసులు ఎత్తివేత, ఆత్మహత్య చేసుకొన్న విద్యార్థులకు పరిహారం

### ఎఫ్ఐఆర్ కాపీలు కూడా సిజెపికి
### భవిష్యత్తులో వేధింపులు ఉండవని హామీ
### సిజెపి ప్రతినిధులతో చర్చలు జరిపిన కేంద్రమంత్రులు నడ్డా, జితేంద్ర

**న్యూఢిల్లీ,జులై 25:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై శనివారం కేంద్రం, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) మధ్య జరిగిన చర్చలు ఎట్టకేలకు సఫలమయ్యాయి. సిజెపి డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. విద్యార్థులపై పెట్టిన కేసులను క్రమంగా ఎత్తివేస్తామని కేంద్ర మంత్రి జెపి నడ్డా ప్రకటించారు. న్యూఢిల్లీతోపాటు ఇతర రాష్ట్రాల్లో నమోదైన కేసులు ఎత్తివేస్తామని, భవిష్యత్తులోనూ ఎవరినీ కేసులతో వేధించబోమని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు పరిహారంపై చర్చించామని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో పరీక్షల నిర్వహణ విషయంలో సిజెపితో చర్చిస్తామని వెల్లడించారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో కేంద్రం, సిజెపి మధ్య జరిగిన మూడో విడత చర్చల్లో కేంద్రమంత్రులు జెపి నడ్డా, జితేంద్రసింగ్, సిజెపి ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాపాల్గొన్నారు. సుదీర్ఘ చర్చలఅనంతరం సమావేశ వివరాలను సంయుక్తంగా మీడియాకు వెల్లడించారు. ప్రధానంగా నాలుగు అంశాలు మాత్రమే డిమాండ్లుగా ఉన్నాయి. నిరసన >>2



శనివారం ఆసుపత్రినుంచి విక్టరీ సింబల్ చూపుతున్న వాంగ్ చుక్

## ప్రజాస్వామ్య విజయం: వాంగ్‌చుక్

**న్యూఢిల్లీ,జులై 25:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ తొలిసారిగా స్పందించారు. ఇది ప్రజాస్వామ్య విజయం అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. జూన్ 28న కాక్‌రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనకు మద్దతుగా సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్ష ప్రారంభించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చ, నిరసన >>2

## విద్యావ్యవస్థ పునర్నిర్మాణానికి
# ఇది ముందడుగు

### ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలి: రాహుల్



**న్యూఢిల్లీ,జులై 25:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. 'ఇది కేవలం ప్రతీకాత్మకమైన రాజీనామా అయినప్పటికీ దేశ విద్యా వ్యవస్థ పునర్నిర్మాణానికి కీలక అడుగుగా అభివర్ణించారు. విద్యార్థులపై బలప్రయోగానికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం విడుదల చేసిన వీడియో సందేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ విద్యా వ్యవస్థ పునర్నిర్మాణంలో ఒక పెద్ద అడుగు. ఆయన ఒక ప్రతీక మాత్రమే. అందుకే ఇది ప్రతీకాత్మక నిర్ణయమే అయినప్పటికీ చాలా ముఖ్యమైనది' అని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు విద్యార్థుల నిరంతర ఆందోళనలే కారణమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, దేశ భవిష్యత్తు, రాజ్యాంగ పరిరక్షణ >>2

## రాష్ట్ర వ్యాప్తంగా 3 నెలలు ఉద్యమాలు

### బిజెపి నేతలకు సునీల్ బన్సల్ దిశానిర్దేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై25:** రాబోయే మూడు నెలల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాలని రాష్ట్ర బిజెపి నాయకత్వం నిర్ణయించింది. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేసేందుకు రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసుకుంది. ఈ క్రమంలో శనివారం టూరిజం ప్లాజాలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అధ్యక్షతన బిజెపి రాష్ట్ర పదాధికారులు, కోర్ కమిటీ ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ సునిల్ బన్సల్ ముఖ్య అతిథిగా హాజరై భవిష్యత్ కార్యాచరణపై నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ భేటీలో బిజెపి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ శ్రీ అభయ్ పాటిల్, రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు డా. కె.లక్ష్మణ్, ఎంపీ రేఖా శర్మ, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ,ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పార్టీ నిర్వహిస్తున్న సంస్థాగత కార్యక్రమాల పురోగతిని సుదీర్ఘంగా సమీక్షించడంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌ను రూపొందించారు. సమావేశం అనంతరం బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎన్. గౌతం రావు గారు మీడియాతో మాట్లాడుతూ సమావేశ ముఖ్యాంశాలను వెల్లడించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి సునిల్ బన్సల్ పర్యటనలో భాగంగా రాష్ట్ర కోర్ కమిటీ సమావేశంతో పాటు, ఐదు ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ఈ ఐదు కార్పొరేషన్లలోనూ బిజెపి జెండా ఎగురవేసేలా సునిల్ బన్సల్ మార్గదర్శనంలో పక్కా ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు.

# చట్ట సభల్లోకి జెన్ జి

- 21 యేళ్లకే శాసనసభ, లోక్‌సభ, 25 యేళ్లకే మండలి, రాజ్యసభకు పోటీ
- జెన్ జికి అవకాశం కల్పించాలంటూ శాసనసభలో ప్రత్యేక తీర్మానం చేస్తాం
- ఆగస్టు మొదటి వారంలో శాసనసభ, శాసనమండలి సమావేశాలు
- రాహుల్ మంత్రివర్గంలో జెన్ జికే విద్యా శాఖ
- నిరసన కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై25:** అత్యున్నత చట్ట సభలైన శాసనసభ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభల్లో జెన్ జీ తరం ప్రాతినిధ్యం వహించాలని, అందుకు అవసరమైన తీర్మానాన్ని శాసనసభలో ఆమోదించి కేంద్రానికి పంపుతామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రపంచంలో అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో 21 ఏళ్లకే ప్రధానమంత్రులు అవుతున్నప్పుడు మన దేశ యువతకు ఎందుకు ఆ అవకాశం ఉండకూడదని ఆయన ప్రశ్నించారు. నీట్ ప్రశ్నా పత్రాల లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లింపు డిమాండ్, జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై లాఠీఛార్జీకి నిరసనగా పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్ రోడ్డు వరకు పిసిసి ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన కొవ్వొత్తు ర్యాలీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వేలాదిగా తరలివచ్చిన జెన్ జీని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. సింగపూర్, బ్రిటన్, జర్మనీ వంటి దేశాల్లో 21 యేళ్లకే ప్రధానమంత్రులు అయ్యే >>2



శనివారం హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్ రోడ్డుదాకా కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సిఎం రేవంత్ రెడ్డి

## ఇందిరమ్మ టవర్స్‌కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్

### పదేళ్లు క్యూర్ పరిధిలో ఉన్నవారు అర్హులు: మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై25:** హైదరాబాద్ మహానగరంలోని పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు నగర నడిబొడ్డున గౌరవప్రదమైన సొంతింటిని అందించాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పాన్ని కార్యరూపంలోకి తీసుకువస్తూ ప్రజా ప్రభుత్వం క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ పథకంపై ప్రజల్లో ఎలాంటి గందరగోళం, అపోహలు లేకుండా దరఖాస్తు విధానం, అర్హతలు, అవసరమైన పత్రాలు, చెల్లింపులు, కేటాయింపు విధానం తదితర అంశాలపై పూర్తి సమాచారం అందించేందుకు ప్రత్యేక కాల్ సెంటర్ హెల్ప్‌లైన్‌ను శనివారం హౌసింగ్ బోర్డు కార్యాలయంలో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజలు ఎలాంటి సందేహాలు ఉన్నా మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా 04024603572 నంబర్‌కు ఉదయం 9 గంటల నుంచి సాయింత్రం 6గంటలమధ్య ఫోన్ చేసి అధికారిక సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో సమాచారం తెలియజేస్తారని చెప్పారు. క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా తొలివిడతలో 16 నియోజకవర్గాలలో 7,680 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని, ఏ నియోజకవర్గానికి చెందిన ప్రజలు అదే నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు.

## 100 రోజుల యాక్షన్ ప్లాన్

### తాగునీటి సమస్య పరిష్కరిస్తాం : మంత్రి సీతక్క



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై25 :** దేశవ్యాప్తంగా ఎల్‌నీనో పరిస్థితుల ప్రభావం కనిపిస్తున్న నేపథ్యంలో తెలంగాణలో తాగునీటి సరఫరాపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మిషన్ భగీరథ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలపై ప్రతిరోజూ సమీక్ష నిర్వహిస్తూ, అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలను ముందుగానే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సింగూరు, పాలేరు వంటి కొన్ని రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గినప్పటికీ, వచ్చే 100 రోజుల పాటు రాష్ట్రంలో ఎలాంటి తాగునీటి సమస్య రాకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు అధికారులు వివరించగా, దానిని కచ్చితంగా అమలు చేయాలని మంత్రి ఆదేశించారు. మంత్రి సీతక్క అధ్యక్షతన సచివాలయంలో శనివారం నాడు మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి, చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ, "2023లో కూడా ఇలాంటి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు రాకుండా చేశాం. ఈసారి కూడా అదే నిబద్ధతతో పనిచేయాలి" అని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 23,455 ఆవాసాల్లో 90 శాతం >>2



## యూనిఫాం కోసం ఇంకా
# ఎదురు చూపులే!

- 20 జిల్లాలకు షర్టింగ్ క్లాత్ అందనివైనం
- మూడు జిల్లాలకే బాలికల చుడీదార్ క్లాత్
- కెజిబిలు, గురుకులాలకు ఒక జత అందజేత

**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 25:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో చదివే విద్యార్థులు కొత్త యూనిఫామ్స్ కోసం మరికొంత సమయం వేచి చూడాల్సిందే. కొత్త యూనిఫామ్స్ కుట్టించడానికి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 20 జిల్లాలకు షర్టింగ్ క్లాతే అందలేదు. ఇక అమ్మాయిల చుడిదార్‌కి సంబంధించిన క్లాత్ కేవలం మూడు జిల్లాలకే అందగా, అబ్బాయిల పాంట్‌కి సంబంధించిన క్లాత్ 8 జిల్లాలకే అందింది. ఈ నేపథ్యంలో విద్యార్థులు కొత్త యూనిఫామ్స్ కోసం దసరా వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ, స్థానికసంస్థల పాఠశాలల్లోని విద్యార్థుల పరిస్థితి ఇలాంటి >>2

## 'రెడ్ సీ'లో తీవ్ర ఉద్రిక్తత

### సౌదీ ఆరామ్‌కోపై క్షిపణి, డ్రోన్‌లతో దాడి

**సనా(యెమెన్),జులై 25:** ఇరాన్ మద్దతు ఉన్న యెమెన్‌కు హౌతి తిరుగుబాటుదారులు శనివారం సౌదీ అరేబియాపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసినట్లు ప్రకటించారు. ఎర్ర సముద్రంలోని కీలక నౌకాశ్రయ నగరం హుదైదాపై సౌదీ వైమానిక దాడులకు ప్రతీకారంగా ఈ దాడులు చేపట్టినట్లు హౌతీలు వెల్లడించారు. ఇదే సమయంలో హర్మూజ్ జలసంధిపై అమెరికా, ఇరాన్ మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్న నేపథ్యంలో మధ్యప్రాచ్యంలోని కీలక సముద్ర వాణిజ్య మార్గాలపై ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. హౌతీల సైనిక ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ యాహ్యా సరీ ముందుగా రికార్డు చేసిన వీడియో ప్రకటనలో, ప్రపంచంలోనే అతిపెద్ద చమురు సంస్థ అయిన సౌదీ అరాంకోకు చెందిన యాన్‌బు, జిజాన్ నగరాల్లోని ఆరామ్‌కో చమురు సౌకర్యాలనే లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడుల నేపథ్యంలో యాన్‌బు, జిజాన్ నగరాల్లో శనివారం తెల్లవారుజామున పలుమార్లు హెచ్చరిక సైరన్లు మోగినట్లు సౌదీ పౌర రక్షణ విభాగం వెల్లడించింది. ఈ ఘటనపై సౌదీ ప్రభుత్వం ఇంకా పూర్తి వివరాలు వెల్లడించలేదు. మరోవైపు, ఇరాన్‌పై వరుసగా దాదాపు రెండు వారాలుగా కొనసాగిన అమెరికా దాడులకు శనివారం రాత్రి విరామం లభించినట్లు సమాచారం. అయినప్పటికీ హర్మూజ్ జలసంధి అంశంపై ఇరుదేశాల మధ్య ఇటీవల పెరిగిన ఉద్రిక్తతల కారణంగా పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉంది. ఎర్ర సముద్రంలో >>2



శనివారం రాత్రి హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో 100 సంవత్సరాల బాణాసంచా వేడుక దృశ్యం

# జంతర్‌మంతర్‌కు గుడ్‌బై

>> మోడీ హామీ ఇవ్వాలని. ఆ తరువాత ఎన్టీఏలో ప్రక్షాళన చేసారు. కొత్త పరీక్ష విధానం ప్రకటించారు. క్రాకోచ్ పార్టీ ప్రతినిధులతో చర్చలు చేసారు. అందులో వారి డిమాండ్లను అంగీకరించారు. అయినా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేస్తేనే నిరసన ఆగుతుందని సిజెపి తేల్చి చెప్పింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో క్రాకోచ్‌పార్టీ ఆందోళన ఫలించింది. ధర్మేంద్ర ప్రధాన్ తన రాజీనామా లేఖలో దేశ యువత భవిష్యత్తు, దేశ ఐక్యతను దృష్టిలో పెట్టుకుని రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోడీకి, కేంద్ర మంత్రివర్గ సహచరులకు కృతజ్ఞతలు తెలిపారు. దేశసేవకు ఎప్పటికీ అంకితభావంతో కొనసాగుతానని లేఖలో స్పష్టం చేసారు. 10 రోజులుగా జరుగుతున్న పరిణామాలు బాధించాయని ఆవేదన వ్యక్తం చేసారు. తాను వ్యక్తిగత భేషజాలకు పోవడం లేదని స్పష్టం చేసారు. యువత భవిష్యత్ కోసమే రాజీనామా చేసినట్లు వెల్లడించారు. దేశ విద్రోహ శక్తులు అవకాశం ఇవ్వకూడదని పేర్కొన్నారు. యువతే ఈ దేశ అసలైన శక్తిగా ధర్మేంద్ర ప్రధాన్ అభివర్ణించారు. యువత చదువు కోసమే సమయం కేటాయించాలని సూచించారు. జంతర్‌మంతర్ ఇతర నగర వీధుల్లో సిజెపి ప్రతినిధులు సంబరాల్లో మునిగిపోయారు. వీధుల్లోకి వచ్చి డాన్సులు చేయడం కనిపించింది.మరోపక్క రాష్ట్రాల్లో ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాల్లో వెలుగురేఖలు కనిపించాయి. డిమాండ్లు మొత్తం మూడింటిని అంగీకరించిన కేంద్రం పరిహారం వస్తుందని మరోపక్క, ఇంతకాలానికి నీట్ విద్యార్థులకు న్యాయంజరిగిందని మరోవైపు విద్యార్థుల తల్లితండ్రులు పేర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా కూడా రాష్ట్ర రాజధానుల్లో సిజెపి ప్రతినిధులేకాకుండా వివిధ పార్టీల యువనేతలు కూడా హర్షాతిరేకాలుప్రకటించారు.

**జంతర్‌మంతర్‌ను వీడండి: ఆందోళన విరమణకు పిలుపు**

కాగా డిమాండ్ల పరిష్కారం కావడంతో జంతర్‌మంతర్‌లో మకాం వేసిన విద్యార్థులందరూ ఇక ఇళ్లకు తరలివెళ్లాలని సిజెపినేతలు ప్రకటించారు. కేంద్ర మంత్రి రాజీనామా, ఆత్మహత్యలుచేసుకున్న విద్యార్థి కుటుంబాలకు పరిహారం చెల్లింపుతోపాటు విద్యార్థినేతలపై కేసులు ఎత్తివేసేందుకు మంత్రులు జితేందర్‌సింగ్, జెపి నడ్డాలు ప్రభుత్వంతో సంప్రదించి ఆమోదం తెలిపారని అందువల్ల ఇక మన ఉద్యమాన్ని విరమించాలని సిజెపి నేతలు విజ్ఞప్తిచేసారు. జంతర్‌మంతర్ వేదికవద్ద అంబేడ్కర్ చిత్రపటాన్ని చేతపట్టుకుని విద్యార్థినేతలు భారీ స్థాయిలో హర్షాతిరేకాలు వ్యక్తంచేసారు.

# పునర్నిర్మాణానికి ఇది ముందడుగు

>> కోసం వీధుల్లోకి వచ్చి పోరాడిన ప్రతి విద్యార్థికి అభినందనలు తెలిపారు. వీధుల్లోకి వచ్చి ప్రజాస్వామ్యం కోసం, దేశ భవిష్యత్తు కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడిన ప్రతి విద్యార్థికి నా అభినందనలు. మీపై నాకు గర్వంగా ఉందని అన్నారు. ఈ రాజీనామా రైతులు, కార్మికులు, పేదలు సహా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రతి వర్గానికి ఒక సందేశమని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం అణచివేతకు గురిచేస్తున్న ప్రతి వర్గం ధైర్యంగా పోరాడితే మార్పు సాధ్యమవుతుందని ఈ పరిణామం నిరూపించింది. దేశ రాజ్యాంగాన్ని బలహీనపరుస్తూ, సంస్థలను తన ఆధీనంలోకి తీసుకుంటున్న ఈ ప్రభుత్వాన్ని ప్రజలు ఎదుర్కోవాలి. అని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా రెండు కీలక డిమాండ్లను నెరవేర్చాల్సి ఉందన్నారు. విద్యార్థులపై లాఠీచార్జ్, కాల్పులు, బలప్రయోగానికి పాల్పడిన అధికారులు, వాటిని ఆదేశించిన వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై చేయి చేసుకున్నవారు, వారిని కొట్టినవారు, కాల్పులకు పాల్పడినవారు, ఈ చర్యలను ప్రణాళికాబద్ధంగా అమలు చేసిన ప్రతి ఒక్కరినీ బాధ్యులుగా నిలబెట్టి శిక్షించాలని కోరారు. దేశ విద్యార్థుల పట్ల గౌరవం చూపిస్తూ ప్రధాని మోడీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ భవిష్యత్తైన విద్యార్థులపై జరిగిన అమానుష దాడులకు ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలి. విద్యార్థులపై జరిగిన దాడులకు ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని పేర్కొన్నారు.

# ఇది చాలా చిన్న ఆదివారం!

## 24 గంటల కంటే తక్కువే

**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త:** నేటి ఆదివారం అంటే ఈ నెల 26వ తేదీన రోజు విడిది 24 గంటలకు ముందుగానే ముగియనుంది. ఇందుకుగల కారణాలను శాస్త్రవేత్తలు తమదైన శైలిలో చెబుతున్నారు. 2025 ఏడాదిలో భూమి వేగంగా తిరిగిందని వారు అంటున్నారు. ఇప్పుడు ఈ వేగం కాస్త తగ్గిందని వారు చెబుతున్నారు. ఇంటర్నేషనల్ ఎర్త్ రొటేషన్ అండ్ రిఫరెన్స్ సిస్టం సర్వీస్ (ఐఈఆర్ఎస్) అందించిన సమాచారం ప్రకారం భూభ్రమణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. దీనివల్ల 26వ తేదీ నాటి ఆదివారం నాడు 24 గంటలకు బదులు 0.65 మిల్లీ సెకన్లు తక్కువగా వుంటుంది. ఇది సెకనుకు వెయ్యో వంతుకంటే తక్కువన్న మాట. ఈ తేడాను మనం గుర్తించలేమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గడచిన ఐదేళ్ల రికార్డులను పరిశీలిస్తే భూమి వేగంలో మార్పులు వున్నాయని వారంటున్నారు. 2020లో అటామిక్ క్లాక్ చరిత్రలో వేగవంతమైన 28 రోజులు నమోదయ్యాయని వారు చెబు తున్నారు. 2025 జులై 10వ తేదీన అతి చిన్నరోజు నమోదయ్యింది. ఆ రోజు 24 గంటల్లో 1.37 మిల్లీ సెకన్లు తగ్గాయి. దీనితో పోలిస్తే వచ్చే ఆదివారం నమోదయ్యే రికార్డు కొంత చిన్నదే. దీనికి రెండవ స్థానం దక్కుతుందని శాస్త్రవేత్త లు చెబుతున్నారు. ఇలా జరగడానికి 2025తో పోలిస్తే 2026లో భూభ్రమణ వేగం కాస్త తగ్గడమేనని వారంటున్నారు. ఇక భూభ్రమణంలో వచ్చిన మార్పులకు చంద్రుడు భూమధ్య రేఖకు సరిగ్గా పై భాగాన వున్నపుడు భూమి వేగం నెమ్మదిస్తుంది. చంద్రుడు ఉత్తర లేదా దక్షిణ దిశల్లో వున్నప్పుడు భూభ్రమణ వేగం పెరుగుతుందని, అయితే సముద్ర కెరటాల మధ్య ఏర్పడే ఘర్షణ భూమి వేగాన్ని క్రమాన్ని తగ్గిస్తుందని శాస్త్రవే త్తలు చెబుతున్నారు. భూమి లోపల ద్రవ రూపంలో వుండే లిక్విడ్ కోర్, సముద్రాలు, వాతావరణంలో జరిగే భౌతిక మార్పులు కూడా భూభ్ర మణ వేగాన్ని ప్రభావితం చేస్తాయని వారంటున్నారు.

# ఎదురు చూపులే!

>> కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కెజివిబి), గురుకులాలకు సంబంధించిన విద్యార్థులకు మాత్రం ఇప్పటికే ఒక జత యూనిఫామ్‌ను సరిఫరా చేశారు. ఇందుకు కారణం వారి యూనిఫామ్‌కి సంబంధించిన క్లాత్ అందుబాటులో ఉండటంతో వారికి ఒక జత యూనిఫామ్‌ను కుట్టించి ఇప్పటికే 80 శాతం మందికి సరఫరా చేయగా.. ఈ నెలాఖరు నాటికి మిగిలిన వారికి అందజేయనున్నారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లోని విద్యార్థులకు ఇచ్చే యూనిఫామ్స్‌కి సంబంధించి రంగులను మార్చారు. గత ఏడాది వరకు ఉన్న రంగులను కాకుండా కొత్త రంగులతో యూనిఫామ్స్‌ను డిజైన్ చేయడం, దాంతోపాటు ఈ ఏడాది రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాలు, మోడల్ స్కూల్స్, హాస్టల్స్ అన్నింటిలోని విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్ క్లాత్‌ను ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్(పిఎంయు) ద్వారా కొనుగోలు చేయాలని దీనికి ఎస్సీ గురుకుల సొసైటీ నోడల్ సంస్థగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విద్యా సంవత్సరం 2026-27 నుంచి విద్యార్థుల యూనిఫాం రంగుల్లో డే స్కాలర్స్‌కు టాప్ లైట్ బ్లూ, లోయర్ దార్క్ బ్లూ రంగుల్లో యూనిఫాంలు ఉంటాయి. అలాగే గురుకులాల్లోని విద్యార్థులకు టాప్‌లో మెరూన్ చెక్, లోయర్ మెరూన్ రంగుల డ్రెస్‌లను కేటాయించారు. విద్యార్థినులకు స్కర్ట్, పంజాబీ డ్రెస్, చున్నీలను సరఫరా చేయనున్నారు. విద్యార్థుల్లో 8వ తరగతి నుంచి ఆపై విద్యార్థులందరికీ పాంట్స్‌ను సరఫరా చేయాలని నిర్ణయించారు. దీంతో పిఎంయు ద్వారా టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావడం దాంతో యూనిఫామ్ స్టిచ్చింగ్‌కి అవసరమైన క్లాత్ కొనుగోలులో ఆలస్యం కావడంతో ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లోని విద్యార్థులకు ఒక్క జత యూనిఫామ్ కూడా ఇవ్వలేకపోయారు. పైగా ఈ యేడాది నుంచి గత యేడాది వరకు ఉపయోగించిన యూనిఫామ్‌ను కాకుండా కొత్త వాటిని ఎంపిక చేయడంతో ప్రస్తుతం విద్యార్థుల దగ్గర ఉన్న పాత యూనిఫామ్స్‌ను వేసుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. దీంతో విద్యార్థులు కొత్త యూనిఫామ్స్ కోసం ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల స్కూల్స్‌లో కలిపి సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాం అందించేందుకుగాను 2.97 కోట్ల మీటర్ల వస్త్రాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉంది. అందులో మఫత్‌లాల్ కంపెనీ 2.41 కోట్ల మీటర్లను, తెలంగాణ రాష్ట్ర చేనేత కార్మికుల సహకార సంఘం (టెస్కో) 55.32 లక్షల మీటర్లను సరఫరా చేస్తున్నాయి. విద్యార్థిని, విద్యార్థులకు అందించే యూనిఫాంల కుట్టు పని బాధ్యతను పూర్తిగా మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. వారు రోజుకు 75 వేల నుంచి లక్ష యూనిఫాంలు కుట్టే సామర్థ్యం కలిగి ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఒక్కో యూనిఫామ్ కుట్టడానికి రూ. 75 చొప్పున ప్రభుత్వం చెల్లించనుంది. తద్వారా రాష్ట్రంలోని మహిళా సంఘాలకు సుమారు రూ. 40 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం సాయంత్రం నాటికి అందుబాటులోకి వచ్చిన క్లాత్ వివరాల్లో విద్యార్థిని, విద్యార్థుల షర్టింగ్ కోసం 13 జిల్లాల్లో క్లాత్ అందుబాటులో ఉంది. బాలుర పాంట్స్‌కి సంబంధించి కేవలం 9 జిల్లాలు (ఖమ్మం, హైదరాబాద్, జనగాం, యాదాద్రి భువనగిరి, హన్మకొండ, వికారాబాద్, నారాయణపేట్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి), బాలికలకు సంబంధించి చుడిదార్ కోసం అందించే క్లాత్ కేవలం మూడు జిల్లాలు రంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్ జిల్లాలకు మాత్రమే అందింది. విద్యార్థిని, విద్యార్థులకు షర్టింగ్ కోసం 55,35,789 మీటర్లు కావల్సి ఉండగా.. వచ్చింది 12,80,315 మీటర్లు మాత్రమే. బాలుర పాంట్ కోసం 34,55,295 మీటర్లు అవసరం కాగా, 6,18,187 మీటర్లు మాత్రమే అందుబాటులో ఉంది. ఇక బాలికల చుడిదార్ కోసం 17,92,460 మీటర్లు అవసరం కాగా వచ్చింది కేవలం 86,563 మీటర్లు మాత్రమే. విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కూడా ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నెల రోజుల్లోగా విద్యార్థులకు రెండు జతల యూనిపామ్స్ అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

>> విరోధ శక్తులు బలపడకుండా చూడాలన్నారు. దేశం ఐక్యతతో నిలవాలన్నారు. భారత విద్యార్థుల భవిష్యత్తు దేశ చట్టాలకు బందీ కావొద్దన్నారు. మన పిల్లలు తమ మనసును చదువులపై పెట్టాలని, కెరీర్‌పై ఫోకస్ పెట్టాలని, ఈ విషయంపై ఆలోచనలు చేసి, తన రాజీనామాను ప్రధాని మోడీకి సమర్పించినట్లు మంత్రి ప్రధాన్ పేర్కొన్నారు. ప్రభు జగన్నాథుని ఆశీస్సులతో భవిష్యత్తులో దేశమాత కోసం సేవ చేస్తానన్నారు. ఒడిశా ప్రజలు, దేశ యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ మీదకు నాకు నమ్మకం ఉందని, యువత ఆకాంక్షలు, యువతలను గౌరవిస్తున్నానన్నారు. యువత కేవలం భారత దేశ భవిష్యత్తు మాత్రమే కాదు, వాళ్ళ వికసిత భారత్‌కు కొత్త వాహకాలు అన్నారు. భవిష్యత్ నిర్మాతలు, శిల్పకారులు అని కూడా యువతే అని పేర్కొన్నారు. మే 3వ తేదీన జరిగిన పరీక్షలో అక్రమాలు జరిగినట్లు తెలియగానే, ఆ కేసును సిబిఐకి అప్పగించామన్నారు. ఆ ఎగ్జామ్‌ను మళ్లీ షెడ్యూల్ చేశామన్నారు. 2027 నుంచి నీట్ యూజీ పరీక్షను కంప్యూటర్ ఆధారిత పరీక్షగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రధాన్ తెలిపారు. సుమారు 20 లక్షల మంది రాసిన నీట్ పరీక్షను స్మూత్‌గా నిర్వహించడమే ప్రాధాన్యతగా ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగం దీనికి సహకరించిందన్నారు. విద్యార్థులు, గార్డియన్స్, పేరెంట్స్ సహకారంతో పరీక్షను జూన్ 21వ తేదీన విజయవంతంగా నిర్వహించినట్లు ప్రధాన్ తెలిపారు. ముందు నుంచి ఈ సంక్షోభానికి బాధ్యతను ఆమోదిస్తున్నట్లు ఆయన చెప్పారు. బాధ్యత నుంచి తానేమీ పారిపోయేందుకు ప్రయత్నించలేదన్నారు. ఎగ్జామ్ మాఫియా వల్ల మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడడమే తన కర్తవ్యంగా పెట్టుకున్నానన్నారు. ఏ విద్యార్థికి కూడా అన్యాయం జరగకుండా చూశానన్నారు. జూలై 16వ తేదీన రిలీజ్ చేసిన నీట్ యూజీ ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని, ఎంతో మంది మెరిట్ పేద విద్యార్థులు విజయం సాధించినట్లు చెప్పారు. తన లేఖలో కేంద్ర మంత్రులకు, అధికారులకు, విద్యాశాఖ సిబ్బందికి, తనతో పనిచేసిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశానికి సేవ చేయడమే తన జీవితంలో అత్యధిక ప్రాధాన్యమైందని, దేశ సేవకే అంకితమైనట్లు ఆయన తన లేఖలో చెప్పారు. ప్రధాని మోడీకి రాసిన రాజీనామా లేఖను ప్రభుత్వం ఆమోదించాల్సి ఉంది.

# చర్చలు సానుకూలం

>> కారులపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని, ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడదు, ఒకవేళ ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఉంటే వాటిని ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌కు మంత్రులు అంగీకరించినట్లు తెలిపారు. ఈ కేసులు ఢిల్లీ పోలీసులు నమోదుచేసినా లేదా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడ నమోదైనా సరే ఆ ఎఫ్ఐఆర్ కాపీలను మేం వారికి అందిస్తాం. నిరసనల సమయంలో ఆందోళనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడానికి, వారిపై ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండటానికి ప్రభుత్వం అంగీకరించింది. భవిష్యత్తులో కూడా ఆందోళనల నిర్వాహకులు, నిరసనకారులపై ఈ కార్యకలాపాలకు సంబంధించి ఎలాంటి కేసులు నమోదు చేయకూడదని మేము అంగీకరించాం. వారు ప్రస్తావించిన రెండో అంశం పరిహారానికి సంబంధించినది. ఈ పరిహారం చెల్లింపుపై ప్రభుత్వం తన వైఖరిని చాలా స్పష్టంగా తెలియజేసింది. నిబంధనలు లోబడి సాధ్యమైనంత పరిహారాన్ని అందిస్తామని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జెపినడ్డా స్పష్టంచేసారు.

**'ఆందోళనకారులు తిరిగి ఇళ్లకు వెళ్లిపోండి'**

చర్చలు సఫలం కావడంతో ఆందోళన విరమిస్తున్నట్లు క్రాకోచ్ జనతా పార్టీ ప్రకటించింది. కేంద్రం తమ డిమాండ్లు నెరవేరుస్తామని మంగళవారం నాటికి స్పష్టత ఇస్తామని ప్రకటించడంతో ఆందోళనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోశ్ రంకాలు ప్రకటించారు. మరోవైపు, తమ ఐదు సూత్రాల డిమాండ్ల పత్రాన్ని ప్రభుత్వానికి సీజేపీ ప్రతినిధులు సమర్పించారు. నాలుగు వారాల తర్వాత తదుపరి విడత చర్చలు జరపనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై సిజెపి ప్రతినిధి అశుతోశ్ రాంకా మాట్లాడారు. "మేము నీట్ బాధితుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం డిమాండ్ చేశాం. అందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఇది కాకుండా విద్యా, పరీక్షా సంస్కరణల గురించి ప్రస్తావిస్తూ ఐదు సూత్రాల డిమాండ్ల పత్రాన్ని కూడా ప్రభుత్వం ముందు ఉంచాం. ఆ డిమాండ్ల పత్రం గురించి సుమారు నాలుగు వారాల్లో మేం ప్రభుత్వాన్ని మళ్లీ కలుస్తాం. డిమాండ్లకు అంగీకారం లభించింది కాబట్టి నిరసనకారులు వెంటనే తమ ఇళ్లకు తిరిగి వెళ్లాలని కోరుతున్నామని అశుతోశ్ పేర్కొన్నారు.

## కొత్త విద్యా మంత్రిగా ప్రహ్లాద్‌జోషి



**న్యూఢిల్లీ, జులై 25:** కేంద్ర కొత్త విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్‌జోషి నియమితులయ్యారు. ఈమేరకు ప్రధాని కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.ప్రస్తుతం వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం ప్రజాపంపిణీ వ్యవస్థ తోపాటు కొత్త, పునరుత్పత్తి ఇంధన మంత్రిత్వ శాఖలను నిర్వహిస్తున్న జోషికి అదనంగా విద్యాశాఖ బాధ్యతలను కూడా మోడీ సర్కారు అప్పగించింది.

**ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ఆమోదం**

ఇదిలా ఉండగా మంత్రిపదవికి చేసిన రాజీనామా లేఖను ప్రధాని మోడీకి అందచేయగా ఆ పత్రాన్ని రాష్ట్రపతికి పంపించడంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెనువెంటనే రాజీనామాను ఆమోదించారు. రాజీనామాకు దారితీసిన పరిస్థితులు, తన వ్యక్తిగత ప్రతిష్టకంటే దేశ భవిష్యత్తు,యువత భవిష్యత్తే ముఖ్యమని అయితే దారితీసిన పరిస్థితులు తనను ఎంతో బాధించాయని మంత్రి ప్రధాన్ తన లేఖలో పేర్కొన్న సంగతి తెలిసిందే.

## వారం - వర్జ్యం

26-07-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
ద్వాదశి మ.1.57
జ్యేష్ఠ ఉ.7.34
వర్జ్యం : లేదు
దు.సా.4.54-సా.5.46
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. శాస్త్ర, సాంకేతిక విషయాలపై ఆసక్తి చూపుతారు.

**వృషభం:** పురోభివృద్ధిలో కొంత ప్రతికూల పరిస్థితులు చోటుచేసుకుంటాయి. వృత్తిలో స్తబ్దత నెలకొంటుంది. వాహనసౌఖ్యం.

**మిథునం:** శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. ఇంటర్వ్యూలలో పాల్గొం టారు. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**కర్కాటకం:** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. అంతర్గత రాజకీయాలు కొంత బాధిస్తాయి.

**సింహం:** మనోధైర్యం, ఓర్పు వీడకండి. అన్నీ ప్రతి కూలంగా ఉన్నా సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. స్పెక్యులేషన్‌కు ఎంత దూరంగాఉంటే అంత మంచిది.

**కన్య :** ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించి పై అధికారుల ప్రశంసలు పొందు తారు. పెట్టుబడులు సమకూర్చుకుంటారు.

**తుల:** కుటుంబ సమస్యల నుండి బయట పడతారు. సంఘంలో ప్రత్యేక గౌరవం పొందు తారు.ఇంటా బయటా మీదే పైచేయిగా వుంటుంది.

**వృశ్చికం:** వ్యాపారాలలో ప్రోత్సాహం లభిస్తుంది. క్రయవిక్రయాలలో స్వల్ప లాభాలు పొందుతారు. వివాదాలకు దూరంగా వుండండి.

**ధనుస్సు:** కారణంలేని చికాకులు మానసిక ప్రశాంతతకు భంగం కలిగిస్తాయి. ఎంతటి కార్యాన్నైనా పట్టుదలతో సాధిస్తారు.

**మకరం:** చేపట్టిన కార్యక్రమాలలో స్వల్ప ఆటంకాలు కలిగినా ఎట్టకేలకు పూర్తి చేస్తారు. దూర ప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకొంటారు.

**కుంభం:** కార్యాలయంలో పనిభారం పెరిగి నప్పటికి సమర్థతతో నిర్వహిస్తారు. ఒకానొక బాధ్యతను పూర్తిచేసి బరువు దించుకుంటారు.

**మీనం:** శాంతము వహించడం వలన అనేక లాభాలు కలుగుతాయి. ఆర్థిక అంశాలు అనుకూలంగా వుంటాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్


రొమేనియాలోని బుఖారెస్ట్ విశ్వవిద్యాలయం శనివారం రాష్ట్రపతి ముర్మును గౌరవ డాక్టరేట్‌తో సత్కరించిన దృశ్యం

# ఇది ప్రజాస్వామ్య విజయం: వాంగ్‌చుక్

>> తెలిపిన విద్యార్థులపై ఎలాంటి కేసులు ఉండబోవనే హామీ, నీట్ వివాదం నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అంశాలపై కేంద్రం హామీ ఇవ్వడంతో ఆయన 26 రోజుల నిరాహారదీక్షను గురువారం విరమించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఆయన విక్టరీ సింబల్ చూపుతూ ఉన్న ఫోటోను పోస్ట్ చేశారు. వీధుల నుంచే ప్రత్యక్ష ప్రజాస్వామ్యం, ఇది శాంతి, సహనం, పట్టుదల సాధించిన విజయం అని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. క్రాకోచ్ జనతా పార్టీ, దేశ యువతకు ఆయన అభినందనలు తెలిపారు. భయాన్ని వీడి ఉద్యమంలో పాల్గొన్న ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఇకపై ఉద్యమం జవాబుదారీతనం, విద్యాసంస్కరణల దిశగా ముందుకు సాగుతుందని అన్నారు.

# చట్ట సభల్లోకి జెన్ జి

>> అవకాశం ఉందని, మన దేశంలోనూ ఆ అవకాశం జెన్ జీకి ఇవ్వాల్సి ఉందన్నారు. రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 61వ రాజ్యాంగ సవరణ చేసి ఓటు హక్కును 21 యేళ్ల నుంచి 18 యేళ్లకు తగ్గించారని సిఎం తెలిపారు. నాడు రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయంతోనే నూనుగు మీసాల యువకులు, సోదరీమణులు ఓటు హక్కు పొందగలిగారని చెప్పారు. అలాగే పి.వి.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో 73,74 రాజ్యాంగ సవరణ తీసుకొచ్చి పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల్లో మేయర్లు, జడ్పీ ఛైర్మన్లు వంటి పోస్టులకు ఎన్నికయ్యే వయస్సును 25 నుంచి 21 ఏళ్లకే తగ్గించారని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. నాడు కాంగ్రెస్ ప్రధానమంత్రులు తీసుకున్న నిర్ణయంతోనే యువత 18 యేళ్లకే ఓటు వేయగలుగుతున్నారని, 21 యేళ్లకే స్థానిక సంస్థల్లో పదవులు సాధించగలుగుతున్నారని తెలిపారు. 21 యేళ్లకే ఒక సోదరీమణి తిరువనంతపురం మేయర్‌గా ఎంపిక కావడానికి నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అవకాశమే కారణమన్నారు. జర్మనీ, బ్రిటన్ లాంటి దేశాల్లో 18 యేళ్ల కే పోటీ చేసే హక్కు కల్పించారు, సింగపూర్‌లో 21 యేళ్లకే పోటీ చేసి ప్రధాన మంత్రి కావొచ్చు అని చెప్పారు. లోక్‌సభలో 543 మంది ఎంపీలు ఉంటే 1 శాతానికి లోపే జెన్ జీ ప్రాతినిధ్యం ఉందన్నారు. 30 శాతంగా ఉన్న జెన్ జీకి లోక్‌సభలో 1 శాతం కన్నా తక్కువ ప్రాతినిధ్యం ఉండడం సరికాదన్నారు. 21 ఏళ్లకే లోక్‌సభకు, శాసనసభకు పంపించే బాధ్యత తాము తీసుకుంటామని,అందుకు మీరు సిద్ధంగా ఉన్నారా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించగా, తాము సిద్ధమని జెన్ జీ స్పందించింది.జెన్ జీ సమస్యలు పరిష్కారం కావాలంటే చట్ట సభల్లోనూ వాళ్ల ప్రాతినిధ్యం ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇందుకోసం శాసనసభ, లోక్‌సభలకు 21 యేళ్లకు, శాసనమండలి, రాజ్యసభకు 25 యేళ్లకే పోటీ చేసే అవకాశం కల్పించాలని తాము డిమాండ్ చేస్తున్నామని సిఎం అన్నారు. ఈ అంశంపై ఆగస్టు మొదటి వారంలో శాసనసభ, శాసనమండలిని ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి చట్టసభల్లో పోటీ చేసే వయస్సు తగ్గింపు తీర్మానం పెట్టి ఆమోదిస్తామని సిఎం తెలిపారు. ఆ తీర్మానాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని సిఎం వెల్లడించారు. దేశంలో అత్యున్నతమైన సివిల్ సర్వీసుకు 21 యేళ్లకే ఎంపికయ్యే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా 21 యేళ్ల వయస్సుకే శ్రీలక్ష్మి ఐఎఎస్, 22 యేళ్లకే మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అనన్య ఐఎఎస్, 22 యేళ్లకే ప్రస్తుత డిజిపి సి.వి.ఆనంద్ ఐపిఎస్‌గా ఎంపికైన విషయాన్ని సిఎం గుర్తు చేశారు.జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్‌కు ప్రదర్శనగా కాదని, రోడ్లపై నుంచి నేరుగా పార్లమెంట్‌లోకి (సడక్ సే సంసద్) వెళ్లేలా యువత ఉండాలన్నారు. 21 యేళ్లకే లోక్‌సభకు పోటీ చేసే అవకాశం ఉంటే సభలోనే జెన్ జీ గళాన్ని వినిపించే అవకాశం ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. లోక్‌సభ, రాజ్యసభల్లో జెన్ జీ గళం వినిపించడం ద్వారా యువతకు దేశాన్నిపాలించే అవకాశం ఇవ్వాలని శాసనసభలో తీర్మానం చేస్తామని సిఎం పునరుద్ఘాటించారు. కేంద్రంలో రాహుల్ గాంధీ నేతృత్వంలో ఏర్పాటయ్యే ప్రభుత్వం విద్యా శాఖ జెన్ జీ నేతకు వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ అంశంలో రాహుల్ గాంధీని, ఇండియా కూటమి నేతలను ఒప్పిస్తానని సిఎం తెలిపారు. విద్యా శాఖ, ఐటి శాఖ వంటి కీలకమైన శాఖలు.. 60, 70, 90 యేళ్ల వాళ్లకు కాదు 21 వాళ్లకే ఇవ్వాలని, వాళ్లకేం కావాలో వాళ్లకే తెలుసని సిఎం అన్నారు. జెన్ జీ పోరాట పటిమను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసించారు. జెన్ జీ సాధించిన విజయాలను కాంగ్రెస్ పార్టీ ఖాతాలో రాసుకునే ఉద్దేశం తమకు లేదని సిఎం స్పష్టం చేశారు. లాఠీలు, తూటాలకు తలవంచకుండా పోరాడి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మెడలు వంచి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాగలిగారని ప్రశంసించారు. విద్యార్థుల మొహాల్లో కనిపిస్తున్న ఆనందమే అసలైన విజయమని సిఎం రేవంత్ పేర్కొన్నారు. చప్పన్ ఇంచ్ (58 ఇంచుల)ఛాతీ అంటూ గొప్పలు చెప్పుకునే నాయకత్వం,దేశ యువత ముందు ఓడిపోయిందని విమర్శించారు.ఈ దేశం జన్‌జీ ది, దేశ భవిష్యత్తే యువతరం భవిష్యత్తు, దేశం భవిష్యత్తు బాగుంటే యువతరం భవిష్యత్తు బాగుంటుంది. ప్రజాస్వామిక వాదులంతా దిక్కులు పిక్కటిల్లేలా యువతకు మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. అయితే విద్యార్థులపై నమోదైన కేసులు ఇంకా తొలగించలేదని, వెంటనే వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నీట్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరామర్శించలేదని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకూ వారి తరఫున కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని సిఎం స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పోరాటం ముగిసిపోలేదని సిఎం అన్నారు. పరీక్ష పేపర్ల లీక్‌తో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లింపు, ఉద్యమం సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులపై కేసులు సోమవారం లోపు ఎత్తివేయకపోతే పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ, ఖర్గేల నాయకత్వంలో కాంగ్రెస్ పోరాడుతుందని సిఎం తెలిపారు.

**మోదీ చరిష్మా తగ్గింది: మహేశ్‌కుమార్‌గౌడ్**

విద్యార్థుల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేంద్రం మెడలు వంచినందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని పేర్కొన్నారు. మోడీ చరిష్మా తగ్గిందని, ఆయన చర్యలను ప్రపంచం ఖండించిందని వ్యాఖ్యానించారు. జెన్ జీ యువతకు చట్టసభల్లో ప్రాతినిథ్యం కల్పించాలని మహేష్ గౌడ్ అన్నారు. 21ఏళ్లకే చట్టసభల్లోకి వచ్చే అవకాశం కల్పించేలా చట్టం తీసుకురావాలని, ఈ మార్పును తెలంగాణ నుంచే ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేంనరేందర్‌రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు దానంనాగేందర్, అరికెపూడిగాంధీ, వల్లాలనవీన్‌యాదవ్, శ్రీగణేష్, టి.రామ్మోహన్ రెడ్డి, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐనేత పల్లా వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో మోహన్ భగవత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై25:** ఆర్ఎస్ఎస్ చీఫ్.డా. మోహన్ భాగవత్ శనివారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఆదివారం నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. బంజారాహిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసి భవన్‌లో "యుగానుకూల మాతృత్వం". అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇవ్వనున్నారు. మధ్యాహ్నం 3:00 నుండి సాయంత్రం 7:00 వరకు ఈ కార్యక్రమం జరుగనుంది.

# 100 రోజుల యాక్షన్ ప్లాన్

>> గ్రామాలకు సాధారణ స్థాయిలో తాగునీటి సరఫరా కొనసాగుతుండటం సానుకూల పరిణామమని, మిగిలిన ప్రాంతాల్లోనూ సమస్యలు వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే 145 పట్టణ స్థానిక సంస్థల్లో 140 యూఎల్‌బీలకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా కొనసాగుతుండటం, మిగిలిన మున్సిపాలిటీలో కూడా ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా జరుగుతూ ఉండటం సంతృప్తికరమని పేర్కొన్నారు. పైప్‌లైన్ లీకేజీలు, మరమ్మతుల కారణంగా ఒకరోజైనా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే పరిస్థితి వస్తే ముందుగానే గ్రామస్తులకు సమాచారం ఇవ్వాలని, తద్వారా ప్రజలు అవసరమైన ఏర్పాట్లు చేసుకునే అవకాశం ఉంటుందని సూచించారు.

# 'రెడ్ సీ'లో తీవ్ర ఉద్రిక్తత

>> ఉద్రిక్తతలు పెరగడం ప్రపంచ సముద్ర వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. సౌదీకి అనుబంధంగా ఉన్న నౌకలను బాబ్ అల్‌మండెబ్ జలసంధి గుండా వెళ్లనివ్వబోమని హౌతీలు ఇప్పటికే ప్రకటించారు. ప్రపంచ వాణిజ్యంలో సుమారు 12 శాతం సరుకు రవాణా, కంటైనర్ రవాణాలో దాదాపు నాలుగో వంతు ఈ మార్గం ద్వారానే జరుగుతుంది.ఈ వారం ఎర్ర సముద్రంలో సౌదీకి చెందిన రెండు చమురు ట్యాంకర్లను హౌతీలు లక్ష్యంగా చేసుకుని హౌతీలు దాడులుచేస్తే ప్రతిగా సౌదీ నేతృత్వంలోని కూటమి యెమెన్‌లోని హుదైదా నగరంపై వైమానిక దాడులు నిర్వహించింది.

# 'ధరణి' విచారణలో సిట్‌కు విస్తృతాధికారాలు

## సిఐడి బాస్ చారుసిన్హా ఆధ్వర్యంలో కొనసాగనున్న దర్యాప్తు

**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సాగు భూముల లావా దేవీల పోర్టల్ ధరణిలో వెలుగు చూసిన అక్రమాలను నిగ్గు తేల్చేందు కు ఏర్పాటైన సిట్‌కు విస్తృతాధికారాలు కల్పిస్తూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. పోర్టల్ సాఫ్ట్‌వేర్ రూపకల్పన మొదలుకుని టెండర్ ప్రకట న, బిడ్‌ల దాఖలు, కాంట్రాక్టర్ ఎంపిక, అనంతరం పోర్టల్‌లో జరిగిన లావాదేవీలు, దీని తరువాత పోర్టల్ వెలుపల జరిగిన గోల్‌మాల్ లావా దేవీలపై సమగ్ర విచారణ బాధ్యతలను సిట్‌కు సర్కారు అప్పగించింది. ఎసిబి డిజి చారు సిన్హా నేతృత్వంలో ఏర్పాటైన సిట్‌లో ముగ్గురు ఐఎఎ స్ అధికారులు మరో ముగ్గురు ఐపిఎస్ అధికారులు సహా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) నుంచి సాంకేతి క నిపుణుడు ఒకరు నియమితులయ్యారు. ధరణి పోర్టల్‌లో భూ అక్రమాలు జరిగాయని పలు వేదికలపై సిఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మ ంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, కాంగ్రెస్ నాయకులు అనేకమార్లు పేర్కొనడం తెలిసిందే. ఈ క్రమంలో ధరణి పోర్టల్‌ను ప్రైవేటు సంస్థ నుంచి తొలగించి ఎన్ఐసీకి అప్పగించిన కాంగ్రెస్ సర్కారు దీని పేరును భూ భారతిగా మార్చడం విదితమే. ఈ క్రమ ంలో ధరణి పోర్టల్ అమల్లో వున్న సమయంలో భూ అక్రమాలను వెలికి తీసేందుకు మొదట ఫోరెన్సిక్ నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిన ప్ర భుత్వం గోల్‌మాల్ వ్యవహారాలకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని సేకరించింది. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో భూ అక్రమా లు, ధరణి పోర్టల్ ఏర్పాటులో నిబంధనల ఉల్లంఘనలపై చర్చించింది. అనంతరం ధరణి పోర్టల్‌లో అక్రమాలను నిగ్గు తేల్చేందుకు సిట్‌ను ఏ ర్పాటు చేయాలని నిర్ణయించి సిఐడి డిజి చారు సిన్హాను దానికి బాస్‌గా నియమించింది. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి వచ్చిన అక్రమాలతో పాటు విధానపరమైన లోపాలను సిట్‌కు అందించింది. వీటిపై సమగ్రంగా విచారించాలని సిట్‌ను సర్కారు ఆదేశించింది. 2020 అక్టోబర్ 29వ తేదీన ధరణి పోర్టల్ ప్రారంభం కాగా దీనికి సంబంధించి తెలంగాణ టెక్నాలజి సర్వీసెస్ ఈ టెండర్‌ను ఆహ్వానించింది. అయితే ఇందేలె బిడ్‌ల దాఖలు, వాటి మదింపు, టెండర్ కేటాయింపు, డిజైన్ అభివృద్ధి, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు సంబంధించి అనేక లోపా లున్నట్లు ఫిర్యాదులు అందాయి. చట్టబద్ధంగా టెండర్ ప్రక్రియ జరిగిందా...? అనే దానిపై సిట్ విచారించనుంది. ప్రభుత్వం ఎంపిక చేసిన స ంస్థకు సంబంధించి అప్పట్లో దివాలాతీసినట్లు ఆరోపణలు వున్నాయి. దీనికి సంబంధించి బాధ్యులెవరనేది సిట్ తేల్చనుంది. ఇదే సమయంలో దివాలా తీసిన సంస్థలో భారీగా పెట్టుబడులు రాగా ఈ వివరాలు ఆర్‌బిఐ వద్ద కానీ సెబీ వద్ద కానీ నమోదు కాకపోవడం అనుమానాలకు తావిచ్చింది. దీనిపైనా సిట్ విచారించనుంది.

దీంతో పాటు ధరణి పోర్టల్ నిర్వహణ సందర్భంగా అనధికార లావాదేవీలు, పోర్టల్ భద్రతకు భంగ ం కలిగించి సున్నిత మైన భూయాజమాన్య హక్కులకు నష్టం కలిగించి వుంటుందనే కోణంలోనూ సిట్ విచారించనుంది. పోర్టల్ లావాదేవీల రుసుము చెల్లింపు గేట్‌వేలో అనేక లోపాలుండడం, నిబంధనల ప్రకారం రుసుకు ప్రభుత్వ ట్రెజరీలో జమాకాక పోవడం వంటి లోపాలు వెలు గు చూశాయి. ఇదంతా ధరణి వెలుపల జరిగిన లావాదేవీల వల్ల జరిగిందని ఫిర్యాదులు అందాయి. దీనివల్ల అనేన మంది లబ్ధి పొందారని అ నుమానాలు వున్నాయి. అధికారిక పనిగంటలు ముగిసిన తరువాత కార్యాలయాల బయట లావాదే వీలు జరగడం, ఆడిటింగ్ లేకపోవడం, పో ర్టల్‌లోకి లాగిన్ అయిన ఆధారాలేవి లేకుండా చేసిన అంశాలపైనా సిట్ కులంకుశంగా విచారించనుంది. దీనికి బాధ్యులైన వారిని సిట్ గుర్తించ నుంది. ఇం దుకు సంబంధించి సిట్ జరనపున్న విచారణకు సాటి సర్కారీ విభాగాలు పూర్తి సహకారం అందించా లని ప్రభుత్వం ఆదేశించింది . ఈ విషయంలో సహాయం కోసం నిపుణులను నియమించుకునే అధికా రం సిట్‌కు ఇస్తూ సర్కారు ఆదేశాలు జారీ చేసింది. సిట్ విచా రణపై ఎప్పటికప్పుడు వివరాలను సర్కారుకు అందజేయాల్సి వుంటుంది. కాగా సిట్‌లో సిఐ సెల్ ఎస్‌పి సింధూ శర్మ, టిజిసిఎస్‌బి ఎస్‌పి హర్షవర్ధన్, రాష్ట్ర ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, భూపరిపాలన విభాగంలోని సిఎంఆర్ ప్రాజెక్టు డైరక్టర్ అపూర్వ్ చౌహాన్, ఐటిడిఎ పిఓ మందా మకరంద్, ఎన్ఐసీ నుంచి ఒక నిపుణులు ఉన్నారు.

# మైక్రో ఇరిగేషన్‌కు ప్రాధాన్యత

### డ్రిప్ పరికరాల ఏర్పాటులో వేగం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, జులై 25, ప్రభాత వార్త:** ఎల్‌నినో పరిస్థితుల నేప థ్యంలో రాష్ట్రంలో మైక్రో ఇరిగేష న్‌కు ప్రాధాన్యత ఇస్తు న్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలి పారు. హైదరా బాద్‌లో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వర్షా భావాన్ని దృష్టిలో ఉంచు కుని డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించి రైతులకు ఉపశమనం కల్పించే అవకాశం ఉందన్నారు. డ్రిప్ వ్యవస్థ వల్ల తక్కువ నీరు, తక్కువ విద్యుత్, తక్కువ పురుగుమందులతో అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 65,446 ఎకరాలకు అనుమతులు ఇచ్చినప్పటికీ, కేవలం 34,909 ఎకరాల్లో మాత్రమే డ్రిప్ వ్యవస్థల ఏర్పాటు పూర్తైందని అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఇంకా 30,537 ఎకరాల్లో పనులు పెండింగ్‌లో ఉండటం సరికాదని తెలిపారు. కేటాయించిన జిల్లాల్లో పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు కంపెనీలు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి రైతులకు డ్రిప్ వ్యవస్థల ఏర్పాటు వేగవంతం చేయాలని సూచించారు. పరికరాల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని, ప్రమాణాలకు అనుగుణమైన సామగ్రినే అందిం చాలని స్పష్టం చేశారు. వ్యవస్థల ఏర్పాటు అనంతరం ఆఫ్టర్ సేల్స్ సర్వీ స్‌ను క్రమంతప్పకుండా అందిస్తూ, రైతుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరిం చాలని ఆదేశించారు. జాతీయ, అంత ర్జాతీయ మైక్రో ఇరిగేషన్ కంపెనీలు తెలంగాణలో పనిచేయడానికి ఆసక్తి చూపితే, వాటిని కూడా ఎంప్యానెల్ చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు.

# జగ్గారెడ్డి తుంగతుర్తి నివేదిక ఆలస్యం!

### కోమటిరెడ్డి బ్రదర్స్‌పై తీవ్రవ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే సామెల్

### రసకందాయంలో తుంగతుర్తి పంచాయితీ

**హైదరాబాద్, జులై 15, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌లో తుంగతుర్తి పంచాయితీ మరోమారు తీవ్రరూపం దాల్చడంతో పిసిసి పరిశీలకుడిగా నియ మిం చిన జగ్గారెడ్డి శనివారం నివేదిక ఇవ్వాల్సి ఉన్నప్పటికీ వాయిదా వేశారు. నల్లగొండ కాంగ్రెస్‌లో అత్యంత కీలక వ్యక్తులు కోమటిరెడ్డి బ్రదర్స్‌పై తుంగతుర్తి ఎమ్మెల్యే సామెల్ మళ్లీ శనివారం కూడా తీవ్రవ్యాఖ్యలు చేయడంతో జగ్గారెడ్డి సిద్ధం చేసిన ఏడు పేజీల నివేదిక పిసిసి చీఫ్‌కు అందించకుండా జరుగుతున్న పరిణామాలను క్రోడీకరించి సమగ్ర నివే దిక ఇచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు చర్చించుకొంటున్నాయి. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ శనివారం కోమటిరెడ్డి బ్రదర్స్‌ను లక్ష్యంగా చేసుకుని మళ్లీ విరుచుకుపడ్డారు. మునుగోడులో రాజ గోపాల్‌రెడ్డిని తన కేడర్ కార్యకర్తలే గెలిపించారని, ఇప్పుడు తన కేడర్ బాధ పడుతుందన్నారు. 'టికెట్టు నా చేతిలో లేదు.. రాజగోపాల్‌రెడ్డి చేతిలో అంతకన్నా లేదు. తనకు ఎఐసిసి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిందని, రాజగోపాల్‌రెడ్డి ఇవ్వలేదని, నన్ను గెలపించింది రాజగోపాల్‌రెడ్డి కాదు పార్టీ' అని తీవ్రస్థాయి విమర్శలు చేశారు. కాంగ్రెస్‌లో తానే ముందు నుంచి ఉన్నానని మునుగోడు ఉపఎన్నికల సమయంలో రాజగోపాల్ రెడ్డిని గెలిపించేందుకు తన కేడర్ ఎంతో కష్టపడిందని, ఇప్పుడు వారే బాధపడుతున్నారని ఆగ్రహంతో అన్నారు. కోమటిరెడ్డి సోదరులు నా నియోజకవర్గంలో జోక్యం చేసుకోవద్దని, పార్టీ కోసం పనిచేసే కార్య కర్తలకు ఇకపై అధిష్ఠానం ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వీరేశం 60 వేల మెజారిటీతో, తాను 50 వేల మెజారిటీతో గెలిచామని మా గెలుపుపై హీనంగా మాట్లాడుతున్నారని మీ దగ్గర మేము చేతులు చాచి గెలవలేదని మండిపడ్డారు. మునుగోడులో అభివృద్ధి జరగలేదు, పరిస్థితి బాగాలేదని తనకు కూడా రిపోర్ట్ వచ్చిందని, రాజగోపాల్‌రెడ్డి దీనికి సమాధానం ఏం చెబుతారని సామెల్ నిలదీశారు.

**జగ్గారెడ్డి నివేదిక సిద్ధం.. సమర్పించడం వాయిదా**

తుంగతుర్తి నియోజకవర్గంలోని కాంగ్రెస్ తొమ్మిది మండల అధ్యక్షుల నియామకంతో ఎమ్మెల్యే మందుల సామెల్ వర్గం, ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి, పాత కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలు తలెత్తడంతోపాటు పరస్పరం కర్రలు, రాళ్లతో కొట్టుకునే వరకు చేరింది. తుంగతుర్తి పరిశీలకుడిగా జగ్గారెడ్డిని పార్టీ నియమించింది.

పార్టీ ఆదేశాలతో రంగంలోకి దిగిన జగ్గారెడ్డి ఇరువర్గాలతో వేరువేరుగా సమావేశమ య్యారు. జగ్గారెడ్డి ఏడు పేజిల నివేదిక రూపొందించి శుక్రవారం పిసిసి చీఫ్‌కు సమర్పించి ఉండాల్సింది కానీ రాహుల్‌గాంధీ అరెస్టుతో ఉద్యమాల్లో ఉండటంతో వాయిదా పడింది. శనివారం మధ్యాహ్నం గాంధీభవన్‌లో మహేశ్‌కుమార్‌గౌడ్‌తో భేటీ అయి ఆ నివేదికను ఆయనకు జగ్గారెడ్డి సమర్పించాలని భావించారు. శుక్రవారం తిరుమ లగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సామెల్ మాట్లాడుతూ రాజగోపాల్‌రెడ్డి బిజెపిలోకి పోయి, రాహుల్‌గాంధీని తిట్టి, ఎన్నికల ప్పుడు మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చాడని చరిత్రను గుర్తుచేశారు. తన హక్కులను హరించిందుకు రాజగోపాల్‌రెడ్డిపై రాహుల్‌గాంధీ, ఖర్గేలకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. తొమ్మిది మంది మండల అధ్యక్షు లను తానే ప్రకటించానని, ఆపే దమ్ము నీకు ఎవరు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో వేలు పెడితే పనికిరాకుండా చేస్తానని హెచ్చరించారు. దీనితో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందిస్తూ తుంగతుర్తి కాంగ్రెస్ కార్యకర్తలకు క్షమాపణలు చెబుతున్నా నని, అక్కడ తప్పుడు వ్యక్తిని బరిలో దింపి గెలిపించానని అన్నారు. టికెట్ కోసం ముంద సామేల్ తన ఇంటికి వందసార్లు వచ్చాడని వ్యాఖ్యానించారు. చాలా మంది టికెట్ కోసం పోటిపడినా మాటిచ్చానని సామేల్ కు టికెట్ ఇప్పించి గెలిపించానని అన్నారు. ఎస్‌సి నియోజక వర్గంపై మీ ఆధిపత్యం ఏమిటి, పార్టీ ఏమైనా మీ జాగీరా అంటూ సామెల్ కామెంట్ చేయగా, సామెల్‌కు టికెట్ ఇప్పించి గెలిపించింది తానే అంటూ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కౌంటర్ ఇవ్వడంతో ఈ పంచాయితీ అధికార పార్టీలో ఇప్పుడు పెద్ద అలజడిగా మారింది.

**నేను చూడని రాజకీయం కాదు:జగ్గారెడ్డి**

పార్టీ ఆదేశాలతో పది రోజుల సమయం తీసుకుని ఇరుపక్షాల వ్యాఖ్య లను విని పరిశీలించి నివేదిక సిద్ధం చేశానని జగ్గారెడ్డి చెప్పారు. ఇదంతా తాను చూడని రాజకీయం కాదని, ఎవరి కెపాసిటీ ఏమిటో తనకు బాగా తెలుసని, కెపాసిటీ ఉందని అనుకునే వారిని చాలా మం దిని చూశానని, అవేవి తనను ప్రభావితం చేయవన్నారు. మొదటి ప్రాధాన్యత ఎమ్మెల్యే, రెండో ప్రాధాన్యత ఎంపి మూడో ప్రాధాన్యత పార్టీ కార్యకర్తల పక్షాన డిసిసి ప్రెసిడెంట్‌కు ఉంటుందని ఈ విషయాన్ని తాను ఇది వరకే చెప్పానన్నారు.

ఒకరికి సానుకూలంగా మరొకరికి వ్యతిరేకంగా రిపోర్టు తయారు చేయనని ఆయన వివరించారు.ఏడు పేజిల పార్టీ విధానాలను, అందరి అభిప్రాయం ప్రకారమే నివేదిక రూపొందించానన్నారు. తాజా అలజడి పరిశీలనలోకి తీసుకొని సమగ్రంగా నివేదిక తయారుచేసి అధిష్ఠానానికి ఇస్తానని జగ్గారెడ్డి అన్నారు.

**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION**
**VISAKHAPATNAM**

RFP Tender Notice No.30/2026-27/CE (GVMC) / SE (East) / EE (East) / GVMC/ Dt: 18-07-2026 (2nd call)

| | | |
|---|---|---|
| 01. No.of Works | : | 1 (One) (RFP Tender) |
| 02. Downloading Starting Date | : | 20-07-2026 @ 10.00 PM |
| 03. Downloading End Date | : | 04-08-2026 @ 04.00 PM |
| 04. Last date for Submission of bid | : | 04-08-2026 @ 05.00 PM |

Further details at http://www.apeprocurement.gov.in

O/o The Executive Engineer (East) Division Sd/- Commissioner, GVMC

తెలంగాణ ప్రభుత్వం
**కోదాడ మునిసిపాలిటీ కార్యాలయం, సూర్యాపేట జిల్లా**
ఆసక్తి యొక్క వ్యక్తీకరణ ఆహ్వానిస్తూ ప్రకటన (EOI)

లేఖ నం. MCK/E1/120/2026-27 తేది: 25.07.2026

కోదాడ మునిసిపాలిటీలో ఘన వ్యర్థాల నిర్వహణ వ్యర్థ లక్షణాల అధ్యయనం నిర్వర్తించటానికి, అటువంటి పనిలో నిరూపితమైన నైపుణ్యం గల అనుభవజ్ఞులైన కన్సల్టెంట్‌ల నుండి సీల్డ్ ఆసక్తి వ్యక్తీకరణలు (EOI) కోరబడుతున్నవి. దాఖలుకు చివరి తేది మరియు సమయం: తేది: 29.07.2026 సమయం: మ.3.00గం. పని యొక్క పరిధి: 1. సాంపిల్ సేకరణ మరియు వేరు చేయుట: ప్రామాణిక వ్యర్థ లక్షణాల ప్రోటోకాల్స్ ప్రకారం మునిసిపల్ ఘనవ్యర్థ పదార్థాల సాంపిల్స్ మరియు వేర్పాటు ప్రాతినిధ్యం సేకరణ. 2. భౌతికంగా లక్షణాల వివరణ: కన్సల్టెంట్ ఈ క్రింది భౌతిక లక్షణ పారా మీటర్‌ల యొక్క విశ్లేషణ చేపట్టవలసి వుంది. • సామూహిక సాంద్రత. • తడి వస్తు స్థాయి. • కెలోరిఫిక్ విలువ (మొత్తం మరియు నికరం). • బూడిద వున్న స్థాయి. • మార్పు పొందే మేటర్. • కార్బన్ స్థిరత్వం. • నిప్పు కారణంగా కోల్పోయే నష్టం (LOI). 3. రసాయనిక లక్షణ వివరణ : అతిముఖ్యమైన రసాయనిక గుణ ధర్మాల విశ్లేషణ, వీటితో కలిపి. • PH విలువ. • నత్రజని (N) ఫాస్ఫరస్ (P) మరియు పొటాషియం (K). • మొత్తం ఆర్గానిక్ కర్బనం (TOC). • కార్బన్-టు-నైట్రోజన్ (C/N) నిష్పత్తి. • తిరస్కరించబడే విధంగా ఉద్భవించే ఇంధనం (RDF) అనువైన మూల్యాంకనకు అంతిమ విశ్లేషణ (CHNSO). 4. డాక్యుమెంటేషన్: సమగ్ర వ్యర్థాల లక్షణాలు వివరించే రిపోర్ట్ యొక్క తయారీ మరియు దాఖలు చేయటంలో. • అవలంబించిన పద్ధతిక్రమం. • క్షేత్ర పరిశీలనలు. • ప్రయోగశాల విశ్లేషణ ఫలితాలు. • ముగింపు నిర్ధారణ మరియు సిఫార్సులు. 5. ప్రభుత్వ నిర్దేశిత సూచనలతో వర్తింపు: కమిషనర్ మరియు డైరక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తెలంగాణ, హైదరాబాద్ వారిచే జారీ చేయబడిన సర్క్యులర్ Roc.No.E-36833/2025/HI/ తేది: 03-12-2025లో నిర్దేశించబడిన అన్ని ఆవశ్యకతలకు అనుగుణంగా మరియు ఏదైనా ఇతర వర్తించే మార్గదర్శకాలకు అనుగుణంగా కన్సల్టెంట్ వర్తింపచేయవలెను. అదనపు సమాచారం: తదుపరి వివరాలకు ఆసక్తి గల ఏజెన్సీలు కోదాడ మునిసిపాలిటీ ఇంజనీరింగ్ సెక్షన్‌ను కార్యాలయ పని వేళలలో సంప్రదించవచ్చును. కాంటాక్ట్ వివరాలు: కమిషనర్: మొబైల్: 8374450356, మునిసిపల్ ఇంజనీర్: మొబైల్: 8374450357.

సం/-. కమిషనర్, కోదాడ మునిసిపాలిటీ.

DIPR.NO. 6777-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 25.07.2026

# గ్రామీణ రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

### త్వరలో హ్యామ్ రహదారుల పనులు ప్రారంభిస్తాం

### సచివాలయంలో హ్యామ్ రోడ్ల పురోగతిపై

### మంత్రి సీతక్క ఉన్నతస్థాయి సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై25:** పట్టణ ప్రాంత రోడ్లకు ఏమాత్రం తీసిపోని రీతిలో గ్రామీణ రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి ఆనసూయ సీతక్క స్పష్టం చేశారు. అందుకోసమే అత్యంత ఆధునికమైన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) విధానాన్ని అవలంబిస్తున్నామని చెప్పారు. సచివాలయంలో శనివారం పంచాయతీ రాజ్ శాఖ స్పెషల్ సీఎస్ దానకిషోర్, ఈఎన్సీ జోగారెడ్డి, సీఈలతో కలిపి గ్రామీణ హ్యామ్ రోడ్ల నిర్మాణ పురోగతిపై మంత్రి సుదీర్ఘంగా సమీక్షి ంచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి గ్రామానికి నాణ్యమైన రోడ్డు కనెక్టివిటీ ఉండాలనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష అని వెల్లడించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా హ్యామ్ మోడల్‌లో మొత్తంగా 6,703 గ్రామాల్లో 18,472 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోంది. అందులో మొదటి విడత కింద 2,678 గ్రామాల్లో 7,450 కిలోమీటర్ల మేర రోడ్ల విస్తరణ, పునర్నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు.మొదటి విడుతలో 90 శాతం పనులు ప్రస్తుతం ఉన్న రహదారుల ఆదునీకరణ పనులకే ప్రధాన్యమిస్తున్నామని వెల్లడించారు. దశాబ్దాలుగా రవాణా సౌకర్యం లేని 179 గ్రామాలకు తొలిసారిగా 934 కిలోమీటర్ల మేర బిటి, సిసి రోడ్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న హ్యామ్ విధానాన్ని దేశమంతా ఆసక్తిగా పరిశీలిస్తున్నందున మార్గదర్శకాలను అత్యంత సమగ్రంగా రూపొందించామని మంత్రి స్పష్టం చేశారు. ఆర్బీఐ అనుమతుల వచ్చే వారంలోగా పూర్తి స్థాయిలో రానున్నాయని, ఆగస్టు 15 నాటికి కాంట్రాక్ట్ అగ్రిమెంట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అగ్రిమెంట్లు కాగానే కాంట్రాక్టర్లు వెంటనే పనులు ప్రారంభించాలని, టెండర్లు దక్కించుకోవడంలో చూపిన ఉత్సాహం పనులు పూర్తి చేయడంలోనూ చూపాలని స్పష్టం చేశారు. పనులను సొంత బాధ్యతగా స్వీకరించాలని కాంట్రాక్టర్లకు సూచించారు.గతంలో సింగిల్ రోడ్డు ఉన్న చోట కూడా ఇప్పుడు భారీ వాహనాలు వెళ్లేలా నాణ్యతతో రోడ్లను నిర్మించాలని తెలిపారు. పనుల్లో ఆలస్యం లేకుండా భూసమీకరణ, చెట్ల తొలగింపు వంటి అంశాలపై జిల్లా కలెక్టర్లకు తక్షణమే సర్క్యులర్ జారీ చేయాలన్నారు. సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇప్పించాలని, అటవీ భూములు ఉన్న ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సమస్యలను స్థానిక అధికారుల సహాయంతో పరిష్కరించుకోవాలని సూచించారు. నిర్మాణంలో ఏవైనా సమస్యలు ఎదురైతే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని కాంట్రాక్టర్లకు మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు.

# వర్షాభావంతో ఎరువులు ఫుల్

### ఆరుతడి పంటలతో తగ్గిన వినియోగం

**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త:** తెలంగాణలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ పంటల సాగు నత్తనడకగా సాగుతోంది. ప్రధానంగా వర్షాలు సకాలంలో, సరిపడా కురవకపోవడంతో పాటు, ఉష్ణోగ్రతలు కూడా పెరగడంతో వేసిన పంటలు దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు రైతులు ప్రత్యమ్నాయ పంటల వైపు దృష్టిసారించారు. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు యూరియాను విరివిగా ఉపయోగిస్తుండగా, ఈ సారి నీటి లభ్యత లేకపోవడంతో చాలా మంది రైతులు ఇంకా నాట్లను కూడా వేయలేదు. ఫలితంగా ప్రస్తుత ఖరీఫ్ సీజను లో రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల వినియోగంలో తగ్గుదల చోటుచేసుకుంది. దీంతో రాష్ట్రంలో యూరియా తదితర ఎరువులు నిల్వలు ఫుల్‌గా ఉన్నాయి.

# హాలిడే ప్యాకేజీల పేరుతో భారీ మోసం

## 15 మంది పసిఫిక్ హాలిడే వరల్డ్ ఉద్యోగుల అరెస్టు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జులై 25, ప్రభాతవార్త:** షాపింగ్ మాల్స్, షోరూంల వద్ద ఉచిత కూపన్లు, గిఫ్ట్ వోచర్ల పేరుతో మన సమాచారం మొత్తం సేకరిస్తున్న నిందితులు వాటి ఆధారంగా హాలిడే ప్యాకేజీల పేరుతో భారీ మోసానికి పాల్పడుతు న్నారు. తమ సంస్థ నుంచి సభ్యత్వం తీసుకుంటే దేశ, విదేశాల్లోని హోటళ్లు, రిసార్టుల్లో ప్రవేశం ఉచితమంటూ వాగ్దానాలు చేస్తూ అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు. ఏకంగా ఫైవ్‌స్టార్ హోటల్‌లో మకాం వేసి, అమాయకులను బురిడీ కొట్టించి సభ్యత్వం పేరుతో భారీగా డబ్బు దండుకుంటున్నారు. అనంతరం పత్తా లేకుండా పోతున్న ఈ గ్యాంగ్ బండారాన్ని గచ్చిబౌలి పోలీ సులు చేధించారు. పసిపిక్ హాలిడే వరల్డ్ సంస్థకు చెందిన 15మంది ఉద్యోగులను అరెస్టు చేసిన గచ్చిబౌలి పోలీసులు వీరి బారిన పడి 19 మంది అమాయకులు 22 లక్షలు మోసపోయారని గుర్తించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను శేరిలింగంపల్లి ఏడిసిపి ఉదయ్‌రెడ్డి వెల్లడించారు.

న్యూఢిల్లీకి చెందిన 4ఆర్ సీజన్స్ హాలిడే ప్రైవేట్ లిమిడెట్‌కు చెందిన బ్రాంచ్‌గా పసిపిక్ హాలిడే వర ల్డ్‌ను రాజేశ్‌కుమార్, ఎండి దిహాన్ అక్తర్, అబ్దుల్ రషీద్, రామ్‌సింగ్ దామీలు డైరెక్టర్లుగా నిర్వహి స్తున్నారు. వీరు అమాయకులను హాలిడే ప్యాకేజీల పేరుతో మోసం చేయడమే ధ్యేయంగా పనిచేయ సాగారు. ఇందులో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారిని సేల్స్ ఎగ్జిక్యూటివ్ లుగా, కన్సల్టెంట్లుగా నియమించుకు న్నారు. వీరు ఎంపిక చేసిన నగరాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి అమాయ కులను హాలిడే ప్యాకేజీల పేరుతో మోసం చేయ సాగారు. ఇదే క్రమం లో వివిధ ప్రాంతాలకు చెందిన మహహ్మద్ అఖిఫ్, శివమ్‌శర్మ, షాను కుమార్, సాంతోష్ కుమార్, పీయూష్, జయ్ సంఘాల్, అపర్ణా చౌహాన్, శుభం శుక్లా, మోహిత్ చౌహాన్, హిమాన్షు నిఘమ్, అనక్ అగర్వాల్, ఆయుష్ బాజ్‌పాయ్, అమిత్, ప్రణయ్ పాండే, ప్రశాంత్ కుమార్‌లను సేల్స్ ఎగ్జిక్యూటివ్ లుగా తమ సంస్థలో నియమించుకున్నారు. కాగా వీరందరిని నగరానికి పంపించి గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో 15 రోజుల క్యాంపును వీరి ద్వారా నిర్వహించారు. అంతకు ముందే పలు షాపింగ్ మాల్స్, షోరూంల వద్ద ఉచిత కూపన్లు, గిఫ్ట్ వోచర్ల పేరుతో సేకరించిన డేటాతో అమాయకులకు హాలిడే ప్యాకేజీ పేరుతో వల వేయసాగారు. తమ లక్కీ డ్రాలో ఎంపికయ్యా రంటూ రాడిసన్ హోటల్‌కు అమాయకులను పిలిపించి తమ సంస్థలో సంవత్సరం, లైఫ్‌టైం ప్యాకేజీ తీసుకుంటే 128 దేశాల్లోని తమతో అనుసంధానమై ఉన్న హోటళ్లలో సంవత్సరంలో 7రోజుల పాటు ఉచిత వసతి కల్పిస్తామంటూ నమ్మించే వారు. ఈ విధంగా 19 మంది వద్ద నుంచి 1లక్ష రూపాయల నుంచి 3.50లక్షల రూపాయల వరకు వసూలు చేశారు. నగరానికి చెందిన ఓ బాధితుడు వీరి మాటలు నమ్మి లైఫ్‌టైం ప్యాకేజీ కోసం 3.40 లక్షలు చెల్లించాడు. అనంతరం వీరి వద్ద నుంచి స్పందన లేకపోవడంతో మోసపోయానని గుర్తించి గచ్చిబౌలి పోలీసులను ఈనెల 24వ తేదీన ఆశ్రయించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని అమాయకులను మోసం చేస్తున్న పసిపిక్ హాలిడే ఉద్యోగులు 15మందిని రాడిసన్ హోటల్‌లో అరెస్టు చేశారు. కంపెనీ డైరెక్టర్లు పరారీలో ఉన్నారు. ఈ ముఠా మాటలు నమ్మి 19మంది 22 లక్షల మేర మోసపోయినట్లు గుర్తించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.




సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న శేరిలింగంపల్లి డిసిపి ఉదయ్‌రెడ్డి తదితరులు

**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు)

AU SMALL FINANCE BANK — A SCHEDULED COMMERCIAL BANK

నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001 (CIN: L36911RJ1996PLC011381)

**అనుబంధం-IV (8 (1) నిబంధన చూడండి) స్వాధీనతా ప్రకటన**

"ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్", "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్"తో ఏప్రిల్ 01, 2024 నుండి విలీనం అయిందని రుణగ్రహీతలందరికీ మరియు ప్రజలకు తెలియజేయడానికి ఇది. అయితే, కింద సంతకందారు "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) కింద AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారి మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడిన సెక్షన్ 13 (12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీ చేశారు. దిగువ పేర్కొన్న తేదీకి రుణగ్రహీతలు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలని పిలుపునిచ్చారు:-

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/ హామీదారు పేరు/రుణ ఖాతా నం. | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
|---|---|---|
| (లోన్ ఎ/సి నెం.), 23660001317046, దొంటగాని రాజా గౌడ్ (రుణగ్రహీత), దొంటగాని ఉమ (సహ-రుణగ్రహీత) | 25-జూలై-25 రూ. 12,09,420/- పన్నెండు లక్షల తొమ్మిది వేల నాలుగు వందల ఇరవై రూపాయలు మాత్రమే 25-జూలై-25 నాటికి | 21-జూలై-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ** RCC పైకప్పుతో కూడిన గ్రౌండ్ ఫ్లోర్ 237-77 చదరపు అడుగులు, AC షీట్ పైకప్పుతో కూడిన భాగం టాయిలెట్లతో సహా - 538.52 చదరపు అడుగులు మరియు 155-50 చదరపు గజాల విస్తీర్ణం గల స్థలం విద్యుత్ ఫిట్టింగ్‌లు మరియు ఇతర అమరికలతో సహా. ఈ షెడ్యూల్ ఆస్తి ముత్తగూడెం గ్రామ పంచాయతీ, ముత్తగూడెం రెవెన్యూ పరిధి, ఖమ్మం రూరల్ మండలం, ఖమ్మం రూరల్ SRO పరిధి, ఖమ్మం జిల్లాలో ఉంది. సరిహద్దులు: **తూర్పున: కె. నాగేశ్వరరావు ఇల్లు, పడమరన: చామకూరి మొగిలి ఇల్లు, ఉత్తరాన: గ్రామ పంచాయతీ రోడ్డు, దక్షిణాన: చామకూరి సత్యం ఇల్లు.** | | |
| (లోన్ ఎ/సి నెం.), 23660001690702, ఇందోజు వీర బ్రహ్మచారి (రుణగ్రహీత), ఇందోజు ఉపేంద్ర (సహ-రుణగ్రహీత), ఇందోజు సరేష్ (సహ-రుణగ్రహీత) | 11-జూన్-25 రూ. 6,77,443/- ఆరు లక్షల డెబ్బై ఏడు వేల నాలుగు వందల నలభై మూడు రూపాయలు మాత్రమే 04-జూన్-25 నాటికి | 22-జూలై-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ** (నమోదిత Gift Deed పత్రం సం. 39/2020, తేదీ 07-01-2020 ప్రకారం) RCC పైకప్పుతో కూడిన భాగం టాయిలెట్లతో సహా - 742-82 చదరపు అడుగులు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ మరియు ఇతర అమరికలతో సహా, 227-55 చదరపు గజాల విస్తీర్ణం గల స్థలం. ఖమ్మం జిల్లా, కల్లూరు SRO పరిధిలోని తల్లాడ మండలం, మిట్టపల్లి గ్రామ పంచాయతీలో ఉన్న షెడ్యూల్డ్ ఆస్తి హద్దులు క్రింద ఇవ్వబడ్డాయి. **తూర్పు: బండి వెంకటయ్య ఇల్లు & దారి, పడమర: మచ్చ రాములు ఇల్లు, ఉత్తరం: బ్రహ్మయ్య ఖాళీ స్థలం, దక్షిణం: ఇందోజు రవి ఇల్లు.** | | |
| (లోన్ ఎ/సి నెం.), 22660000452350, నెల్లూరి గోపాల కృష్ణ (రుణగ్రహీత), నెల్లూరి రూప (సహ-రుణగ్రహీత) | 1-సెప్టెంబర్-24 రూ. 6,17,730/- ఆరు లక్షల పదిహేడు వేల ఏడు వందల ముప్పై రూపాయలు మాత్రమే 19-ఆగస్టు-24 నాటికి | 22-జూలై-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ** ఖమ్మం జిల్లా, మధిర మండలం, సైదెల్లిపురం గ్రామ పంచాయతీలో ఉన్న ఆస్తి వివరాలు: 196-66 చదరపు గజాల విస్తీర్ణంలో, 256-00 చదరపు అడుగుల నిర్మాణ విస్తీర్ణం కలిగిన RCC పైకప్పు గల ఇల్లు ఇంటి నం. 3-8, అసెస్మెంట్ నం. 108 మరియు 238-75 చదరపు అడుగుల నిర్మాణ విస్తీర్ణం కలిగిన 3 గదుల టైల్స్ వేసిన ఇల్లు టాయిలెట్లతో సహా; దీనికి విద్యుత్ మీటర్ మరియు వాటర్ పంప్ కనెక్షన్ ఉన్నాయి. హద్దులు - **తూర్పు: గ్రామ పంచాయతీ రోడ్డు, పడమర: ఉప్పల వెంకటేశ్వర రెడ్డి ఇల్లు, ఉత్తరం: నెల్లూరి కనక రావు ఇల్లు, దక్షిణం: అల్లూరి మంగపతి ఇల్లు.** | | |
| (లోన్ ఎ/సి నెం.), 23630000017978, పగిడిపల్లి శ్రీనివాసరావు (రుణగ్రహీత), ఏలపర్తి పరిమళ (సహ-రుణగ్రహీత) | 26-ఆగస్టు-24 రూ. 6,98,813/- రూపాయలు ఆరు లక్షల తొంభై ఎనిమిది వేల ఎనిమిది వందల పదమూడు మాత్రమే 19-ఆగస్టు-24 నాటికి | 22-జూలై-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ** ఖమ్మం జిల్లా, మధిర మండలం, దెందుకూరు రెవెన్యూ గ్రామంలో ఉన్న ఆస్తి: ఇంటి నంబర్ 7-160/1 అసెస్మెంట్ నంబర్ 865, విస్తీర్ణం 135-75 గజాలు, RCC పైకప్పుతో కూడిన నిర్మాణం (ప్లింత్ ఏరియా 515-00 చదరపు అడుగులు. సరిహద్దులు: **తూర్పున పగిడిపల్లి కృష్ణయ్య ఇల్లు; పడమరన పొట్టపింజర నాగమణి మరియు ఇతరుల ఇళ్లు; ఉత్తరాన పగిడిపల్లి సీతయ్య ఇల్లు; దక్షిణాన గ్రామ పంచాయతీ రోడ్డు.** | | |
| (లోన్ ఎ/సి నెం.), 24660002406510 & 23660000075667; మాడిపల్లి అనిల్ కుమార్ (రుణగ్రహీత), తెలగని మౌనిక (సహ-రుణగ్రహీత) | 22-ఆగస్టు-25; రూ. 4,15,919/- రూపాయలు నాలుగు లక్షల పదిహేను వేల తొమ్మిది వందల పందొమ్మిది మాత్రమే & రూ. 7,18,434/- రూపాయలు ఏడు లక్షల పద్దెనిమిది వేల నాలుగు వందల ముప్పై నాలుగు మాత్రమే 20-ఆగస్టు-25 నాటికి | 23-జూలై-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని హరిత కాలేజ్ (ఇందిరా కాలనీ) వద్ద ఉన్న నివాస గృహం డోర్ నంబర్ 20-2226/2. స్థలం విస్తీర్ణం 71.66 చదరపు గజాలు; RCC నిర్మాణం (ప్లింత్ ఏరియా 308 చదరపు అడుగులు). **తూర్పున: వీ. రవి గారి ఇల్లు, పడమరన: మున్సిపల్ రోడ్డు, ఉత్తరాన: వీ. రమేష్ గారి ఇల్లు, దక్షిణాన: వీ. సతీష్ గారి ఇల్లు** | | |
| (లోన్ ఎ/సి నెం.), 23660000075487, మాడిపల్లి సతీష్ (రుణగ్రహీత), మాడిపల్లి సునీత (సహ-రుణగ్రహీత) | 29-అక్టోబర్-25 రూ. 6,05,365/- రూపాయలు ఆరు లక్షల ఐదు వేల మూడు వందల అరవై ఐదు మాత్రమే 28-అక్టోబర్-25 నాటికి | 23-జూలై-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ** నివాస గృహం D.No. 20-2-226 మరియు 71.66 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన స్థలం; ఇది భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని హరిత కాలేజ్ (ఇందిరా కాలనీ) వద్ద మరియు కొత్తగూడెం SRO పరిధిలో ఉంది. దీని సరిహద్దులు ఈ క్రింది విధంగా ఉన్నాయి: RCC ప్లింత్ ఏరియా 308 చదరపు అడుగులు; **తూర్పున: M. రవి గారి ఇల్లు, పడమరన: మున్సిపల్ రోడ్డు, ఉత్తరాన: M. అనిల్ గారి ఇల్లు, దక్షిణాన: మున్సిపల్ రోడ్డు.** | | |

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న తేదీలో పేర్కొన్న నియమంలోని సెక్షన్ 13(4)తో పాటు [చట్టం 2002] సెక్షన్ 13(4) కింద అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి, పైన పేర్కొన్న పట్టికలో వివరించిన ఆస్తిని క్రింద సంతకందారు స్వాధీనం చేసుకున్నాడని రుణగ్రహీతకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. "సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, అంటే ఈ సమాచారం నుండి 30 రోజులలోపు, నియమం 8 (6)తో పాటు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలకు రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది" ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు పైన పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీకి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) ఛార్జీకి లోబడి ఉంటాయి.

తేదీ : 24/07/2026 సం/- అధీకృత అధికారి
స్థలం : ఖమ్మం, తెలంగాణ AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

ఈ ఏడాది మే 3న నిర్వహించిన నీట్ ప్రశ్నాపత్రం లీకు కావడంతో.. పరీక్షను తిరిగి జూన్ 21న నిర్వహించారు. ఈసారి జరిగిన పేపర్ లీకేజీపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు జరిగాయి. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర విద్యార్థులు ఆందోళన చేశారు. రెండోసారి నాలుగు రోజుల క్రితం సైతం జంతర్‌మంతర్ దగ్గర జరిగిన నిరసనలో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం చేయడంతో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. పోలీసులు వ్యవహరించిన తీరుతో విద్యార్థులుసైతం పోలీసులపై దాడి చేసిన సంఘటనలు జరిగాయి. నీట్ పేపర్ లీకేజీలో ప్రధానంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. విద్యార్థుల ఆందోళనకు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం చివరికి కేంద్ర విద్యాశాఖ మంత్రితో రాజీనామాచేయించాల్సి వచ్చింది. కేంద్రమంత్రి సైతం తాను రాజీనామా చేస్తున్నానని.. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను సీబీటీ విధానంలో నిర్వహిసామని తెలిపారు. ఇటువంటి ఘటనలు గతంలోనూ జరిగాయి. గతంలో జాతీయ స్థాయిలో జరిగిన కొన్ని సంఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ కొందరు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన మంత్రి ఒకరు పేపర్ లీకేజీ నేపథ్యంలో రాజీనామా చేశారు. అనంతరం మరోసందర్భంలో మరొక మంత్రి సైతం రాజీనామా చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంజనీరింగ్, మెడిసిన్‌లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఎంసెట్ పేపర్ లీకైన సందర్భాలు ఉన్నాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరవాత కూడా ఎంసెట్ పేపర్ లీకైంది. లీకైన తరువాత మరోసారి పరీక్షను నిర్వహించారు.

# పేపర్ లీకేజీలలో ప్రభుత్వాల అలసత్వాలు..

**నాగమణీంద్ర పల్లాపు**

పేపర్ లీకేజీలతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. లీకేజీల మూలంగా విద్యార్థులు మానసిక ఆందోళన చెందడమే కాకుండా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. విద్యార్థుల ఆత్మహత్యలతో వారి తల్లిదండ్రులు సైతం తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. పేపర్ లీకేజీలు అనేది దేశ వ్యాప్తంగా నిర్వహించే పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలతోపాటు, రాష్ట్రాల్లో నిర్వహించే పోటీ పరీక్షలు, చివరికి విద్యార్థులకు నిర్వహించే విద్యా సంవత్సరపు వార్షిక పరీక్షలు సైతం లీకవుతున్నాయి. ఏ రకమైన పేపర్ లీకైన విద్యార్థులే ప్రధాన బాధితులుగా ఉంటున్నారు. పేపర్ లీకేజీలతో విద్యార్థులు మానసిక ఆందోళనే కాకుండా ఆర్థికంగా అదనపు భారం పడుతోంది. పేపర్ లీకేజీలు ఇపుడు కొత్తగా జరుగుతున్నదేమీ కాదు. ఎప్పటి నుంచో జరుగుతున్న వ్యవహారం. ఎపుడు జరిగినా అప్పటికపుడు లీకేజీకి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడం.. కొన్ని సందర్భాల్లో జాతీయస్థాయి పోటీ పరీక్షల ప్రశ్నలు లీకైనపుడు కొందరు మంత్రులు రాజీనామా చేయడం, కొన్ని రాష్ట్రాల్లోనూ మంత్రులు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయడం జరిగాయి. పేపర్ లీక్ జరిగే అవకాశం లేకుండా సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించినప్పటికి కూడా ఏదో రూపేణా పేపర్ లీకేజీల లాలూచీలు సంభవిస్తూనే ఉంటున్నాయి. గతంలో సైతం పలు సందర్భాలలో విద్యార్థుల బంగారు భవిష్యత్తో ఈ పేపర్ లీక్ వ్యవహారం ఆటలాడుకున్న సందర్భాలు ఉన్నాయి. పేపర్ లీకేజీల మూలంగా బాగా కష్టపడి చదివే విద్యార్థుల నోట్లో మట్టి కొట్టేలా అనారోగ్య వాతావరణం పొడచూపుతుండటం నిజంగా అత్యంత దురదృష్టకరమైన విషయం. సమాజంలో ఆర్థికంగా, రాజకీయంగా బాగా పలుకుబడి వున్నవ్యక్తుల అండదండలతో దేశ విద్యావ్యవస్థకే, పబ్లిక్ పరీక్షలు నిర్వహించే వారి ఉనికినే భ్రష్టు పట్టించేలా వ్యవహరించే వారి తీరుతెన్నులు ప్రజాస్వామ్య దేశంలో సిగ్గుచేటైన, హేయమైన విషయం. మే 3న జరిగిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)-2026 ప్రశ్నాపత్రం లీకైంది. నీట్ పేపర్ లీకేజీ సందర్భంగా జరిగిన ఆందోళనలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం విద్యార్థుల ఆందోళనకు మద్దతు ఇవ్వడంతోపాటు ప్రధాని ఇంటి ముందు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. గత పదేళ్లలో 152పరీక్షా పేపర్లు లీకయ్యాయని తెలిపారు. ఇంత వరకూ నిందితులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గతపదేళ్లల్లో జరిగిన 152 పేపర్ లీక్స్ కారణంగా 7.5 కోట్లమంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని రాహుల్ గాంధీ ఆవేదన



వ్యక్తం చేశారు. మే 3న జరిగిన నీట్ పేపర్ లీకైన తరువాత ఈ ఏడాదిలోనే జూన్ రెండో వారంలో మహారాష్ట్రలో జరిగిన టెట్ పరీక్ష పేపర్ లీకైంది. టెట్‌కి సంబంధించి ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఇలాంటి పేపర్ లీక్ కేసులలో ప్రమేయంఉన్నట్లు అనుమానిస్తున్న నిందితులతో ముడిపడి ఉన్న అంతర్రాష్ట్ర పేపర్ లీక్ రాకెట్‌పై మహారాష్ట్ర పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసి విచారణ జరుపుతోంది. నీట్‌పై కూడా సీబీఐ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే నీట్ పేపర్ లీకేజీతో సంబంధం ఉన్న సుమారు 18 మందిని అరెస్టు కూడా చేశారు. ఈ ఏడాది జరిగిన నీట్ పేపర్ లీకేజి కంటే ముందు 2024లో జరిగిన నీట్ పేపర్ లీకైందని కొందరు కోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టులో విచారణ సందర్భంగా పేపర్ లీకేజీ మాస్‌గా జరగలేదని.. కొందరు మాస్ కాపీయింగ్‌కు పాల్పడ్డారని వారిని అనర్హులుగా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకోవడంతో తిరిగి నీట్ పరీక్షను నిర్వహించలేదు. 2024లో సుమారు 23 లక్షల మంది పరీక్షలకు హాజరయ్యారు. ఈ ఏడాది మేలో జరిగిన పరీక్షకు సైతం సుమారు 22 లక్షల మంది హాజరు కాగా.. జూన్‌లో జరిగిన రీ ఎగ్జామ్‌కి సుమారు 20.50 లక్షల మంది హాజరయ్యారు. 2023 మార్చిలో అసోంలో టెన్త్ ప్రశ్నాపత్రం లీకైంది. ప్రశ్నాపత్రం లీకేజీపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్పందించారు. ప్రశ్నాపత్రం లీక్ కావడం తమ వైఫల్యేమనని.. తప్పు అంగీకరిస్తున్నాని ప్రకటించారు. ఈ పేపర్ లీకేజీ వెనుక ఉన్న అస్సలు సూత్రధారిని గుర్తించినట్లు వెల్లడించారు. జాతీయ స్థాయిలో నిర్వ హించే పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు లీకైతే ఆయా పరీక్షలకు ప్రిపేర్ అయిన విద్యార్థులు తీవ్ర మానసిక ఆవేదనకు గురవుతున్నారు. అప్పటికే బాగా చదివి పరీక్ష రాసిన విద్యార్థులు పేపర్ లీకై మరోసారి పరీక్షను నిర్వహించే సమయంలో తిరిగి అదే స్థాయిలో చదవలేక వారి తల్లిదండ్రులు ఏమంటారోననే భయంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గతంలో జరిగిన పేపర్ లీకేజీల సమయంలో ఇటువంటి ఆత్మహత్యలు జరిగాయి. మొన్న మేలో జరిగిన నీట్ ప్రశ్నా పత్రం లీకైన సందర్భంలోనూ జరిగాయి. కానీ ఈ ఏడాది జరిగిన పేపర్ లీకేజీ కారణంగా సుమారు 20నుంచి 24 మంది విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారు. బాగా చదివి పరీక్షను బాగారాసిన వారు సైతం మానసిక ఆందోళనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పేపర్ లీకేజీలే కాకుండా రాష్ట్రాల్లో నిర్వహించే పోటీ పరీక్షలు, రెగ్యులర్‌గా జరిగే అకడమిక్ వార్షిక పరీక్షల పేపర్లు లీకేజీ విషయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఏదైనా జాతీయ పోటీ పరీక్షలు కావచ్చు, రాష్ట్రస్థాయిలో పరీక్షలకు కావొచ్చు, వార్షిక పరీక్షల ప్రశ్నాపత్రాలు కావొచ్చు ఏ పేపర్ లీకైన తిరిగి పరీక్షలను నిర్వహించడం చాలా కష్టంగా మారుతోంది. మొదటిసారి నిర్వహించిన దానికంటే పకడ్బందీగా పరీక్షలను నిర్వహించడం అధికారులు, ప్రభుత్వాలకు కత్తిమీద సాములాంటింది. మేలో జరిగిన నీట్‌పేపర్ లీకైన తరువాత జూన్ 21న నిర్వహించిన పరీక్షకు సుమారు2లక్షల మందితో అదనంగా భద్రతను ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఇదే కాకుండా విద్యార్థులు కూడా మరోసారి పరీక్షకు సిద్ధం కావల్సి వస్తుంది. వారితోపాటు వారి తల్లిదండ్రులు కూడా వీరికి తోడుగా ఉండాల్సి న పరిస్థితి ఏర్పడుతోంది. పరీక్ష మొదటిసారి నిర్వహించిన దానికంటే తరువాత నిర్వహించడానికి ఎక్కువ ఖర్చుచేయాల్సి న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పేపర్ లీకేజీలు జరిగిన తరువాత ప్రభుత్వాలు పేపర్ లీకేజీపై కేసులు నమోదు చేసికొన్ని సందర్భాల్లో స్పెషల్ ఇన్వెస్టిటేషన్ టీమ్(సిట్)లను ఏర్పాటు, మరి కొన్ని సందర్భాల్లో సీబీతో విచారణ జరిపించడం చేస్తున్నాయి. ప్రశ్నాపత్రాలు లీకేజీతో ప్రభుత్వాలకు చెడ్డపేరు రావడమే కాకుండా అదనంగా ఖర్చులు భరించాల్సి వస్తుంది. పేపర్ లీకేజీలపై ప్రభుత్వాలు ఇప్పటి వరకు కేసులు నమోదు చేసి వారినిజైలుకు పంపిస్తున్నప్పటికీ పేపర్ లీకేజీలు ఆగడం లేదు. దీంతో కేంద్ర మంత్రి వర్గం ఇకపై లీకేజీలపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి నూతనచట్టం చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న 2024 ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టంప్రకారం, వ్యక్తిగతంగా ప్రశ్నపత్రాల లీక్‌కు పాల్పడిన వారిపై 3నుంచి5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అదే వ్యవస్థీకృతంగా జరిగే నేరాల విషయంలో 5 నుంచి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.1 కోటి వరకు జరిమానా విధించే నిబంధనలున్నాయి. పేపర్ లీక్ కేసుల విచారణను వేగవంతం చేయడంపై కూడా కేంద్రం ప్రత్యేక దృష్టిపెట్టింది. ఇందుకోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఢిల్లీలో ఒక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయగా త్వరలో మరో నాలుగు కోర్టులను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నారు. పేపర్ లీక్‌లకు సంబంధించిన కేసులను కోర్టుల్లో ఏడాది లోపే విచారించి తీర్పులు ఇవ్వాలనే లక్ష్యంతో చట్టంలో సవరణలు చేయనున్నట్లు తెలుస్తోంది. వేగవంతమైన న్యాయ ప్రక్రియకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది. అటు జైలు శిక్షతోపాటు భారీగా జరిమానా విధించడం, జైలు శిక్ష కాలాన్ని సైతం పెంచి పేపర్ల లీకేజీలకు పాల్పడే వారు భయపడేలాగా చేయాలని కేంద్రం భావిస్తోంది. ●

# 'కదన' తరంగం!

**ఎ.వి.వి ప్రసాద్**

ఢిల్లీ

యువత కదిలితే అదొక కడలి తరంగం. యువత నినదిస్తే అది మహా సముద్ర ఘోష. ఆ రెండూ ఇప్పుడు ఒకేసారి కనిపిస్తున్నది ఢిల్లీ జంతర్ మంతర్ లోనే. తరంగం, ఘోష రెండూ కలగలిస్తే అదొక ఉప్పెనే. గత వారం రోజులుగా ఆ 'ఉప్పెన'లో అన్నీ కొట్టుకుపోతున్నాయి. ఆ దృశ్యాన్ని చూసి, వెనుకడుగు వేయని ప్రధాని మోడీ సైతం నిలబడి ఆలోచిస్తున్నారు.'విద్యార్థులు దేశ భావి నిర్ణేతలురా' అని ఓ పాటలో అన్నట్లు ఇండియా ముఖ చిత్రాన్ని మార్చే సంకల్పంతో వివిధ ప్రాంతాల విద్యార్థులంతా జంతర్ మంతర్ వద్ద హోరెత్తిపోతున్నారు. దానితో వారం రోజులుగా పార్లమెంటు కూడా స్తంభించింది. రోజూ సమావేశం కావడం రభస, రగడతో కొద్దిసేపటికే వాయిదా పడడం నిత్యకృత్యమైపోయింది. నీట్ పరీక్ష పత్రాల లీకేజి నేపథ్యంలో మొదలైన ఆందోళనలు 'కాక్రోచ్'లుగా కదులుతూ వచ్చి మొత్తం వ్యవస్థకే సవాలుగా మారాయంటే అది చిన్న విషయమేమీ కాదు. ఒక విచిత్రమైన పరిస్థితిలో రూపుదిద్దుకున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) ఇంకా పూర్తి స్థాయి రాజకీయ పార్టీగా పరిణామం చెందకుండానే ఇంతటి ప్రభావం సృష్టించడం దేశంలో అందరినీ, ముఖ్యంగా రాజకీయ పార్టీల నేతలందరిని ఎంతో ఆశ్చర్య పరుస్తోంది. ఒక వ్యంగ్య ఉద్యమంగా రెండు నెలల క్రితమే ఆవిర్భవించిన ఈ పార్టీఇంతలోనే అంతగా ఎదగడం కూడా అందరినీ ఆలోచింపజేస్తోంది. పెద్దప్రచారం లేకుండానే ప్రతి విద్యార్థి మైండ్ లోకి 'కాక్రోచ్' ప్రవేశిస్తోంది. జన్‌జడ్ తరం దాని వెనుకేనడుస్తోంది. దేశ రాజధానిలో ఆందోళనలకు కేంద్ర బిందువైన జంతర్ మంతర్ వద్ద గత ఆరురోజులుగా యువ ఆందోళనకారులు వెల్లువెత్తడం చూస్తే అది కేవలం ఓ పార్టీ ఇచ్చిన పిలుపుగా అనిపించదు. సామాజిక ఉద్యమకారుడు వాంగ్ చుక్ విద్యార్థుల ఉద్యమానికి మద్దతు ప్రకటించడమే గాక 26 రోజులపాటు జరిపిన నిరాహార దీక్ష ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయాలను ఎంతో ప్రభావితం చేస్తున్నట్లే కనిపిస్తోంది. అన్నిరాష్ట్రాల నుంచి యువత స్వచ్ఛందంగా కదిలిరావడం గమనించవలసిన పరిణామం. విద్యార్థిలోకం స్వచ్ఛందంగా సాగిస్తున్న ఉద్యమంగానే దీనిని భావించవచ్చు. సామాజిక వ్యవస్థలు ఎలా కృంగి కృశించిపోతున్నాయో, ఎలా కమిలిపోతున్నాయో చెప్తూ యువతే దిశా నిర్దేశం చేస్తోంది. తమకు న్యాయం కావాలని డిమాండ్ చేస్తోంది. దశా బ్దాలుగా వేళ్లూనుకొన్న పెద్ద పెద్ద రాజకీయ పార్టీలను సైతం కలవర పరుస్తోంది. తాము చేయ లేకపోతున్నది విద్యార్థి లోకం చేస్తున్నదని గ్రహించి ఒక్కొక్కటిగా ఆయా పార్టీలు కూడా కదన రంగంలోకి దిగే ప్రయత్నం చేస్తున్నాయి. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఆందోళనలను కఠినంగా అణచివేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు విద్యార్థులకు మద్దతుగా రంగంలోకి దిగడం విమర్శలపాలవుతోంది.



యువత ఆందోళనలు


రాహుల్ గాంధీ, ఖర్గే ప్రభృతులు ప్రధాని మోడీ నివాసం వద్ద మెరుపు ధర్నా చేయడంలో నిజాయితీ లేదనీ, ఉంటే వారంతా జంతర్ మంతర్ వద్దకు వచ్చి విద్యార్థులకు ఎందుకు మద్దతు ప్రకటించ లేదనీ వాంగ్ చుక్ సతీమణి గీతాంజలి వేసిన ప్రశ్నకు ఆనేతలే సమాధానం చెప్పవలసి ఉంది. రాజకీయ నాయకులు సొంత ప్రయోజనాల కోసం వాంగ్ చుక్ ప్రతిష్టను వాడుకొంటున్నారని కూడా ఆమె సంచలనాత్మక వ్యాఖ్యలు చేయడం గమనించవలసిన విషయం. 20న విద్యార్థులు నిర్వహించిన 'చలో పార్లమెంటు' మార్చ్ పై పోలీసు చర్యను ఖండించడంలో సైతం రాహుల్ నుంచి సరైన స్పందన రాలేదంటూ విద్యార్థులు వ్యాఖ్యానించడం వినిపిస్తోంది. పోలీసు చర్యలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకులను పరామర్శించేందుకు రాహుల్ వెళ్ల కపోవడాన్ని కూడా అంతా విమర్శిస్తున్నారు. కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడైన అభిజిత్ దీప్కే గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ సోషల్ మీడియాలో కీలక పాత్ర వహించడంతో 'ఆప్' ఛాయలు అతడిపై ఉంటాయని భావించిన కాంగ్రెస్‌మొదట దానికి దూరంగానే ఉంటూవచ్చింది. కానీ ఆందోళనలు వాటికవే ఉధృతరూపం దాల్చడం చూసి తమ పాత్ర కూడా దానిలో ఉండడానికి ప్రయత్నాలు ఆరంభించింది. 2011 లో అన్నాహజారే అవినీతి వ్యతిరేకోద్యమం పెద్ద ఎత్తున నడిపిన ప్పుడు బిజెపి సహా ఎన్నో పార్టీలు మద్దతు ఇచ్చాయి. కానీ ఇప్పుడు అటువంటి రాజకీయ పార్టీల మద్దతు తగినంత లేకుండానే విద్యార్థులు ఇంత మహోద్యమం నడపడం చూస్తే 'మారుతున్న స్వరం' ఏమిటో అందరికీఅర్థమవుతోంది. బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్‌లో సాగిన జన్‌జడ్ ఉద్యమాలు ఆ దేశాల్లో ఎలాంటి కుదుపునిచ్చాయో ఇటీవల చూశాం. అయితే ఈ విద్యార్థుల ఉద్యమానికి రెండు మూడు అంశాలే కారణాలుగా కనిపిస్తున్నాయి గాని వ్యవస్థలోని మొత్తం అవినీతిపై తిరుగుబాటుగా కనిపించడం లేదనే అభిప్రాయం ఉంది. ఎన్‌టిఎలో సంస్కరణలు, అధికారులపై చర్యలు కూడా ఏదోవిధంగా పరిష్కారం కావొచ్చు. కానీ వ్యవస్థలో పేరుకుపోతున్న అవినీతిని తుడిచిపెట్టే ఉద్యమంలా సాగితే అది కొత్త చరిత్ర సృష్టిస్తుంది, సమాజానికి ఉత్తమ ఫలితాలనిస్తుంది. అన్నాహజారే ఉద్యమం అప్పట్లో చాలా ప్రభావాన్నే చూపినా అంతలోనే చల్లారిపోయింది. కానీ ఈ ఉద్యమంలో విద్యార్థి లోకం స్వచ్ఛందంగా పాల్గొనడంతో అంతకు మించిన ప్రభావాన్నే చూపగలుగుతుంది కానీ సరైన ఫలితాలు సాధించేందుకు శాంతియుత మార్గంలో వెళ్లవలసి ఉంది. కొందరంటున్నట్లు ఇలాంటి ఉద్యమాల్లోకి సాంఘిక వ్యతిరేక శక్తులు కూడా తలదూరుస్తాయి. అందువల్ల మరింత అప్రమత్తత అవసరం. కాక్రోచ్ పార్టీ కోరుకున్నట్లుగా కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం రాజీనామా చేశారు గనుక ఆ పార్టీనేతలు ఆందోళన విరమిస్తారో, లేక మరికొన్ని డిమాండ్లతో ఉద్యమం కొనసాగిస్తారో చూడాలి. ●

# యుద్ధభూమిలో పాలనా సంస్కరణలు

**గన్ని మోహన్**

ఉక్రెయిన్

రష్యాతో ఐదేళ్లుగా కొనసాగుతున్న యుద్ధం కీలక దశకు చేరుకున్న వేళ ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీ ప్రభుత్వంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టి ప్రపంచ దేశాలను ఆకర్షించారు. ఐదేళ్ల నుంచి రష్యాతో ఎడతెరిపిలేని యుద్ధం కొనసాగిస్తున్న జెలెన్‌స్కీ తన దేశ సార్వభౌమత్వం కోసం నిరంతరం తపిస్తూనే ఉన్న సంగతి తెలిసిందే. అగ్రరాజ్యం సోవియట్ యూనియన్ ఈ చిన్నదేశాన్ని నాటోలో చేరకుండా నిరంతరం అడ్డుకుంటూనే ఇప్పుడు సైనిక చర్యకాస్తా యుద్ధంగా మారిపోయింది. నిరంతరం కొనసాగుతున్న ఈ దమనకాండలో అటు అమెరికా నుంచి ఇటు యూరోపియన్ దేశాలు కూడా ఉక్రెయిన్‌కు ఆయుధ పరంగా కొండంత అండగా నిలిచాయి. అయితేట్రంప్ పాలన ప్రారంభం నుంచి ఉక్రెయిన్ అధ్యక్షుడు ఒత్తిడులను ఎదుర్కొంటున్నారు. ఒక దశలో రష్యా చెప్పినట్లు ట్రంప్ ఆడుతున్నారన్న భావన కూడా ఉక్రెయిన్ ప్రజల్లో సర్వత్రా వినిపించింది. అప్పుడప్పుడు శాంతిచర్చల పేరిట అమెరికాకు పిలిపించి మరీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ దేశాధినేతను ఘోరంగా అవమానపరిచారన్నఆక్రోశం కూడా ఆ ప్రజల్లో గూడుకట్టుకునిపోయింది. కమ్ముకొస్తున్న రష్యా యుద్ధమేఘాల మాటున ఇప్పుడు జెలెన్‌స్కీ కొత్తగా ప్రభుత్వం మొత్తం ప్రక్షాళనకు పూనుకోవడం ఆయన సాహసోపేతమైన కార్యాచరణగానే చెప్పుకోవచ్చు. ప్రభుత్వ రంగ ఇంధన సంస్థ నాఫ్టోగాజ్ సీఈఓ సెర్గీ కొరెట్స్కీని ఉక్రెయిన్ కొత్త ప్రధానిగా ఎంపిక చేసినట్లు ప్రకటించారు. దేశాన్ని రాబోయే శీతాకాలానికి సిద్ధం చేయడమే ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అని స్పష్టం చేసిన అధ్యక్షుడు ప్రధానిగా యూలియా స్విరిడెంకోను కేవలం ఏడాది పదవీకాలంతోనే తప్పించారు. ఆమె రాజీనామాను పార్లమెంట్ ఆమోదించగా, కొత్త ప్రధానిగా సెర్గీ కొరెట్స్కీ నియామకానికి పార్లమెంట్ ఓటింగ్ నిర్వహించింది. అధికార పార్టీ సర్వెంట్ ఆఫ్ ది పీపుల్‌కు పార్లమెంట్‌లో మెజారిటీఉండటంతో కొరెట్స్కీ నియామకం ఖాయమనే చెప్పాలి. జెలెన్‌స్కీ మాట్లాడుతూ ప్రస్తుతందేశంముందు ఉన్న ప్రధాన లక్ష్యం శీతాకాలానికి సన్నద్ధంకావడం. అన్ని అంశాలను పరిశీలించిన తర్వాత సెర్గీ కొరెట్స్కీనే ప్రధానమంత్రి పదవికి అత్యంత అర్హుడిగా తేల్చారు. అంతేకాకుండా ప్రభుత్వ పునర్వ్యవస్థీకరణలో అత్యంత ఆసక్తికర అంశంగా రక్షణ మంత్రిత్వశాఖ మార్పులు నిలిచాయి. ప్రస్తుతం రక్షణ మంత్రిగా ఉన్న మైఖైలో ఫెడొరోవ్ స్థానంలో 2023 నుంచి అంతర్గత వ్యవహారాల మంత్రిగా ఉన్న ఇహోర్ క్లైమెంకోను నియమించే అవకాశం ఉందని అధికార పార్టీ ఎంపీలు వెల్లడించారు. అధ్యక్షుడితో సమావేశం అనంతరం పలువురు ఎంపీలు సామాజిక మాధ్యమాల ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. అధికార పార్టీ ఎంపీ ఒల్గా వాసిలెవ్స్కాస్మాల్లి యుక్ కూడా క్లైమెంకో పేరును రక్షణ మంత్రి పదవికి ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. ఫెడొరోవ్ తొలగింపుపై విమర్శలు



జెలెన్‌స్కీ

సైతం జెలెన్‌స్కీ ఎదుర్కొన్నారు. కేవలం ఆరు నెలల కాలంలోనే ఫెడొరోవ్ ఉక్రెయిన్ సైన్యాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కీలక సంస్కరణలు చేపట్టారు. ముఖ్యంగా డ్రోన్ కొనుగోళ్లు పెంచడం, సాంకేతికత ఆధారిత యుద్ధ వ్యూహాలను అమలు చేయడం, రక్షణ కొనుగోలు వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడానికి ప్రయత్నించడం వంటి చర్యలకు ఆయన ప్రశంసలు అందుకున్నారు. రష్యాపై ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి డ్రోన్ దాడులు ముమ్మరం చేస్తున్న సమయంలో ఫెడొరోవ్‌ను మార్చడం సరైన నిర్ణయం కాదని పలువురు ఎంపీలు బాహాటంగానే జెలెన్‌స్కీకి నివేదించినా మార్పు అనివార్యం అన్న సంకేతాలే ఇచ్చారు. పార్లమెంట్ విదేశాంగ కమిటీ ఛైర్మన్ ఒలెక్సాండర్ మెరెజ్కో మాట్లాడుతూ ఫెడొరోవ్‌కు అంతర్జాతీయ సంస్థల్లో మంచి గౌరవం ఉందని, రక్షణ శాఖలో నిజమైన సంస్కరణలపై ఆశలు ఆయనతోనే ముడిపడి ఉన్నాయని అందువల్లనే మార్పుఅనివార్యం అవుతోందని జెలెన్‌స్కీని సమర్థిస్తూ వచ్చారు. ప్రఖ్యాత డ్రోన్ యుద్ధ నిపుణురాలు, వాలంటీర్ మరియా బెర్లిన్స్కా ఫెడొరోవ్‌ను మార్చడం అధ్యక్షుడు జెలెన్‌స్కీ చేసిన అతిపెద్ద తప్పిదాల్లో ఒకటని, ఈనిర్ణయం ఉక్రెయిన్‌కు భారీ మూల్యం చెల్లించే పరిస్థితి తీసుకు రావచ్చని, లక్షలాది మంది సైనికుల ప్రాణాలు, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించినా జెలెన్‌స్కీ వెనక్కి తగ్గలేదు. ఉక్రెయిన్ ప్రస్తుతం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. వాయు రక్షణ వ్యవస్థల కొరత, సైనికుల కొరత, నియామక ప్రక్రియలో లోపాలు ఇప్పటికీ ఆదేశాన్ని పట్టిపీడిస్తున్నాయి. మరోవైపు, రాబోయే శీతాకాలంలో విద్యుత్ మౌలిక వసతులపై రష్యాదాడులు మళ్లీ పెరిగే అవకాశముందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రక్షణ మంత్రిగా ఉన్న సమయంలో ఫెడొరోవ్ చేపట్టిన సైనిక సంస్కరణలు ఇంకా పూర్తికాలేదు. అదే సమయంలో అమెరికా తయారీ బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకునే ఆధునిక ఇంటర్‌సెప్టర్ వ్యవస్థల కొరత కూడా ఉక్రెయిన్‌కు ప్రధాన సమస్యగా మారింది. తూర్పు ఉక్రెయిన్ లోని డోనెట్స్క్ ప్రాంతంలోని కీలక నగరాలవైపు రష్యా సైన్యం నెమ్మదిగా ముందుకు కదులుతోంది. మొత్తం డోనెత్స్క్ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవడమే లక్ష్యంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వ్యూహం అమలు చేస్తున్నట్లు కదనరంగం నుంచి సంకేతాలు అందుతున్నాయి. ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఇటలీ, వంటి దేశాలు ఆయుధబలగాలను సమకూరుస్తున్నా ఈ సాయంఎంత కాలం కొనసాగుతుందనేది కూడా స్పష్టంగాచెప్పలేని పరిస్థితి. ఎందుకంటే ట్రంప్ ఈ దేశాలపై ఒత్తిడి తెచ్చినా తీసుకురావచ్చనేది అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో జెలెన్‌స్కీ చేపట్టిన ప్రభుత్వ మార్పులు ఉక్రెయిన్ యుద్ధ వ్యూహం, ప్రస్తుత దేశ రాజకీయ పరిస్థితులపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశం కావడంతోపాటు ఉత్కంఠగా కూడా మారింది. ●

# మేల్కొన్న యువత దేశాన్ని మారుస్తున్న వేళ..



డా.జె. పూర్ణచంద్ర రావు

రాత్రి పదకొండు గంటల యాభై నిమిషాలు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఎక్స్ ఖాతాలో ఒక వీడియో పెట్టారు. దేశమంతా విద్యార్థుల పోరాటాల గురించి మాట్లాడుతున్న వేళ ఆ వీడియో రావడం చాలామందిని ఆలోచింపజేసింది. ఆ చర్చ ఇంకా కొనసాగుతుండగానే, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. పరీక్షలలో జరిగిన అవకతవకలపై దేశవ్యాప్తంగా సాగిన విద్యార్థుల పోరాటాల నడుమ జరిగిన ఈ రెండు పరిణామాలు ఒక విషయాన్ని స్పష్టంగా చూపించాయి. ప్రజల గొంతు బలంగా వినిపించినప్పుడు, పాలకులు మాట్లాడక తప్పదు. అవసరమైతే నిర్ణయాలు కూడా మార్చక తప్పదు. దేశమంతా విద్యార్థుల పోరాటాల గురించి మాట్లాడుతున్న వేళ ఆవీడియో రావడం చాలామందిని ఆలోచింపజేసింది. ఇంత బలమైన మోడీ కూడా ఎందుకు మాట్లాడాల్సి వచ్చింది?" అని చాలామంది అడిగారు. కానీ అసలు ప్రశ్న అది కాదు. మోదీ ఎందుకు మాట్లాడాడు? అన్నది కాదు. మోదీ మాట్లాడాల్సి న పరిస్థితి ఎవరు తెచ్చారు? అన్నదే అసలు ప్రశ్న. పాలకులుఎప్పుడూ తమంతట తామే దిగి రారు. ప్రజలు నిలబడితేనే ఒక్క అడుగు వెనక్కి వేస్తారు. అదే చరిత్ర. అదే ప్రజల బలం. మన దేశంలో ఒక విచిత్రమైన అలవాటు పెరిగిపోయింది. ఎవరో కొత్తగా పోరాటం మొదలుపెడితే ముందుగా నవ్వుతాం. వీళ్ల వల్ల ఏమవుతుంది?", నలుగురు పిల్లలు రోడ్డు మీద కూర్చుంటే దేశం మారిపోతుందా?", "ఇది రెండు రోజుల్లో చల్లారిపోతుంది" అంటాం. కానీ రోజులు గడుస్తాయి. అదే పోరాటం పెద్దదవుతుంది. ఊళ్లకు, పట్టణాలకు పాకుతుంది. దేశమంతా దాని గురించే మాట్లాడుతుంది. చివరకు పెద్దపెద్ద నాయకులు కూడా నోరు విప్పాల్సి వస్తుంది. అప్పుడు మాత్రం వీళ్లవల్లే జరిగింది'అంటాం. మొదట తక్కువ చేసి మాట్లాడిన వాళ్లే చివరికి చప్పట్లు కొడతారు. ఇది ఈ రోజు కొత్తగా జరిగిన విషయం కాదు. చరిత్ర అంతా ఇలాగే ఉంది. స్వాతంత్ర్యం కోసం పోరాటం మొదలైనప్పుడు కూడా బ్రిటిష్ వాళ్లు కొద్దిమందిని చూసి నవ్వుకున్నారు. దక్షిణ ఆఫ్రికాలో నల్లజాతి వాళ్లు హక్కుల కోసం నిలబడినప్పుడు వాళ్లను అణచేయగలమని పాలకులు అనుకున్నారు. అమెరికాలో నల్లజాతి వాళ్లు వీధుల్లోకి వచ్చినప్పుడు కూడా మొదట ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఒకరి వెనుక పది మంది, పది మంది వెనుక వంద మంది, వంద మంది వెనుక లక్ష మంది నిలబడినప్పుడు పాలకులు తలవంచక తప్పలేదు. మన దగ్గర మాత్రం ఇంకో జబ్బుఉంది.'వాళ్లు ఏం చేస్తున్నారు?' అని అడగడం చాలా సులభం. 'రాహుల్ గాంధీ ఏం చేస్తున్నాడు?,ప్రతిపక్షం ఏంచేస్తోంది?,ఆ నాయకుడు ఎందుకు మాట్లాడడం లేదు?' ఆ చదువుకున్న వాళ్లు ఎక్కడున్నారు?' అని అడుగుతాం. కానీ 'నేను ఏం చేస్తున్నాను?" అని మాత్రం మనల్ని మనం అడగం. మనం పోరాటానికి వెళ్లం. మనం ప్రజలను చైతన్యపరుస్తూ ఒక పాట రాయం. ఒక వ్యాసం రాయం. ఒక చిన్న వీడియో కూడా తీయం.పెట్టం. మనం ఒక రూపాయి కూడా ఇవ్వం. మనం ఒక రోజు కూడా సమాజం బాగు కోసం కేటాయించం. కానీ పోరాడుతున్న వాళ్లకు మాత్రం రోజూ సలహాలు ఇస్తుంటాం. పార్లమెంట్‌లో దక్షిణాది వాటా తగ్గిపోతుందని చాలామంది చెబుతున్న కొత్త నియోజకవర్గాల ఏర్పాటు గురించి మన రాష్ట్రాల్లో ఎంత పెద్ద చర్చ జరుగుతోంది? ఆంధ్రప్రదేశ్లోనూ, తెలంగాణలోనూ ఎంతమంది నాయకులు ఊరూరా తిరిగి ప్రజలకు చెబుతున్నారు? జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, కేసీఆర్, రేవంత్ రెడ్డి,కిషన్ రెడ్డి,బండి సంజయ్, ఒవైసీ.. ఎవరినైనా మనం ఒక ప్రశ్న అడుగుతున్నామా? 'ఈవిషయం మీద మీరే మంటారు ?' అని నిలదీస్తున్నామా? లేదు. ఎన్నికలు వస్తే మళ్లీ పాత గొడవలే. జగన్ మీద కోపమొస్తే చంద్రబాబుకు ఓటు వేస్తాం. చంద్రబాబు మీద కోపమొస్తే జగన్‌కి వేస్తాం. కేసీఆర్ మీద కోపమొస్తే రేవంత్కు వేస్తాం. ఒక కులం మీద కోపమొస్తే మరో కుల నాయకుడికి వేస్తాం.ఒక మతం మీద కోపమొస్తే మరో మతం పేరిట రాజకీయం చేసేవాళ్లకు వేస్తాం. మన ఓటు మన బాగుకోసం వేయడం లేదు. అభిమాన దురభిమానాలతో ఓటు వేస్తాం. కానీ మన బతుకు మాత్రం మారడం లేదు.చుండూరు జరిగింది. కారంచేడు జరిగింది. వేంపెంట జరిగింది. లక్షింపేట జరిగింది. ఇంకా ఎన్నో చోట్ల పేదల రక్తం కారింది. ఆ రోజున మనమంతా బాధపడ్డాం. సభలు పెట్టాం. కొవ్వొత్తులు వెలిగించాం. మాటలు చెప్పాం. కానీ కొంతకాలం తర్వాత మళ్లీ అదే పాతపార్టీల చుట్టూతిరిగాం. మనకు జరిగిన అన్యాయాన్ని మర్చిపోలేదు. కానీ ఆ అన్యాయానికి కారణమైన రాజకీయ నాయకుల కోసం పనిచేయడం మానలేదు కాన్షీరాం ఇంకా చేయాల్సింది","మాయావతి పని చేయటల్లేదు','ఆర్. కృష్ణయ్య ఏం చేశాడు?','మంద కృష్ణ మాదిగ ఏం సాధించాడు?' అని అడుగుతాం.అడగాలి కూడా. కానీ అదే సమయంలో మనల్ని మనం కూడా అడగాలి. మనలో ఎవరైనా మన వాళ్ల కోసం పోరాటానికి ఒక రోజు సమయం ఇచ్చామా? మన దగ్గర ఉన్నదాంట్లో కొంచెమైనా మన వాళ్ల కోసం ఖర్చుపెట్టామా? మనకు సమయం లేదని చెప్పడం నిజం కాదు. తీర్థయాత్రలకు సమయం ఉంది. విహారాలకు సమయం ఉంది.సినిమాలకు సమయం ఉంది. ఫోన్లో గంటల కొద్దీ గడపడానికి సమయం ఉంది. కానీ మన ఊరి పిల్లలకు చదువు చెప్పడానికి సమయం లేదు. మనవాడి కూలీ బిడ్డకు పుస్తకం కొనివ్వడానికి సమయం లేదు. అన్యాయం జరిగిన చోటికి వెళ్లి నిలబడడానికి సమయం లేదు. ఇది మన బలహీనత. డాక్టర్ అంబేద్కర్ "చదవండి, పోరాడండి, ఒక్కటిగా నిలబడండి" అనిఎందుకు చెప్పాడు? ఒక్క మనిషి ఏమీ చేయలేడని ఆయనకు తెలుసు. ప్రజలు ఒక్కటైతే ఏ శక్తినైనా మార్చగలరని ఆయనకు తెలుసు. నెల్సన్ మండేలా కూడా అదే చూపించాడు. మార్టిన్ లూథర్ కింగ్ కూడా అదే చేశాడు. చే గువేరా కూడా అదే నమ్మాడు. అలిశెట్టి ప్రభాకర్ తన అక్షరాలతో అట్టడుగు మనిషి బతుకును దేశం ముందు పెట్టాడు. గొప్ప వాళ్లందరూ వేర్వేరు భాషల్లో చెప్పింది ఒకటే.ప్రజలు కదిలితేనే చరిత్ర కదులుతుంది. మనకు ఇంకో పెద్ద అలవాటు ఉంది. పోరాటం చేస్తున్న వాళ్లగురించి వెంటనే అనుమానం మొదలవుతుంది. 'డబ్బు ఎవరు ఇస్తున్నారు?','వాళ్ల వెనుక ఎవరు ఉన్నారు?' అని అడుగుతాం. కానీ వేలాది మంది తమ చేతులతోవండి విద్యార్థులకు భోజనం పెట్టడం కనిపించదు. యువవైద్యులు ఉచితంగా వైద్యశిబిరాలు పెట్టడం కనిపించదు. న్యాయవాదులు ఉచితంగా కేసులు చూడడం కనిపించదు. ఉపాధ్యాయులు పిల్లలకు తోడుగా నిలవడం కనిపించదు. పేద ప్రజలు తమ కష్టార్జితంలో కొంత తీసి ఉద్యమానికి ఇవ్వడం కనిపించదు. పోరాటాన్ని నిలబెట్టేది కొద్దిమంది ధనవంతులు కాదు. వేలాది సాధారణ మనుషుల చిన్నచిన్న సాయం. దేశంలో ఏ పెద్ద మార్పు వచ్చినా మొదట యువతే ముందుకు వచ్చింది. స్వాతంత్ర్య పోరాటంలోనూ అదే జరిగింది. జయప్రకాశ్ నారాయణ్ పిలుపు ఇచ్చినప్పుడు కూడా యువతే వీధుల్లోకి వచ్చింది. తెలంగాణ కోసం జరిగిన పోరాటంలో కూడా ముందుండింది యువతే. ప్రపంచంలో ఎక్కడ చూసినా ఇదే కనిపిస్తుంది. పెద్దవాళ్లు దారి చూపారు. కానీ దారిలో నడిచింది యువతే. అందుకే ఇప్పుడు పెద్దవాళ్ల మీద కూడా ఒక బాధ్యత ఉంది. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు ఒక పిల్లవాడికి చదువు చెప్పవచ్చు.పదవీ విరమణ చేసిన వైద్యుడు ఒకరోజు ఉచితంగా వైద్యంచేయవచ్చు. న్యాయవాది పేదవాడికి తోడుగా నిలవవచ్చు.రైతు తన అనుభవం చెప్పవచ్చు. రచయిత ఒక వ్యాసం రాయవచ్చు. కవి ఒక పాట రాయవచ్చు. సినిమా తీయలేని వాడు ఒకచిన్న వీడియో తీయవచ్చు. డబ్బు ఇవ్వలేని వాడు తన సమయం ఇవ్వవచ్చు. సమయం కూడా ఇవ్వలేని వాడు కనీసం పోరాడుతున్న వాళ్లను తక్కువ చేసి మాట్లాడకుండా ఉండవచ్చు. దేశాన్నిమార్చేది ఒక్క నాయకుడు కాదు. ఒక్కపార్టీ కాదు. ఒక్క ఎన్నిక కాదు. మేల్కొన్న ప్రజలే దేశాన్ని మారుస్తారు.'వాళ్లు చేయాలి' అనే మాట ఈ దేశాన్ని ఎక్కడికీ తీసుకెళ్లదు. 'మనం చేద్దాం' అనే మాట మాత్రం చరిత్రను మార్చగలదు.చివరగా మనం ఆలోచించాల్సింది ఏమంటే ఎందుకు దిగివచ్చాడు మోడీ? ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చింది ధర్మేంద్ర ప్రధాన్? సమాధానం ఒక వ్యక్తిలో లేదు. ఒకపార్టీలో లేదు. కొందరు యువకులు భయపడలేదు. లక్షలాది మంది ప్రజలు వాళ్ల వెనుక నిలబడ్డారు.తమ సమయాన్ని ఇచ్చారు. తమ శ్రమనుఇచ్చారు. తమడబ్బును ఇచ్చారు. ఆ చిన్నచిన్న చినుకులేఒకరోజు పెద్ద వరదఅయ్యాయి. ప్రజల గొంతు బలంగా వినిపించినప్పుడు ఏ పాలకుడైనా వినకతప్పదు. అదే ప్రజలపాలన. అదే చరిత్రచెప్పే నిజం.అందుకే ప్రశ్న మోడీ గురించికాదు. ప్రశ్న మనగురించే.మనం ఇంకా ప్రేక్షకులుగానే ఉండాలా? లేక చరిత్రను మార్చేవాళ్లలో మనమూ ఒకరిగానిలవాలా? ●

(రచయిత : ఐపీఎస్ డీజీపీ రిటైర్డ్, ఎపి, తెలంగాణ జాతీయ కోఆర్డినేటర్, ఆల్ ఇండియా బిఎస్పీ)

# పేపర్ లీక్ మాఫియాపై ఉక్కుపాదం




## 3 నెలల్లోనే విచారణ ప్రక్రియ ముగింపు

## రూ.10కోట్లు జరిమానా, 5 నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష

## పరీక్షల అక్రమాల నిరోధక సవరణ బిల్లు డ్రాఫ్ట్ విడుదల చేసిన కేంద్రం

## రేపు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం

**న్యూఢిల్లీ, జులై 25:** పేపర్ లీకులను నివారించడానికి, పరీక్షలకు సంబంధించిన మోసాలకు వ్యతిరేకంగా చట్టపరమైన వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం మరింత కఠినమైన నిబంధనలను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఇందుకు సంబంధించి తాజాగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో మంత్రివర్గం ఆమోదించిన పరీక్షల అక్రమాల నిరోధక సవరణ బిల్లు 2026 డ్రాఫ్ట్‌ను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. దేశంలో పోటీ పరీక్షల విశ్వసనీయతను కాపాడేందుకు, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే పేపర్ లీక్ మాఫియాపై కేంద్ర ప్రభుత్వం అత్యంత కఠినమైన చర్యలకు శ్రీకారం చుట్టింది.

ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్ 2024'ను మరింత పటిష్టం చేసింది. పేపర్ లీక్ మాఫియాపై రూ.10 కోట్లకు పైగా జరిమానాలు, 7ఏళ్ల వరకు జైలు శిక్షలతో పాటు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టిఎఫ్) ఏర్పాటు ద్వారా 2 నెలల్లో విచారణ, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా 3 నెలల్లో తీర్పులు వెలువరించేలా కొత్త మార్గదర్శకాలను తీసుకొచ్చింది. అధికార వర్గాల ప్రకారం, వ్యవ స్థీకృత పరీక్షల అవకతవకలను అరికట్టడానికి, ప్రతిపాదిత సవరణల లక్ష్యం శిక్షలను గణనీయంగా పెంచడం, దర్యాప్తును వేగవంతం చేయడం, విచారణలను త్వరితగతిన ముగించడం. కేంద్ర మంత్రి వర్గం తాజాగా ఆమోదించిన పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్, 2024కు కొనసాగింపుగా ఈ ప్రతి పాదిత మార్పులు ఉన్నాయని వర్గాలు తెలిపాయి. 2024 చట్టం పేపర్ లీక్ మాఫియాకు వ్యతిరేకంగా ఒక ప్రధాన నిరోధకంగా పనిచేసినప్పటికీ, ప్రభుత్వం ఇప్పుడు దాని నిబంధనలను మరింత కఠినతరం చేయాలని భావిస్తోంది.

ప్రతిపాదిత సవరణల ప్రకారం, పేపర్ లీక్‌లో పాల్గొన్న వ్యక్తికి ఐదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 లక్షల జరిమానా విధించవచ్చు. పరీక్షలు నిర్వహించే సర్వీస్ ప్రొవై డర్‌కు రూ.5కోట్ల జరిమానాతో పాటు ఎనిమిదేళ్లపాటు బ్లాక్‌లిస్ట్ చేయవచ్చు. అలాంటి సర్వీస్ ప్రొవైడర్ యాజమాన్యానికి రూ.5 కోట్ల జరిమానాతో పాటు ఐదేళ్ల జైలు శిక్ష విధించవచ్చు. పేపర్ లీక్‌లలో పాలుపంచుకున్న వ్యవస్థీకృత నేర బృందాలకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10 కోట్ల జరిమానా విధించవచ్చు. ఈ పెంచిన శిక్షలు పరీక్షల మోసానికి వ్యతిరేకంగా మరింత బలమైన నిరోధకాన్ని సృష్టిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ప్రతిపాదిత సవరణలు పేపర్ లీక్‌లు, పరీక్షల మోసాలను దర్యాప్తు చేయడానికి చట్టబద్ధమైన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ల ఏర్పాటుకు కూడా వీలు కల్పిస్తున్నాయి. ఏదైనా పేపర్ లీక్ కేసును ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తు చేయవచ్చు, అది తన దర్యాప్తును రెండు నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనివల్ల దర్యాప్తులు వేగవంతం అవుతాయని, ప్రాసిక్యూషన్ మరింత కేంద్రీకృతమై ఉంటుందని భావిస్తున్నారు. అదనంగా, ఈ సవరణలు ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల కోసం చట్టబద్ధమైన నిబంధనలను ప్రతిపాదిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత హైకోర్టులతో సంప్రదించి ఈ కోర్టులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ కోర్టులు రోజువారీ ప్రాతిపదికన కేసులను విచారిస్తాయి. మూడు నెలల్లోగా విచారణలను పూర్తి చేస్తాయి. ఈ ప్రతిపాదనల ప్రకారం, పెండింగ్‌లో ఉన్న అన్ని దర్యాప్తులను ప్రత్యే క టాస్క్‌ఫోర్స్‌లకు బదిలీ చేస్తారు, అలాగే పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటినీ మూడు నెలల్లోగా పరిష్కరించేందుకు ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు తరలిస్తారు.

పరీక్షలకు సంబంధించిన కేసుల కోసం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించేందుకు కూడా ఇవి వీలు కల్పిస్తు న్నాయి. అధికారవర్గాల సమాచారం ప్రకారం, ఈ సవరణలు నేర నివారణను బలోపేతం చేస్తాయి, దర్యాప్తులను వేగవంతం చేస్తాయి. నేరస్థులకు త్వరితగతిన శిక్ష పడేలా చూస్తాయి.



## మహారాష్ట్ర టెట్ పేపర్ లీక్
## ప్రధాన సూత్రధారి బిజేంద్ర గుప్తా అరెస్ట్

**ముంబై, జులై 25:** సుమారు ఆరు లక్షల మంది అభ్యర్థుల పరీక్షా ప్రక్రియకు అంతరాయం కలిగించిన మహారాష్ట్ర టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టిఇటి) ప్రశ్నపత్రం లీక్ ఘటన జరిగి దాదాపు ఒక నెల తర్వాత, ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న వ్యక్తిని థాణె సిటీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు బిజేంద్ర గుప్తాను శనివారం బీహార్‌లో అరెస్టు చేశారు. కొన్ని వారాల పాటు పరారీలో ఉన్న అతను, అక్కడ నకిలీ గుర్తింపుతో జీవిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో కోచింగ్ క్లాస్ టీచర్‌గా పనిచేసిన గుప్తా, పలు పరీక్షాపత్రాల లీక్ కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొం టున్నారు. రద్దయిన టెట్ పరీక్షకు మహారాష్ట్ర ప్రభుత్వం ఇంకా కొత్తతేదీని ప్రకటించని తరుణంలోనే అతని అరెస్టు జరిగింది. ఈ ఘటనపై పాఠశాల విద్యాశాఖ మంత్రి దాదా భూసే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు తమ నిరసనలను ఉధృతం చేశాయి. లీక్ అయిన ప్రశ్నపత్రాన్ని కొనుగోలు చేయడానికి అంగీకరించిన మరికొందరు అనుమానితులు ఇంకా పరారీలోనే ఉన్నారని పోలీసులు తెలిపారు. 'అరెస్టు అయిన వారు ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు, త్వరలోనే ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేస్తామ్ను అని ఒక పోలీసు కమిషనర్ తెలిపారు.




## హెచ్-1బి వీసాకు లక్ష డాలర్ల ఫీజుపై
## ట్రంప్‌కు మళ్లీ ఎదురుదెబ్బ

**వాషింగ్టన్, జులై 25:** విదేశీ వృత్తి నిపుణుల హెచ్-1బి వీసాలకు లక్ష డాలర్ల ఫీజు విధింపు విషయంలో ట్రంప్‌నకు మళ్లీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఫీజులు చట్టబద్ధం కాదంటూ ఇటీవల దిగువ న్యాయస్థానం తీర్పుపై స్టే ఇచ్చేందుకు అప్పీల్స్ కోర్టు నిరాకరించింది. దీనిపై స్టే ఇవ్వకపోవడంవల్ల దేశానికి వచ్చే నష్టం ఏమిటో తెలియజేయడంలో ట్రంప్ యంత్రాంగం విఫలమైందని పేర్కొంది. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు దీనిపై నిర్ణయం తీసుకోలేరని పేర్కొంది. విదేశాల్లో ఉండి అమెరికా తాత్కాలిక వలస వీసా అయిన హెచ్-1బికి ఎంపికైన వారు లక్షడాలర్ల ఫీజును చెల్లించాలని గత సెప్టెంబరులో ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని సవాల్ చేస్తూ 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాటిని విచారించిన యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సొరోకిన్ లక్ష డాలర్ల ఫీజు చట్ట విరుద్ధమని ప్రక టించారు. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకపో వడంతో దానిని చట్ట విరుద్ధ పన్నుగా పరిగణిస్తున్నామని తీర్పుచెప్పారు. దీంతో ట్రంప్ యంత్రాంగం అప్పీల్స్ కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన నాయ్యస్థానం దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. సాధారణంగా వీసాల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా, గతేడాది సెప్టెం బరులో ఈ వీసా ఫీజును ట్రంప్ సర్కార్ ఏకంగా లక్షడాలర్లకు పెంచేసింది. విదేశీ ఉద్యోగులపై ఆధారపడ కుండా కంపెనీలు అమెరికన్లను నియమించుకోవాలనే ఉద్దేశంతో ఈఫీజును పెంచారు. దీంతో భారతీయులపై పెనుప్రభావమే పడింది.




## ఢిల్లీ అల్లర్లలో పాక్ దేశీయ సోషల్‌మీడియా కుట్రలు
### 480 ఖాతాలు స్తంభింప చేసినట్లు పోలీసుల వెల్లడి

**న్యూఢిల్లీ,జులై 25:** జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసనలపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న 480 సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేసినట్లు ఢిల్లీ పోలీసులు శనివారం వెల్లడించారు. ఈ ఖాతాలన్నింటికీ పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఈ ఆందోళనలపై కృత్రిమ మేధ (ఏఐ)తో రూపొందించిన వీడియోలు, డీప్‌ఫేక్‌లు, ఎడిట్ చేసిన క్లిప్పింగ్‌లు మరియు నకిలీ పోస్టుల ద్వారా ఒక ప్రణాళికాబద్ధమైన దుష్ప్రచారం జరుగుతోందని సీనియర్ అధికారులు మీడియాకు వివరించారు. ఇటువంటి తప్పుడు సమాచారంతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం జరుగుతోందని వారు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఏఐ, డీప్‌ఫేక్ మరియు ఇతర తప్పుడు పోస్టుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమాచారంలోని నిజానిజాలను గుర్తించాలని పోలీసులు కోరారు.

## ఢిల్లీ అల్లర్లలో నిరసనకారులపై హత్యాయత్నం కేసులు
### మొత్తం 15 ఎఫ్ఐఆర్‌లు నమోదు
### 18మంది డిసిపిలతో భద్రత కట్టుదిట్టం



**న్యూఢిల్లీ,జులై 25:** ఢిల్లీలోని పార్లమెంట్, రైల్ భవన్ సమీపంలో జులై 20న జరిగిన నిరసన ప్రదర్శనలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 109(1) కింద హత్యాయత్నం అభియోగాన్ని చేర్చారు. ఈ కేసులో మొత్తం 13 తీవ్రమైన సెక్షన్లను నమోదు చేసినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. కర్తవ్య పథ్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. హైసెక్యూరిటీ జోన్‌లో భద్రతా విధుల్లో ఉండగా, రైల్ భవన్ రౌండ్‌అబౌట్ వద్దకు వేలాది మంది నిరసనకారులు చేరుకున్నారని వైర్‌లెస్ ద్వారా సమాచారం అందినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని, నిరసనకు ఎలాంటి అనుమతి లేదని లౌడ్ స్పీకర్ల ద్వారా పదేపదే హెచ్చరించినా ఆందోళనకారులు వెనక్కి తగ్గలేదని తెలిపారు. కొంతమంది వ్యక్తులు రెచ్చగొట్టడంతో నిరసనకారులు బారికేడ్లను దాటుకుని పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారని ఫిర్యాదులో ఆరోపించారు. పార్లమెంట్, ఇతర కీలక ప్రభుత్వ కార్యాలయాల భద్రత దృష్ట్యా, ఆందోళనకారులను చెదరగొట్టేందుకు లాఠీఛార్జ్ చేసి, బాష్పవాయువు ప్రయోగించాల్సి వచ్చిందని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ఘర్షణల్లో మొత్తం 129 మంది పోలీసు సిబ్బంది, 60 మందికి పైగా నిరసనకారులు గాయపడినట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ ఘటనలకు సంబంధించి ఇప్పటివరకు సుమారు 15 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఢిల్లీలోని పలు మార్గాల్లో 18 మంది డీసీపీల పర్యవేక్షణలో భద్రతను కట్టుదిట్టం చేశారు. కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) లేదా మరే ఇతర సంస్థ ఈ ఘటనపై ఏవైనా ఆరోపణలు చేస్తే, వాటిని కూడా విచారించి, నిజానిజాలను బయటపెడతామని ఢిల్లీ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

## ఇది సత్యానికి దక్కిన విజయం: మల్లిఖార్జున ఖర్గే



**న్యూఢిల్లీ,జులై 25:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్‌యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. విద్యార్థుల నుంచి వెల్లువెత్తిన తీవ్ర నిరసనలు, విపక్షాల ఒత్తిడి నడుమ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ పరిణామంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రముఖ నటి ప్రియాంక చోప్రా సహ పలువురు ప్రముఖులు స్పందించారు. దేశంలోని విద్యార్థుల గొంతుక ఎట్టకేలకు అహంకారపూరిత ప్రభుత్వ గడపను తాకిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. విద్యావ్యవస్థ ప్రక్షాళనను కోరుతూ దేశవ్యాప్తంగా వీధుల్లోకి వచ్చి గళమెత్తిన లక్షలాది మంది యువత సాధించిన విజయమిదని ఆయన పేర్కొన్నారు. ఇది సత్యానికి లభించిన విజయం. ప్రధాని మోడీ మొండివైఖరికి దక్కిన ఓటమి. అవినీతిమయమైన ఈ ప్రభుత్వం కారణంగా నష్ట పోయిన కుటుంబాలందరిదీ ఈ విజయమని ఖర్గే అభివర్ణించారు. నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేసి, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నటి ప్రియాంక చోప్రా సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు. విద్యార్థుల పోరాటాన్ని ప్రస్తావిస్తూ, "తమ డిమాండ్ల కోసం దృఢంగా నిలబడి నిరసన తెలిపిన యువతకు, ప్రజాస్వామ్యానికి ఇది దక్కిన భారీ విజయమని ఆమె పేర్కొన్నారు. ఈ పోస్ట్ క్షణాల్లో వైరల్ కాగా, దీనిపై ప్రియాంక చోప్రా స్పందిస్తూ నమస్కారం, లవ్ ఎమోజీలను జత చేసి తన మద్దతును చాటారు.

## రాజీనామాల కంటే సమగ్ర సంస్కరణలు ముఖ్యం: మాయావతి



**న్యూఢిల్లీ,జులై 25:** నీట్‌యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్ కంటే, విద్యా మరియు పరీక్షా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టడమే అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి పేర్కొన్నారు. ఈ అంశంపై విద్యార్థుల నిరసనలు, రాజకీయ ఘర్షణలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఆమె శనివారం ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వివాదంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న శాంతి యుత నిరసనలకు ప్రజల నుంచి సానుభూతి లభిస్తోందని మాయావతి తెలిపారు. రాజకీయ పార్టీలు కేవలం మంత్రి రాజీనామా చుట్టూ రాజకీయం చేస్తున్నాయని, ఈ క్రమం లో అసలు సమస్య అయిన విద్యా వ్యవస్థ ప్రక్షాళన పక్కదారి పట్టే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. ప్రతి పక్షాలు ఈ సమస్యను వీధుల నుంచి పార్లమెంటు వరకు రాజకీయ లబ్ధికోసం వాడుకుంటున్నా యని మాయావతి ఆరోపించారు. ఈ వివాదం వల్లే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఒక్కరోజు కూడా సజావుగా సాగలేదని, దీనివల్ల ఇతర ప్రజా సమస్యలపై జవాబుదారీతనం లేకుండా పో యిందని విమర్శించారు. పార్టీ కార్యకర్తలు దూకుడుగా ప్రవర్తించ కుండా, లక్ష్యం కోసం క్రమశిక్షణతో పనిచేయాలని ఆమె సూచించారు.

## ఈ ఘనత కాక్రోచ్ జనతాపార్టీదే: ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ,జులై 25:** కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, వాయనాడ్ లోక్‌సభ సభ్యురాలు ప్రియాంక గాంధీ స్పందించారు. ఈ ఘనత కాక్రోచ్ జనతా పార్టీకే దక్కుతుందని వ్యాఖ్యానించారు. యువత, విద్యార్థిలోకం ఐక్యంగా ఉద్యమించడం వల్లే కేంద్ర ప్రభుత్వం దిగొచ్చిందని పేర్కొన్నారు. ఈ పని ఎప్పుడో చేసి ఉండాల్సిందని అన్నారు. అదే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై విమర్శలు గుప్పించారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న నిరుద్యోగ సమస్య పరిష్కారంలోనూ, యువత, విద్యార్థుల ఆవేదనలను ఆలకించడంలోనూ కేంద్రం విఫలమైందని ఆరోపించారు. దేశాన్ని సరైన మార్గంలో నడిపించే నాయకుడికి ధైర్యం, తెగువ, బాధ్యతాయుత ప్రవర్తన అత్యంత అవసరమని, ప్రధాని మోడీ ఎప్పుడోగానీ వీటిని ప్రదర్శించలేదని గుర్తు చేశారు. ఆ నాయకత్వ లక్షణాలను ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైందని ప్రియాంక గాంధీ స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంలో నెలకొన్న జాప్యం, ఇన్ని రోజులూ కేంద్రం అనుసరించిన మొండి వైఖరి వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని, చివరికి తమ ప్రాణాలను పణంగా పెట్టి ఢిల్లీలో ఈ స్థాయిలో ఆందోళన చేయా ల్సి వచ్చిందని అన్నారు. పోటీ పరీక్షల నిర్వహణలో జరుగుతోన్న పేపర్ లీకేజీలు, ఇతర అవకతవకలపై విద్యార్థులు సుదీర్ఘ కాలంగా ఆందోళనలు చేస్తు న్నప్పటికీ ఇన్నాళ్లూ పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిం చారని మండిపడ్డారు. నిజమైన నాయకత్వం అంటేఎన్నికల వేదికలపై సుదీర్ఘ ఉపన్యాసాలు ఇవ్వడంకాదని, ప్రజా కష్టాలను ప్రత్యక్షంగా ఆలకించి వాటికి తగిన పరిష్కారాలు చూపడమేనని ఆమె వ్యాఖ్యానించారు.

## బ్రిటన్ మంత్రివర్గంలో ముగ్గురు భారత సంతతి మంత్రులు



**లండన్,జులై 25:** బ్రిటన్ కొత్త ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన ఆండీ బర్న్‌హమ్ తన కొత్త కేబినెట్‌ను ప్రకటించారు. లేబర్‌పార్టీకి చెందిన ముగ్గురు భారత సంతతి ఎంపీలకు ఆయన ప్రభుత్వంలో కీలక పదవులు దక్కాయి. ఆ జాబితాలో కనిష్క నారాయన్, సత్ వీర్ కౌర్, హార్‌ప్రీత్ ఉప్పల్ ఉన్నారు. కనిష్క నారాయన్‌కు కేబినెట్‌లో చోటు దక్కింది. బ్రిటన్ సర్కారులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శాఖకు తొలి మంత్రిగా నియమితులయ్యారు. ఇక సత్‌వీర్ కౌర్, హార్‌ప్రీత్ ఉత్పల్ అత్యున్నత ప్రభుత్వ హోదాలో నియమితులయ్యారు. వీరితో పాటు శ్రీలంక తమిళ సంతతికి చెందిన హిందూ ఎంపీ ఉమా కుమరన్ ఆ దేశ విదేశీ ఆఫీసులో జూనియర్ మంత్రి పదవి దక్కించుకున్నారు. కీర్ స్టార్మర్ ప్రధానిగా ఉన్న సమయంలో సీమా మల్హోత్రా, ప్రీత్ కౌర్ గిల్ మంత్రులుగా చేశారు. ఇప్పుడు వాళ్లు వెనక బెంచీలకు వెళ్లిపోయారు. కనిష్క నారాయన్ బీహార్‌లోని ముజాఫర్‌పూర్‌లో జన్మించారు. ఆయన ఫ్యామిలీ వేల్స్‌కు వలసవెళ్లింది. 12 ఏళ్ల వయసులో ఆయన లండన్ వెళ్లారు. ఈటన్ కాలేజీ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీల్లో చదువుకున్నారు. గ్లామోర్గన్ సీటు నుంచి ఆయన ఎంపీగా ఎన్నియ్యారు. గతంలో సైన్స్, ఇన్నోవేషన్, టెక్నాలజీ శాఖ కార్యదర్శిగా చేశారు. సత్‌వీర్ కౌర్ సౌతాంప్టన్ నుంచి ఎంపీ అయ్యారు. 2024 జూలైలో పార్లమెంట్‌కు తొలిసారి ఎన్నికయ్యారు. ఆమె పేరెంట్స్ పంజాబ్‌కు చెందినవారు. సౌతాంప్టన్‌లో చీరల షాపు ఉండేది. మినిస్ట్రీ ఫర్ ఈక్వాలిటీస్‌లో సహాయ మంత్రిగా చేశారు. హోంశాఖలో కూడా సెక్రటరీగా చేశారు. పార్లమెంటరీ సెక్రటరీగా కూడా ఆమె కొంత కాలం చేశారు. 2025 సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి 2026 వరకు ఆమె మెటర్నిటీ లీవ్‌లో ఉన్నారు. హార్‌ప్రీత్ ఉత్పల్ హడ్డర్స్‌ఫీల్డ్ నుంచి ఎన్నియ్యారు. అసిస్టెంట్ విప్‌గా నియమితులయ్యారు. పార్లమెంటరీ బిజినెస్‌కు చెందిన ఆదేశాలు ఇస్తుంటారు. ఓటింగ్ సమయంలో ఎంపీలకు కీలక ఆదేశాలు ఇస్తారు. గతంలో ఆమె గ్రేటర్ మాంచెస్టర్ మేయర్ క్యాంపేన్‌లో బర్న్‌హమ్‌తో కలిసి పనిచేశారు.



## రాజీనామాలు చేసిన కేంద్ర మంత్రులు ఎందరో!

**న్యూఢిల్లీ,జులై 25:** నీట్ ప్రశ్నాపత్రం లీక్, విద్యా వ్యవస్థలో అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనలతో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకున్నారు. అయితే, స్వతంత్ర భారతదేశ చరిత్రలో రాజకీయ ఒత్తిళ్లు, అవినీతి ఆరోపణలు లేదా ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రులు రాజీనామా చేయడం సాధారణంగా జరుగుతున్నదే. భారతదేశంలో పలు వివాదాలు, ఆరోపణలు లేదా విపక్షాలు, ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకత కారణంగా గతంలో చాలా మంది కేంద్ర మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. స్వతంత్ర భారత చరిత్రలోరైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ పదవి నుంచి తప్పుకున్న తొలి కేంద్ర మంత్రిగా లాల్ బహదూర్ శాస్త్రినిలిచారు. 1956లో తమిళనాడులోని అరియలూర్‌వద్ద సంభవించిన భారీ రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ అప్పటి రైల్వే మంత్రిగా ఉన్న శాస్త్రి రాజీనామాచేసారు. దేశంలోనే తొలి అవినీతి కేసుగా గుర్తింపు పొందిన 1958 నాటి ఎల్ఐసీ కుంభకోణంలో అప్పటి ఆర్థిక మంత్రి కృష్ణమాచారి పదవి నుంచి తప్పుకున్నారు. వ్యక్తిగతంగా ప్రత్యక్ష ప్రమేయం ఏదీ రుజువు కానప్పటికీ ఎంసీ చాగ్లా కమిషన్ నివేదికలోని అంశాల ఆధారంగా ఆయన రాజీనామా చేశారు. తర్వాత 1962 భారతచైనా యుద్ధంలో వైఫల్యాలకు బాధ్యత వహించాలని విపక్షాల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో అప్పటి రక్షణ మంత్రిగా ఉన్న వీకే కృష్ణ మీనన్ తన పదవి నుంచి తప్పుకున్నారు. 1993లో విమాన ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ విమానయాన మంత్రిగా, 1996లో హవాలా కుంభకోణంలో ఆరోపణలు రావడంతో మాధవరావ్ సింధియా రాజీనామా చేశారు. అటల్ బిహారీ వాజ్‌పేయి క్యాబినెట్లో రైల్వే మంత్రిగా నితీష్ కుమార్1999లో పశ్చిమ బెంగాల్లోని గైసాల్లో రైళ్లు ఢీకొట్టిన ఘటనలో 280 మంది ప్రాణాలు కోల్పోవడంతో నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేశారు. ఆ తర్వాత 2008 నవంబరు 26 ముంబయి ఉగ్రదాడుల సమయంలో జరిగిన జాతీయ భద్రతా వైఫల్యాలపై ప్రజాగ్రహం, నైతిక విమర్శలను ఎదుర్కొన్న అప్పటి కేంద్ర హోం మంత్రి శివరాజ్ పాటిల్ తన రాజీనామాను సమర్పించారు. యూపీఏ 2 హయాంలో 2బి స్పెక్ట్రమ్ కుంభకోణం ఆరోపణలు, విపక్షాల తీవ్ర నిరసనలతో అప్పటి కేంద్ర టెలికం మంత్రి ఎ.రాజా 2010లో తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. రైల్వే బోర్డు నియామకాల లంచం కేసులో తన మేనల్లుడు చిక్కుకోవడంతో, విపక్షాల ఒత్తిడి మేరకు 2013లో పవన్ కుమార్ బన్సల్ రైల్వే మంత్రిపదవికి రాజీనామా చేశారు. ఇక, ప్రధాని నరేంద్ర మోదీ క్యాబినెట్లో విదేశాంగశాఖ సహాయ మంత్రిగా ఉన్న ఎంజే అక్బర్పై 2018లో "Me Too" ఉద్యమం సమయంలో వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలు, రాజీనామా డిమాండ్ల కారణంగా పదవికి రాజీనామా చేశారు. బీజేపీ సీనియర్ నేత ఎల్కే అద్వానీ 1996లో హవాలా కుంభకోణంలో తన పేరు ప్రస్తావన రావడంతో నైతిక బాధ్యతగా పదవికి రాజీనామా చేశారు. హవాలా డైరీలలో ఆయన పేరు వెలుగులోకి వచ్చిన తర్వాత అద్వానీ ప్రతిపక్ష నేత పదవితో పాటు ఎంపీగానూ రాజీనామాచేసి కోర్టులు నిర్దోషిగా ప్రకటించే వరకు పార్లమెంటులో తిరిగి ప్రవేశించబోనని ప్రతిజ్ఞ చేశారు.

## ఫడ్నవిస్,షిండేలకు కేంద్రం పిలుపు
## అమిత్‌షా, ప్రధాని మోడీలతో భేటీ



**న్యూఢిల్లీ,జులై 25:** ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఢిల్లీలో వేగంగా రాజకీయ పరిణామాలు మారుతున్నాయి. మరోవైపు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు బీజేపీ హైకమాండ్ నుంచి పిలు పువచ్చింది. దీంతో ఆయన హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరారు. ఫడ్నవీస్‌తో పాటు మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే కూడా ఢిల్లీకి బయలుదేరారు. ప్రధాన్ రాజీనామా చేయగానే ఫడ్నవీస్, షిండేకు బీజేపీ హైకమాండ్ నుంచి ఫోన్ వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో, ఫడ్నవీస్‌ను కేంద్ర మంత్రి మండలిలోకి తీసుకుంటారే ప్రచారం ఊపందుకుంది. ఇటీవల మహారాష్ట్రలో కూడా ఇదే విష యం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గం ఎంపీ సంజయ్ రౌత్ మాట్లా డుతూ సీఎం పదవికి దేవేంద్ర ఫడ్నవీస్ రాజీనామా చేసి, ఢిల్లీకి వెళ్తారని అన్నారు. ఈ వ్యాఖ్యలు మహారాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారాయి. తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలు కూడా రౌత్ వ్యాఖ్యలకు బలాన్ని ఇస్తున్నాయి. మహారాష్ట్రకు చెందిన ఓ సీనియర్ బీజేపీ నేతను సీఎంగా ఎన్నుకోవచ్చని ఆ సమయంలో ఆయన అన్నారు. అయితే ఇందుకు సంబంధించి భిన్న కథనాలుకూడా వచ్చాయి. మహారాష్ట్రలో టెట్‌పేపర్ లీక్‌కకు సంబంధించి వివాదం నడుస్తోంది. ఈకేసులో కీలక వ్యక్తిని బీహార్‌లో పోలీసులు అరెస్టులు చేసారు. దీనితో ఇపుడు నీట్‌తరహాలో ఉద్యమం మళ్లీ ప్రారంభం కాకుండా మహారాష్ట్ర ప్రభుత్వంచేపట్టిన కార్యాచరణను తెలుసుకునేందుకే ఇద్దరినీ పిలిపించారని తెలుస్తోంది. ఫడ్నవిస్, షిండేలు ఇద్దరూ శనివారం ప్రధాని మోడీని కలిసే ముందుగా హోంమంత్రి అమిత్‌షాతో సుదీర్ఘ భేటీ జరిపినట్లు సమాచారం.

# సంక్షిప్త వార్తలు

## 50 ఒటిటిలపై నిషేధం విధించిన కేంద్రం




**న్యూఢిల్లీ, జులై 25:** దేశంలో ఒటిటి యాప్స్ విషయంలో కేం ద్రం కఠినంగా వ్యవహరిస్తోంది. దీనిలో భాగంగా అభ్యంతరకర కంటెంట్ ప్రసారం చేస్తున్న ఒటిటిలపై కేంద్రం ఉక్కు పాదం మోపుతోంది. తాజాగా ఇలాంటి 500 ఒటిటి యాప్స్ ను నిషేధించినట్లు కేంద్ర సమాచార, ప్రసా రశాఖ మంత్రి ఎల్. మురుగన్ వెల్లడించారు. దేశ చట్టాలను ఉల్లంఘించి, అసభ్యకర కంటెంట్‌ను ప్రసారం చేసినందుకే వాటిని నిషేధించామని మంత్రి లోక్‌సభలో తెలిపారు. అయితే, ఇలా ఒటిటిలను నిషేధించడం ఇదే మొదటిసారి కాదు. నిబంధనలు ఉల్లంఘించి, అభ్యంతరకర కంటెం ట్ ప్రసారం చేస్తున్న ఒటిటిలపై కేంద్రం నిషేధం విధిస్తూనే ఉంది.

## ప్రశ్నించే తరం ఇది: ఆర్ఎస్ఎస్ చీఫ్



**న్యూఢిల్లీ,జులై 25:** దేశవ్యాప్తంగా పేపర్ లీకులు, పరీక్షల అక్రమాలపై విద్యార్థుల నిరసనలు కొనసాగుతున్న వేళ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ యువత గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. నేటి తరం ప్రశ్నించే తరం అని, వారికి ఆదేశాలు ఇవ్వడం కంటే చర్చించి అర్థం చెప్పడం అవసరమని అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన సమకాలీన మాతృత్వం అంశంపై జాతీయ అవగాహన సమావేశంలో భాగవత్ మాట్లాడారు. తమ చిన్నతనంలో పెద్దలు చెప్పిన మాట వినేవాళ్లమని చెప్పారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారాయని పేర్కొన్నారు. నేటి యువత ప్రతి విషయాన్నీ ప్రశ్నిస్తోందని, అందుకే వారికి కారణాలు వివరించి నమ్మకం కల్పించాలని చెప్పారు.

## అంతర్జాతీయ కోర్టు నుంచి చీఫ్ ప్రాసిక్యూటర్ తొలగింపు



**హేగ్,జులై 25:** అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ)లో తీవ్ర కలకలం నెలకొంది. లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఆ సంస్థ చీఫ్ ప్రాసిక్యూటర్ కరీం ఖాన్‌ను పదవి నుంచి తొలగించారు. అత్యంత కీలకమైన హోదాలో ఉన్న వ్యక్తిపై ఇటువంటి చర్యలు తీసుకోవడం అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. బ్రిటిష్ న్యాయవాది అయిన కరీం ఖాన్, ఐసీసీలో చీఫ్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తనతో పనిచేసే ఓ మహిళా ఉద్యోగి పట్ల ఆయన లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

## ఆయుధాలు విక్రయిస్తే ఆ రెండుదేశాలకే నష్టం: ట్రంప్



**వాషింగ్టన్,జులై 25:** ఇరాన్‌కు చైనా, రష్యా ఎలాంటి ఆయుధాలు విక్రయించకూడదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అలా చేస్తే అది ఆ రెండు దేశాల ప్రయోజనాలకు మంచిది కాదని స్పష్టంచేశారు. అయితే ప్రస్తుతం ఇరాన్‌కు ఆయాదేశాలు ఆయుధాలుఅందించడంలేదని తాను నమ్ముతున్నట్లు తెలిపారు. ఇరాన్‌కు చైనా, రష్యాలక్ష్యాన్ని నిర్ధారించుకునే సమాచారాన్ని అందిస్తున్నాయన్న వార్తల నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## భారతీయులున్న నౌకపై దాడి.. 28 మంది సురక్షితం



**టెహ్రాన్,జులై 25:** భారతీయులు 28 మంది పనిచేస్తున్న నౌకపై ఇరాన్ జలాల్లో దాడి జరిగింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ కలగలేదని, భారతీయులు సహా నౌకలోని సిబ్బంది అంతా సురక్షితంగా ఉన్నారని ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. మొజాంబిక్ దేశానికి చెందిన ఐఎంవో నెం. 8818219 అనే దిశ పేరుగల నౌకపై దాడి జరిగిందని రాయబార కార్యాలయం తెలిపింది. ఈ ఘటనపై సంబంధిత అధికారులను సంప్రదిస్తున్నామని తెలిపింది.

## కెనడాలో భారతీయ మహిళ దారుణ హత్య



**ఎడ్మంటన్,జులై 25:** భారతీయ మహిళ కెనడాలో దారుణ హత్యకు గురైంది. 23 ఏళ్ల దమన్‌ప్రీత్ కౌర్‌ను ఆమె భాగస్వామి హత్యచేశాడు. ఎడ్మంటన్‌లోని ఓ ఇంట్లో ఆమెను గొంతునులిమి చంపేశాడు. చికిత్స పొందుతూ ఆమె మృతిచెందినట్లు పోలీసులు చెప్పారు. ఈనెల 9వ తేదీన ఈ ఘటన జరిగింది. ఈ కేసులో 22 ఏళ్ల రితీశ్ కుమార్‌ను ఎడ్మంటన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పార్ట్నర్‌పై సెకండ్ డిగ్రీ మర్డర్ కేసు నమోదు చేశారు. బాధితురాలు దమన్‌ప్రీత్ కౌర్‌ది పంజాబ్‌లోని లుధియానా జిల్లా.

# త్వరలో మూసీ సుందరీకరణకు టెండర్లు

## రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

### రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 25:** రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని కొంతమంది ఉద్దేశపూర్వ కంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని దీనిలో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా స్పష్టమైన ఆధారాలు, వివరాలు ఉన్నాయని అందువలన అటువంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. శనివారం నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని, 40 శాతం వరకు ఫ్లాట్ల విక్రయాలు వృద్ధిచెందాయని అన్నారు. గడచిన పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పెరిగిందని, దీనికి సంబంధించి తమ స్టాంప్స్,రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే నిదర్శనమన్నారు.

రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంతమంది పనిగట్టుకొని ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఈ గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని వాటిని పట్టించుకోవద్దని మంత్రి అన్నారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్‌గా రూపొందిందని, వారి దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి సెక్టార్ తదితరాలు 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందాయని వివరించారు. అందువల్లే హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే గాక ప్రపంచంలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలసి దావోస్ వెళ్లినపుడు అక్కడ కూడా అధికశాతం పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు పేర్కొన్నారని ప్రస్తావించారు. హైదరా బాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం అవుతుంద న్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టితో ప్రణాళికా బద్ధంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి చర్యలు చేపట్టారు. రూ. 7వేల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ సుందరీకరణ పట్టాలెక్కనుందని మంత్రి పొంగులేటి తెలిపారు. 28 కిలోమీటర్ల తొలి విడత అభివృద్ధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవ బోతున్నామని చెప్పారు. అదేవిధంగా పాత బస్తీ తదితరాలను కలుపుతూ 2వ విడతగా 76 కిలోమీటర్ల మేర రూ.24వేల కోట్ల ఖర్చుతో మెట్రో విస్తరణ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఇవేగాక ట్రిబుల్ ఆర్ నుంచి ఓఆర్ఆర్ కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. కేవలం రియల్ ఎస్టేట్ రంగం కోసమే గాకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు క్యూర్ పరిధిలోతొలివిడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు నిర్ణయించామని, దీని తర్వాత దఫదఫాలు ఇళ్ల మంజూరు ఉంటుందని మంత్రి చెప్పారు.

ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి 23 లక్షల చదరపు అడుగుల స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని చెబుతూ రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక్ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్ని స్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వేస్టేషన్

## నేడు కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వేస్టేషన్

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిచే ప్రారంభం

**హైదరాబాద్ (తార్నాక), జులై 25, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వచ్చే భక్తులకు మరింత మెరుగైన రైలు సౌకర్యం అందు బాటులోకి రానుంది. మనోహరాబాద్-సిద్దిపేట రైల్వే మార్గంలో నూతనంగా నిర్మించిన కొమురవెల్లి పుణ్యక్షేత్ర రైల్వే స్టేషన్‌ను నేడు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. దాదాపు రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ స్టేషన్‌లో ఎత్తైన ప్లాట్‌ఫాం, వేచిచోటు, ప్రయాణికుల కోసం ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. స్టేషన్ ప్రారంభం సందర్భంగా సిద్దిపేట-సికిందరా బాద్ రైలుకు ఇక్కడి నుంచి పచ్చజెండా ఊపనున్నారు. ఇకపై సికిందరా బాద్-సిద్దిపేట మధ్య నడిచే నాలుగు డెము రైళ్లు కొమురవెల్లి పుణ్యక్షేత్ర స్టేషన్‌లో ఆగనున్నాయి. దీంతో మల్లన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తులతోపాటు స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగు పడనుంది. పర్యాటకాభివృద్ధికి కూడా ఈ స్టేషన్ దోహదపడుతుందని రైల్వే అధికారులు భావిస్తు న్నారు. మనోహరాబాద్-సిద్దిపేట కొత్త రైలు మార్గంలో భాగంగా రూ.6 కోట్ల వ్యయంతో ఈ నూతన స్టేషన్‌ను నిర్మించారు. హై లెవల్ ప్లాట్‌ఫామ్, ప్లాట్‌ఫామ్‌పై కప్పు, ప్రయాణికుల నిరీక్షణ గది, తాగు నీటి సదుపాయాలు తదితర వసతులు కల్పించారు. ప్రస్తుతం సికింద్రాబాద్-సిద్దిపేట మధ్య నడుస్తున్న నాలుగు డెమూ రైళ్లకు కొమురవెల్లి పుణ్యక్షేత్రం స్టేషన్‌లో అదనపు నిలుపుదల కల్పించారు. ప్రారంభోత్సవం సందర్భంగా కిషన్‌రెడ్డి ఇతర ప్రము ఖులతో కలిసి కొమురవెల్లి పుణ్యక్షేత్రం స్టేషన్ నుంచి సిద్దిపేట-సికిందరాబాద్ డెమూ రైలు (77654)ను జెండా ఊపి ప్రారంభించనున్నారు.

# ఆగస్టు 15 వరకు లక్ష ఇంకుడు గుంతలు పూర్తి చేయాలి



శనివారం సచివాలయం నుంచి విడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి సీతక్క

## లక్ష్యాన్ని సాధించిన అధికారులకు సిఎం చేతుల మీదుగా సన్మానం

### విబి జీరాంజీలో ఉన్న 318 పనులను గుర్తించి మొదలుపెట్టాలి

### తెలంగాణ జలసిరి పనుల్లో వేగం పెంచాలి : మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై 25:** ఆగస్టు 15వ తేదీలోపు రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ లక్ష్యాన్ని అత్యుత్తమంగా సాధించిన అధికారులు, పంచాయతీలు, ప్రజాప్రతినిధులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా సన్మానిస్తామని తెలిపారు. శనివారం సచివాలయం నుంచి స్పెషల్ సీఎస్ దానకిషోర్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మీ మలతో కలిసి మంత్రి సీతక్క జిల్లా అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు), జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు, సీఈవోలు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీబీ జీ రాం జీ అమలు, తెలంగాణ జలసిరి పనులు, జిపి ఎస్‌పి రూపకల్పనపై సమగ్రంగా సమీక్షి ంచారు. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీబీ జీ రాం జీ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో మరింత వేగవంతంగా అమలు చేయాలని, తెలంగాణ జలసిరి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 7వ తేదీ నుంచి జిల్లాల వారీగా స్వయంగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తానని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అధికారులను బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.ప్రతి సోమ, మంగళ, బుధవారాల్లో తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించి, వీబీ జీ రాంజీ పరిధిలో ఉన్న 318 రకాల పనులను గ్రామాల అవసరాలకు అనుగుణంగా గుర్తించి వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊటకుంటు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాల వంటి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించే లక్ష యంతో అధికారులు పని చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు నీటి సంరక్షణ పనులను పెద్దఎత్తున చేపట్టాలని సూచించారు. తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో ప్రజాభాగస్వామ్యంతో విజయవంతం చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పంటకు ఫార్మ్ పాండ్, ప్రతి ఊరికి ఊట కుంట, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలను లక్ష్యంగా పెట్టుకుని పనులను వేగంగా ప్రారంభించాలని ఆదేశించారు.జిల్లా, మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు. ప్రభుత్వం ఎల్‌నినో పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందని, గ్రామీణ ప్రజలకు ఉపాధి, జల సంరక్షణ, సమగ్ర గ్రామాభివృద్ధి అనే మూడు లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు.

## కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా విద్యార్థి ఉద్యమ విజయానికి నిదర్శనం

### ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీలు

**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా విద్యార్థి ఉద్యమ విజయానికి నిదర్శనమని విద్యార్థి సంఘాలు పేర్కొన్నాయి. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయా ల్సిన పరిస్థితి రావడం దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత సాగించిన ఐక్య పోరాటాల విజయానికి నిదర్శనమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు తెలిపారు. నీట్ పరీక్ష లీకేజీ, సిబిఎస్ఇ వా ల్యూయేషన్ వైఫల్యం, సియుఈటిలో ఎన్‌టీఏ వైఫల్యాలు, పరీక్షల నిర్వ హణలో జరిగిన అవకతవకలు, విద్య కేంద్రీకరణ విధానాలకు వ్యతి రేకంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన ఉద్యమాలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం అణచివేయడానికి తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించిందన్నారు. పార్లమెంట్ మార్చ్ సందర్భంగా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై లాఠీ చార్జీలు, బాష్పవాయువు ప్రయోగాలు, పెల్లెట్ దాడులు వంటి చర్యలకు పాల్ప డిందన్నారు. కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామాతోనే పోరాటం ముగి యలేదని, దేశ విద్యావ్యవస్థను కాపాడేందుకు, విద్య కేంద్రీకరణ విధా నాల ను పూర్తిగా వెనక్కి తీసుకునే వరకు, ఎన్‌టీఏను రద్దు చేసే వరకు, జాతీయ విద్యావిధానం 2020 రద్దు చేసేంతవరకు పోరాడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. నీట్ వంటి కేంద్రీకృత ప్రవేశ పరీక్షలను రద్దుచేసి, రాష్ట్రాలే తమ పరిస్థితులకు అనుగుణంగా ప్రవేశపరీక్షలు నిర్వహించుకునే హక్కును కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పోరాట ఫలితమే ధర్మేంద్రప్రధాన్ రాజీనామా అని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తెలిపారు.

## సమ్మె ఒప్పందంలో అంగీకరించిన వాటిని అమలు చేయించాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎస్‌డబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్ఆర్‌టీసీ) ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 22 -24 తేదీల్లో జరిగిన సమ్మె ఒప్పందంలో భాగంగా ప్రభుత్వము అంగీకరించిన అంశాలను అమలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని టిఎస్ఆర్‌టీసీ- స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్-సిఐటియు) రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి విజ్ఞప్తి చేసింది. ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రతినిధి బృందం శనివారం మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మంత్రిని కలిసిన వారిలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి రమేష్, ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వి.ఎస్. రావు, ప్రచార కార్యదర్శి పి. రవీందర్ రెడ్డి ఉన్నారు. సమ్మె ఒప్పందంలో భాగంగా ప్రభుత్వం నాలుగు అంశాలను అమలు చేయడానికి అంగీకరించిందని, వాటిల్లో విలీనం, పేస్కేల్, యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేత, మిగిలిన సమస్యలపై చర్చించేందుకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల కమిటీ ఏర్పాటు చేశారని అందులో భాగంగా ఈడీల కమిటీ సమావేశంలో 17 అంశాలను చర్చించారన్నారు.

అందులో కొన్నిటిని అంగీకరించారని, అంగీకరించిన అంశాలను వెంటనే అమలుకు ఆదేశించాలని మంత్రిని కోరారు. ఈడీల కమిటీ అంగీకరించిన అంశాల అమలులో జరుగుతున్న జాప్యం వల్ల ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంటోందన్నారు. ఉద్యోగ భద్రతపై కమిటీని వెంటనేనియమించాలని, 2021 అర్పిఎస్ లో అలవెన్స్‌లు 80 శాతం పెంచుతామని మూడు నెలల క్రితమే అంగీకరించినప్పటికీ ఇంతవరకు అమలు జరగలేదన్నారు. నెలకు మూడు కోట్లకు పైగా కార్మికులు నష్టపోతున్నారని, తక్షణమే అమలు చేయాలని కోరారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్‌లో అపాయింట్ అయిన వారిని వెంటనే రెగ్యులర్ చేయాలని, జూనియర్ అసిస్టెంట్ టెస్ట్ పాసైవారందరికీ పోస్టింగ్‌కు అంగీకరించిన ఫైలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు 2017, 2021 ఆర్‌పిఎస్ ప్రకారం వేతన సవరణ ప్రయోజనాలు కల్పించాలని కోరారు. అంగీకరించిన అంశాలను తక్షణమే అమలు జరిగేలా ఆర్‌టీసీ యాజమాన్యాన్ని ఆదేశించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ సమస్యలను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీఇచ్చినట్లు ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి విఎస్ రావు తెలిపారు.



వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

## మెడికల్ కౌన్సెలింగ్‌లో రిజర్వేషన్ వర్గాలకు అన్యాయం జరగొద్దు

### పాత జిఒ 550 ప్రకారమే అడ్మిషన్లు చేపట్టాలి: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రారంభం కానున్న ఎంబీబీఎస్ మెడికల్ కౌన్సెలింగ్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, పాత జీవో నంబర్ 550 ప్రకారమే అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహను శనివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. గత 24 ఏళ్లుగా అమలులో ఉన్న జీవో 550ని మార్చి, గతేడాది తెచ్చిన జీవో 114 వల్ల మెడికల్ కౌన్సెలింగ్‌లో దాదాపు 300 నుండి 400 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బీసీ కులాల ఐక్య వేదిక అధ్యక్షుడు అనంతయ్య, సి. రాజేందర్, పృథ్వీ గౌడ్, శివ కుమార్ యాదవ్, బలరాం, వంశీ తదితరులు పాల్గొన్నారు. విజ్ఞప్తిపై స్పందించిన హెల్త్ అండ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి, రిజర్వేషన్ వర్గాలకు ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ నిర్ణయాల్లో అణగారిన వర్గాల స్వరం ప్రతిధ్వనించేలా కీలక బాధ్యతలు

## ఎస్సీ వర్గీకరణ, రోహిత్ వేముల బిల్లు కమిటీల్లో సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు స్థానం

**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సామాజిక న్యాయాన్ని మరింత బలోపేతం చేయా లన్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంకల్పానికి అనుగుణం గా, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను రెండు అత్యంత కీలక కమిటీలలో సభ్యునిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన (కేబినెట్) శాఖ జి.ఒ.ఆర్.టి. నెం.1077ను జారీ చేసింది. సుప్రీం కోర్టు ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన చారిత్రా త్మక తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలో చేపట్టాల్సిన చర్యలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్న ఉన్నతస్థాయి కమిటీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను సభ్యునిగా చేర్చారు. ఎస్సీ వర్గాల సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర అవగాహన కలిగిన మంత్రిగా ఆయన అనుభవం కమిటీ నిర్ణయాలకు మరింత బలం చేకూర్చనుంది. ఉన్నత విద్యా సంస్థల్లో కుల, సామాజిక గుర్తింపు ఆధారంగా వివక్షను నిరోధించే లక్ష్యంతో రూపొం దిస్తున్న రోహిత్ వేముల తెలంగాణ (ఉన్నత విద్యలో గుర్తింపు ఆధా రిత వివక్ష నిరోధక) బిల్లు-2026'కు సంబంధించిన శాసన రూపకల్పనపై అధ్యయనం చేసి సూచనలు చేయనున్న కేబినెట్ సబ్ కమిటీలో కూడా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు స్థానం కల్పించింది. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయక త్వంలో తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పరిపాలనకు కేంద్ర బిందువుగా నిలిపిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ, సమాన అవకాశాల కల్పన, రాజ్యాంగ స్ఫూర్తి పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగ ణనలోకి తీసుకుని, రాజ్యాంగబద్ధమైన, న్యాయసమ్మతమైన సిఫారసులు అందించేందుకు కమిటీ కృషి చేస్తుందని తెలిపారు.

## కొనుగోలు ధరపై మధ్యవర్తిత్వంతో పరిష్కారం చేసుకోండి

### ప్రభుత్వం, రైసుమిల్లులకు జిఒ నం.7పై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరెపల్లి నంద సూచన

**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త:** రబీ సీజన్ 2022-23లో సేకరించి ధాన్యంను రైసుమిల్లులు క్వింటాల్‌కు రూ.2236.81 చొప్పున చెల్లించాలని ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను మధ్యవర్తిత్వంతో ధర పరిష్కారం చేసు కోవాలని తెలంగాణ హైకోర్టు న్యామూర్తి జస్టిస్ సూరెల్లి నంద సూచించారు. రైసుమిల్లర్ల తరుపున న్యాయవాదులు దొంతిరెడ్డి వెంకటర్‌రెడ్డి, పాశం మోహిత్, కె.వేణుమాదవ్ మే8న జారీచేసి జివో7లో ఏకపక్షంగా తెలంగాణ ప్రభుత్వం క్వింటాల్‌కు 2,236.81 నిర్ణయించిందని రైసుమిల్లులో ధాన్యం నిల్వ చేసినందుకు ప్రభుత్వం గోదాముల అద్దెను, స్టోరేజి చార్జీలను, హమా లి, నిర్వహణ, ధాన్యం తేమలో హెచ్చుతగ్గులు, బరువు తగ్గం ఇతర ఇన్‌సిడెంటల్ చార్జీలు పరిగణలోకి తీసుకొని వాటి ధరను నిర్ణయించాలని తెలంగణలోని రైసుమిల్లర్ల తరుపున జస్టిస్ ముందు వాదన వినిపించారు. గతంలో ఇదే ధాన్యంను క్వింటాల్‌కు ఇ వేలం వేసి 1,702.51 కు వేలం వేసినారని టెండర్ రద్దుచేసి తదుపరి జరిపిన టెండర్‌లలో 2,022.50 రేటు లభించిందని సంవత్సరం తరువాత ఇప్పుడు అదే ధాన్యంకు 2,236.81 చొప్పున రికవరీ చేయాలని మిల్లుల యమజానులకు నోటిసులు ఇవ్వడం మిల్లుల తరుపు న్యాయవాదులు ఆక్షేపించారు.

వ్యక్తిగత షోకాజ్ నోటీసులు జారీ చేయకుండా, వారికి వ్యక్తిగత విచారణకు అవకాశం కల్పించకుండా రికవరీ మొత్తాన్ని నిర్ధారించారని ఇదీ ఏకపక్షమైనదనే కాకుండా సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘించేదని రైస్ మిల్లర్ల తరుపు న్యాయవాదులు వాదించారు.

విచారణ సందర్భంగా, పిటిషనర్ల తరఫున సీనియర్ నియమిత న్యాయవాది, రైస్ మిల్లర్లు రాష్ట్ర ప్రభుత్వంతో ఘర్షణ కోరుకోవడం లేదని, మధ్యవర్తిత్వం ద్వారా వివాదాన్ని పరిష్కరించుకోవడానికి సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. ఈ ప్రతిపాదనపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి సూచనలు పొందేందుకు అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి సమయం కోరారు. తదుపరి విచారణ కోసం కోర్టు ఈ విషయాన్ని జూలై 27వ తేదీకి వాయిదా వేసింది.

## కరెంట్ సమస్యలకు చెక్

### సప్లై అవాంతరాలకు తక్షణ పరిష్కారం

### దేశంలోనే తొలి ఎలక్ట్రిసిటీ అంబులెన్స్

### పైలట్ ప్రాజెక్టుగా ఖమ్మంలో అమలు

**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త:** కరెంట్ నాణ్యత, అవాంతరాలతో ఎన్నికసార్లు కాల్ చేసినా, వెళ్లి ఫిర్యాదు చేసినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడతో అవి పరిష్కారం కాక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రజలకు ఇబ్బంది కలగకుండా విద్యుత్ సరఫరా మరింత సుస్థిరం చేయటం కోసం విద్యుత్ శాఖ ఒక ముఖ్యమైన ముందడుగు వేసింది. అటువంటి సమస్యల పరిష్కారం కోసం తెలంగాణా ప్రభుత్వం అత్యవసర సేవల తరహాలో కరెంట్ సమస్యల కోసం ఒక కొత్త విధానం మొదలు పెట్టింది. దేశంలోనే తొలిసారిగా తెలంగాణాలో ఎలక్ట్రసిటీ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తెస్తోంది. వైద్య అత్యవసరాలలో 108 సేవలు అందించే తరహాలోనే, విద్యుత్ సమస్యలకు ఈ కొత్త ఎలక్ట్రసిటీ అంబులెన్స్ సేవ పని చేస్తుంది. ప్రధానంగా తీగలు తెగి పడటం, ట్రాన్స్ ఫార్మర్లు పేలటం, షార్ట్ సర్క్యూట్, విద్యుత్ అంతరాయాలు వంటి ఆకస్మిక సమస్యలు ఎదురైనప్పుడు ప్రత్యేకంగా తయారు చేసిన ఈ అంబులెన్స్‌లో అనుభవజ్ఞులైన టెక్నీషియన్ ల బృందం వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరిస్తారు. సహజంగా వర్షాకాలం లో కరెంట్ తీగలు తెగిపోవటం, విద్యుత్ స్తంభాలు పడిపోవటం వంటి సమస్యలు తరచుగా ఎదురవుతాయి. దీంతో విద్యుత్ నిలిచిపోయి వినియోగదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నా పట్టించుకోని విద్యుత్ సిబ్బంది అలసత్వానికి చెక్ పెట్టేందుకు ఆ శాఖ ఉన్నతాధికా రులు ఈ అంబులెన్స్‌లను తెరముందుకు తెచ్చారు. ఈ అంబులెన్స్ సేవలను ప్రయోగాత్మ కంగా మొదట ఖమ్మం జిల్లాలో శనివారం ప్రారంభమయ్యాయి.

## ధర్మేంద్రప్రధాన్ రాజీనామా విద్యార్థుల నైతిక విజయం

### రాహుల్‌గాంధీ పోరాట ఫలం: పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

### రాజకీయ అహంకారం తలవంచిన గొప్ప సందర్భం: మంత్రి పొన్నం

**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త:** రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీతోపాటు బిజెపి యేతర రాజకీయ పక్షాలన్నీ చేసిన పోరాటం ఫలితమే ధర్మేంద్రప్రధాన్ రాజీనామా అని పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాయుద్ధానికి ఎవరైనా తలొగ్గాల్సిందే అని ఆయన తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి లోకం నైతిక విజయం ఈ విజయానికి ప్రధాన కారణం రాహుల్‌గాంధీ పోరాటం అని అన్నారు. విద్యార్థులపై లాఠీ చార్జ్ యావత్ ప్రపంచం గమనించింది ఇలాంటి లీకేజీ ఘటనలు జరగకుండా సమగ్రంగా చట్టం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు.

రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో కోరిన విధంగా ఖర్గే సూచించిన విధంగా సమగ్ర చర్చ జరగాలనీ డిమాండ్ చేశారు. ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి, విద్యార్థుల డిమాండ్లను పరిష్క రించాలని, ఖాళీ ఎఫ్ఐఆర్‌లు ఢిల్లీ పోలీ సులు నమోదు చేసి దుర్వినియోగం చేయబోతున్నారని ఏ విద్యార్థిపేరు కొత్తగా అందులో రాయొద్దని మహేష్‌కుమార్ కేంద్రాన్ని హెచ్చరించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే దేశ యువత తగిన సమాధానం చెబుతుందని ఈ ఉద్యమం నిరూపించిందనీ ఇది ఒక్క వ్యక్తి రాజీనామా కాదు, విద్యార్థి శక్తి ముందు అహంకార రాజకీయాలు తలవంచిన సందర్భం అని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో విద్యా ర్థుల గొంతును అణచివేయాలని చేసిన ప్రతి ప్రయత్నానికి ఈ పరిణామం గట్టి సమాధానం ఈ ఉద్యమం అని అన్నారు. ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తాము ఎవరికీ జవాబు దారీ కాదు అన్న ఫాసిస్ట్ ధోరణితో వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వం నీట్ పేపర్‌లీకేజిని కూడా చాపకింద నీరులా ముగించాలని చూసిందనీ దేశంలోని విద్యార్థి శక్తి, యువత నరేంద్ర మోడీ కి గుణపాఠం చెప్పాలని పోరాటం చేయడంతో కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పని పరిస్థితివచ్చిందని హర్షం వ్యక్తంచేశారు.



## ఇ-కుబేరా పెండింగ్ బిల్స్‌ను క్లియర్ చేయాలి

### 51 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్సీ ప్రకటించాలి

### గవర్నర్‌కు టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించిన ఈ-కుబేరా పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ తో పాటు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లను కలిసి ఉపాధ్యాయులు, విద్యా రంగంలోని సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. సమగ్ర వినతిపత్రాన్ని గవర్నర్‌కు అందజేశారు. రాష్ట్రంలో విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గత కొన్నేళ్లుగా ఈ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గవర్నర్‌కు వివరించారు. ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి సమస్యలను పరిష్కరించేలా జోక్యం చేసుకోవాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ ప్రకటించి 51 శాతం ఫిట్‌మెంట్ అమలు చేయాలన్నారు. ఈ-కుబేరా ద్వారా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల బిల్లులను తక్షణమే క్లియర్ చేయాలిలని, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఆలస్యం లేకుండా చెల్లించాలన్నారు. హెల్త్ ట్రస్ట్ పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చే వరకు ఉపాధ్యాయుల వేతనాల నుంచి కోతలు నిలిపివేయాలని, ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు వార్షిక క్యాలెండర్ ప్రకటించి పారదర్శకంగా అమలు చేయాలన్నారు. స్పెషల్ టెట్‌లో అర్హత మార్కులను 40 శాతంగా నిర్ణయించి, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులకు దరఖాస్తు అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని గురుకుల విద్యాసంస్థల్లో ఏకరీతి పనివేళలు, టైమ్‌టేబుల్ అమలు చేయాలని, కేజీబీవీ, సమగ్ర శిక్ష సిబ్బందికి సమ్మె కాలపు వేతనాలు విడుదల చేసి, కనీస వేతనాలు అందేలా చూడాలన్నారు. జి.ఓ. ఎంఎస్. నెం.190ను విద్యాశాఖలో పూర్తిస్థాయిలో అమలు చేసి, అర్హులైన ఉద్యోగులకు ప్రయోజనాలు కల్పించాలన్నారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేసి, సుప్రీంకోర్టులో ఉన్న ఎస్ఎల్‌పీని ప్రభుత్వం ఉపసంహరించుకునేలా చూడాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. సీపీఎస్ స్థానంలో అర్హులైన ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలన్నారు. రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా సానుకూలంగా స్పందించి, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కార దిశగా చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు మల్క కొమరయ్య వెల్లడించారు.

# నూనెగింజల ఉత్పత్తిదారుల సమాఖ్య కార్యాలయం తనిఖీ

### లేట్‌కమర్స్‌పై వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్యలు

**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త:** తెలంగాణ సహకార నూనెగింజల ఉత్పత్తిదారుల సమాఖ్య (టిజిఆయిల్‌ఫెడ్) ప్రధాన కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో ఈ సందర్భంగా, ఉదయం 10:30 గంటల వరకు పలువురు అధికారులు, ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వెల్లడించారు. ఆలస్యంగా విధులకు హాజరయ్యే ఉద్యోగులపై సేవా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సహకార నూనెగింజల ఉత్పత్తిదారుల సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆదేశించడం జరిగిందన్నారు. దీంతో ఉదయం నిర్ధిష్ట సమయం తర్వాత కార్యాలయానికి ఆలస్యంగా హాజరైన ఉద్యోగులపై సంస్థ సేవా నియమావళి ప్రకారం ఎండి క్రమశిక్షణా చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఆలస్యంగా హాజరైన ఆరుగురు రెగ్యులర్ ఉద్యోగులకు మెమోలు జారీ చేయగా, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో ఇద్దరి సేవలను రద్దు చేసినట్లు వివరించారు. మరో ఇద్దరిని బదిలీ చేయగా, ముగ్గురు ఉద్యోగులకు మెమోలు జారీ చేశారని చెప్పారు. ప్రభుత్వ సంస్థల్లో సమయపాలన, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన విధి నిర్వహణ, ప్రజలకు సమర్థవంతమైన సేవలందించడం అత్యంత ప్రాధాన్యమైన అంశాలని పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిరక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు.

# వేములవాడ ఆలయానికి మరో 99.40 కోట్లు మంజూరు

### సిఎంకు ధన్యవాదాలు తెలిపిన ఆది శ్రీనివాస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై25:** దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.. రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే 2023–24 బడ్జెట్లో 50 కోట్లు, 2024–25 బడ్జెట్లో రూ.100 కోట్లు విడుదలవగా శనివారం మరో 99.40 కోట్ల నిధులు విడుదల చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో రూ.150 కోట్లతో సుమారు 45 శాతం పనులు పూర్తికాగా మరో రూ.99 కోట్లు నిధులు విడుదల కావడంతో రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ పనులు శరవేగంగా జరగనున్నాయి. కాగా విధులు మంజూరు కోసం కృషిచేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధన్యవాదాలు తెలియజేశారు.

# అగ్రరాజ్యంలో నీటి సంక్షోభం

**వాషింగ్టన్, జులై 25:** అగ్రరాజ్యం అమెరికాలో ఊహించని సంక్షోభం ముంచుకొస్తోంది. టెక్సాస్ రాష్ట్రంలోని కార్పస్ క్రిస్టీ అనే నగరం తీవ్రమైన నీటి కొరతతో అల్లాడుతోంది. సుమారు 3 లక్షల మందికి పైగా జనాభా ఉన్న ఈ తీర ప్రాంత నగరం, ఆధునిక అమెరికా చరిత్రలో నీళ్ల పూర్తిగా అడుగంటిన తొలి నగరంగా నిలిచే ప్రమాదంలో ఉంది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న కరవు, పెరుగుతున్న జనాభా, పారిశ్రామిక అవసరాలు, కొత్త నీటి వనరుల అభివృద్ధిలో జాప్యం వంటివి ఈ సంక్షోభానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. ఈ నగరంలో పారిశ్రామిక అభివృద్ధి శరవేగంగా జరగడం నీటి కొరతను మరింత తీవ్రతరం చేసింది. ముఖ్యంగా ఇక్కడ ఉన్న భారీ పెట్రోకెమికల్ పరిశ్రమలకు అత్యధిక మొత్తంలో నీరు అవసరం అవుతోంది. వాతావరణ మార్పుల వల్ల ఇప్పటికే తగ్గిపోయిన నీటి నిల్వలపై ఇది తీవ్ర ఒత్తిడి పెంచుతోంది. నివేదికల ప్రకారం.. 2022లో నిర్మించిన ఒక ప్లాస్టిక్స్ కెమికల్ ప్లాంట్, నగరంలోని ప్రజలందరూ కలిసి ఒక రోజులో వాడే నీటిని ఒక్కరోజే కూలింగ్ కోసం వినియోగిస్తోందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

# హైదరాబాద్‌లో నెదర్లాండ్స్ మహిళపై లైంగిక వేధింపులు

### గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జులై 25, ప్రభాతవార్త:** భారత పర్యటనకు వచ్చిన ఓ నెథర్లాండ్స్ దేశ మహిళపై నగరంలో వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడడంతో సదరు మహిళ గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేసింది. ఈ పిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... నెథర్లాండ్స్ దేశం అమ్‌స్టర్‌డామ్‌లోని పోల్స్‌బ్రోక్ స్ట్రీట్‌కు చెందిన మహిళ(33) తన ప్రియుడు ప్రజయ్ నాగ్దేవ్‌తో కలిసి మార్చి 5వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మూడు వారాల భారత పర్యటనకు వచ్చింది. నగరానికి వచ్చిన ఈ జంట కొండాపూర్‌లోని ఎషియన్ సన్‌సిటీలో గల బ్లాక్ సి ప్లాట్ నెంబరు 1406లో నివసిస్తున్న ఆదిత్య అనంద్ ఇంట్లో ఉన్నారు. ప్రజయ్ వాగ్దేవ్ పనిచేస్తున్న సంస్థలోనే ఆదిత్య ఆనంద్ పనిచేస్తున్నాడు. కాగా నగరంలో ఉన్న మూడు వారాల పాటు ఆదిత్య అనంద్ తన మీద లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని మహిళ పిర్యాదు చేసింది. తనను అభ్యంతరకరంగా చూడడం, తగలకూడని చోట తన శరీర భాగాలను తాకడంతో పాటు తన ప్రియుడు ఇంట్లో లేని సమయంలో తన గదిలోకి ప్రవేశించడం వంటి వేధింపులకు పాల్పడ్డాడని మహిళ తెలిపింది. మార్చి 17వ తేదీన ఆమె ఒంటరిగా ఇంట్లో ఉన్న సమయంలో అర్ధనగ్నంగా ఉన్న తన శరీరాన్ని తాకాడని, మరింత ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించాడని తెలిసింది. తాను వారించడం, అదే సమయంలో తన ప్రియుడు రావడంతో ఆదిత్య అక్కడి నుంచి వెళ్లిపోయాడని తెలిపింది. ఈ ఘటన అనంతరం ఆమె భారత్ నుంచి తన స్వదేశానికి వెళ్లిపోయింది. కాగా అక్కడికి వెళ్లిన తరువాత సైతం ఆదిత్య తన వేదింపులను ఆపకుండా తన ప్రియుడితో తనను ఉద్దేశించి ఒత్తిడి నివారణ యంత్రం అంటూ సంబోధించడంతో సదరు మహిళ భారత్‌కు తిరిగి వచ్చిన తరువాత ఆదిత్య మీద పిర్యాదు చేయాలని భావించింది. అదే సమయంలో డచ్ రాయబార కార్యాలయంలో వివరాలు వెల్లడించడంతో పాటు జూలైలో తాను భారత్‌కు వెళ్లి పిర్యాదు చేస్తానని చెప్పింది. ఇందులో భాగంగా ఈనెల 22వ తేదీన భారత్‌కు వచ్చిన మహిళ 23వ తేదీన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆదిత్య ఆనంద్ వేధింపులపై పిర్యాదు చేసింది. ఈ విషయమై కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# పదవులు శాశ్వతం కాదు, ప్రజావిశ్వాసమే ముఖ్యం

### ధర్మేంద్రప్రధాన్ రాజీనామాను ప్రశంసించిన కేంద్రమంత్రి బండి సంజయ్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై25:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఇది బీజేపీ అనుసరించే "దేశం మొదట, పార్టీ తర్వాత, వ్యక్తిగతం ఆఖరు" అనే మూల సిద్ధాంతానికి నిదర్శన మని ఆయన పేర్కొన్నారు. పదవులు శాశ్వతం కాదని, ప్రజల విశ్వాసమే అత్యంత కీలకమని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. విద్యా ర్థి ఉద్యమ నేత స్థాయి నుంచి కేంద్ర మంత్రిగా కీలక బాధ్యతల వరకు ధర్మేంద్ర ప్రధాన్ దశాబ్దాలుగా దేశానికి అందించిన సేవలను కొనియాడుతూ, ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే ప్రజల గొంతుకను వినడం, వారి అభిప్రాయాలను గౌరవించడమేనని బండి సంజయ్ వివరించారు. క్లిష్ట సమయాల్లో బాధ్యతను స్వీకరించే ధైర్యం ప్రదర్శించడమే నిజమైన నాయకత్వ లక్షణమని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తీవ్రతరం

### 385 మండలాలకు చేరిన లోటు వర్షపాతం

**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త:** ఎల్ నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాల బలహీనత కారణంగా తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎల్‌నినో ప్రభావం వల్ల అనేక గ్రామాల్లో వర్షాలు పడక సాగు విస్తీర్ణం భారీగా పడిపోయింది. వానలు కురియకపోవడంతో రాష్ట్రంలో సగం కన్నా ఎక్కువ మండలాల్లో తీవ్ర వర్షాభావం ఏర్పడింది. వానాకాలం సీజన్ ప్రారంభమైన జూన్ నెల నుండి ఇప్పటి వరకూ రాష్ట్రంలో నమోదైన వర్షపాతం చూస్తే పరిస్థితి దారుణంగా ఉందనేది అర్థమవుతోంది తెలంగాణలో మొత్తం 621 మండలాలకు, గాను జూన్ 1వ తేదీ నుండి ఇప్పటి వరకూ 385 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఇవి కాకుండా మరో 45 మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

కేవలం 165 నుండి 183 మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైంది. జూన్ 1 నుంచి ఈ నెల 19 వరకు 254.3 మి.మీటర్ల సాధారణ వర్షపాతం కురవాల్సి ఉండగా, 170.7 మి.మీ మాత్రమే కురిసింది.

ములుగు మినహా మిగిలిన జిల్లాల్లో 33 శాతం లోటు వర్షపాతం నమోదైంది. గతేడాది వానాకాలంలో జులై 19 నాటికి 204.3 మి.మీ.లు కురిసింది. ఈసారి 13 శాతం లోటు నమోదైంది. ఫలితంగా తెలంగాణ రాష్ట్రంలో 12,760 రెవెన్యూ గ్రామాలు ఉండగా, కేవలం 1,609 గ్రామాల్లో మాత్రమే వ్యవసాయ పనులు కొనసాగుతున్నాయి. ఏకంగా 11,151 గ్రామాల్లో తీవ్ర నైరాశ్యం నెలకొంది. ఎల్ నినో ప్రభావంతో ఈ గ్రామాల్లో వర్షాల మాటే లేదు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 2,320 గ్రామాల్లో ఒక మోస్తరు, 7959 గ్రామాల్లో తీవ్రంగా, 892 గ్రామాల్లో అత్యంత తీవ్ర లోటు ఉంది. మొత్తంగా చూస్తే ప్రస్తుత వానాకాలం సీజన్‌లో గురువారం వరకు 23 జిల్లాల్లో ఇంకా వర్షాభావమే ఉంది. మిగిలిన పది జిల్లాల్లోనూ సాధారణ వర్షపాతమే నమోదైందని వ్యవసాయ శాఖ వెల్లడించింది.

# ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

### ప్రతీచుక్క నీటిని తెలివిగా వినియోగించాలి
### పప్పుధాన్యాలు, కూరగాయలు, ఉద్యాన పంటల సాగు
### పరిగణనలో పెట్టుబడి, నీరు, మార్కెట్ అవకాశాలు
### ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి



**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్ష పాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్‌చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి తెలిపారు. ఎల్ నినో ప్రభావం మరియు పంటల వైవిధ్యీకరణపై అవగాహన కల్పించేందుకు శనివారం వనపర్తి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన రైతు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం కారణంగా సాంప్రదాయ సాగు పద్ధతులను మార్చుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రైతులు కేవలం దిగుబడినే కాకుండా పెట్టుబడి వ్యయాలు, నీటి లభ్యత, మార్కెట్ అవకాశాలను కూడా పరిగణనలోకి తీసుకుని పంటలను ఎంచుకోవాలన్నారు. ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఒకే పంటపై ఆధారపడకుండా, పంటల వైవిధ్యం పాటించడం ద్వారా రైతులు నష్టాలను తగ్గించుకుని, స్థిరమైన ఆదాయాన్ని పొందగలరని ఆయన వివరించారు. ప్రతి గ్రామంలో రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించడానికి వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు సిద్ధంగా ఉన్నారని, ఏవైనా సందేహాలుంటే ఈ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. నేల పరీక్షలు నిర్వహించి, ఫలితాల ఆధారంగా ఎరువులు వేయడం వల్ల సాగు ఖర్చులు తగ్గి, దిగుబడి పెరుగుతుందని వివరించారు. వర్షాభావ అవకాశం ఉన్నందున, రైతులు వరికి బదులుగా కందిపప్పు, పప్పుధాన్యాలు, కూరగాయలు, ఇతర ఉద్యానవన పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని, శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబించాలని వారిని ప్రోత్సహించారు. అధికారులు సహాయం చేయడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని కూడా తెలిపారు. నీటి వృధాను నివారించడం, ప్రతి నీటి చుక్కను తెలివిగా ఉపయోగించడం, విద్యుత్ వినియోగంలో పొదుపు పాటించడంపై ప్రత్యేకంగా నొక్కి చెప్పారు. స్థానిక పర్యావరణ పరిస్థితులకు అనువైన శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా రైతులు ఎలాంటి ప్రతికూల పరిస్థితులనైనా విజయవంతంగా అధిగమించగలరని ఆయన పేర్కొన్నారు. పంట సాగు సమయంలో ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, ఎరువులు అధికంగా వాడటం దీర్ఘకాలంలో నేల సారవంతంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని రైతులకు సూచించారు, అంతేకాకుండా, మొక్కలు నాటే బాధ్యతను ప్రతిఒక్కరూ తీసుకోవాలని, ఇది పర్యావరణ సమతుల్యతను పెంచి, సమృద్ధిగా వర్షపాతాన్ని ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు.

# దేశానికే ఆదర్శంగా మోడల్ సోలార్ గ్రామాలు

### రూ. 1,000 కోట్లతో 81 సోలార్ విలేజ్‌లు
### సాంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థ ఎండి ముషారఫ్

**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త:** సోలార్ తెలంగాణగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్రంలో తలపెట్టిన మోడల్ సోలార్ గ్రామాలను దేశానికే ఆదర్శంగా నిలిపే లక్ష్యంతో ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర సాంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) ఎండీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 81 మోడల్ సోలార్ విలేజ్‌ల కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లాలో చేపడుతున్న పనులను శనివారం ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ జిల్లాలోని బోనకల్, రావినూతల, గార్లపాడు గ్రామాల్లో కొనసాగుతున్న సోలార్ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బోనకల్ మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో ముషారఫ్ ఫరూఖి మాట్లాడుతూ, తెలంగాణలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచే లక్ష్యంతో ఉన్నామన్నారు. రాష్ట్రంలో సౌర వనరులు అపరిమితంగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. విద్యుత్ నిత్యావసరంగా మారిన నేపథ్యంలో రోజురోజుకూ విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని తెలిపారు. అయితే ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తిలో ప్రధానంగా వినియోగిస్తున్న బొగ్గు వనరులు పరిమితమైనవని వెల్లడించారు. బొగ్గు వినియోగాన్ని తగ్గించడంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్లపై, వ్యవసాయ క్షేత్రాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా వినియోగదారులు తమ వంతుగా సౌర విద్యుత్ ఉత్పత్తికి సహకరించాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ1,000 కోట్ల వ్యయంతో 81 గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఇప్పటికే కొండారెడ్డిపల్లి గ్రామాన్ని పూర్తిస్థాయిలో సోలార్ గ్రామంగా అభివృద్ధి చేశామని తెలిపారు. సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థల ద్వారా కుటుంబాలు తమ విద్యుత్ అవసరాలను తీర్చుకోవడంతో పాటు, అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు అందించి ఆర్థిక ప్రయోజనం పొందే అవకాశం ఉందన్నారు. ప్రతి ఇంట్లో సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

# కఠిన చట్టాలు తీసుకొస్తున్న ప్రధాని మోడీకి ధన్యవాదాలు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై25:** పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2024లో "పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం 2024" ను తీసుకువచ్చిందని, యూపీఏ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా అనేక పరీక్షా లీకేజీలు జరిగినప్పటికీ, ఇలాంటి కఠినమైన చట్టాన్ని తీసుకురాలేకపోయారు. కానీ మోదీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చట్టపరమైన రక్షణ కల్పించిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పేర్కొనారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే దిశగా, ప్రజా పరీక్షల విశ్వసనీయతను మరింత బలోపేతం చేసే ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణను మరింత పారదర్శకంగా, నిష్పాక్షికంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిపుణులతో కూడిన రాధాకృష్ణ కమిటీ సిఫార్సుల మేరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో పలు సంస్కరణలు చేపట్టిందని, అధికారుల నిర్లక్ష్యం లేదా ఇతర కారణాల వల్ల లోపాలు జరిగిన నేపథ్యంలో బాధ్యులపై చర్యలు తీసుకుంటూ, దాదాపు 47 మంది అధికారులను బదిలీ చేసిందని తెలిపారు.

తప్పు చేసిన వారిని ఉపేక్షించబోమనే సంకల్పాన్ని కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా చాటింది. ప్రస్తుతం 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ పార్లమెంట్‌లో సవరణలు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ చట్టం పరిధిలో యూపీఎస్సీ, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే పరీక్షలతో పాటు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే అన్ని ప్రజా పరీక్షలు ఉంటాయి.

పరీక్షా పత్రాల లీకేజీ లేదా ఇతర అక్రమాలకు పాల్పడిన వారికి కనీసం 10 సంవత్సరాల జైలు శిక్ష విధించేలా చట్టాన్ని మరింత కఠినతరం చేస్తున్నారని చెప్పారు. అలాగే ఇప్పటివరకు ఉన్న రూ.1 కోటి జరిమానాను రూ.15 కోట్ల వరకు పెంచే ప్రతిపాదన తీసుకొచ్చారని,పరీక్షా లీకేజీ కేసుల విచారణను వేగవంతం చేయడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి, నాలుగు నెలల్లోపు దర్యాప్తు పూర్తిచేసి చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా వ్యవస్థను బలోపేతం చేస్తున్నానని చెప్పారు.

# అధికారంలో ఉన్నవారి కంటే ప్రజాశక్తి ఎప్పుడూ గొప్పది

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్
### దేశంలోని యువతకు ఇది ఒక గొప్ప విజయం: హరీశ్‌రావు
### పార్టీ తరఫున విద్యార్థులకు అభినందనలు: తలసాని
### ధర్మేంద్ర రాజీనామా దేశ యువత సాధించిన విజయం: వేముల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై25:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. అధికారంలో ఉన్న వారి కంటే ప్రజల శక్తి ఎప్పుడూ గొప్పది అని పేర్కొన్నారు. జెన్ జెడ్ అంటూ విక్టరీ సిబల్ చూపిస్తూ ట్వీట్ చేశారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం చేసిన దాష్టీకానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమానికి మహానగరంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది యువతీ యువకులు దండుకట్టి తరలివచ్చారని తెలిసిందే. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై భావోద్వేగంతో ప్రసంగించారు. "పరీక్ష పే చర్చ పెట్టిన మీరు పేపర్ లీకేజీలపై ఎందుకు పెట్టలేదు? ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది? అని కేంద్రాన్ని నిలదీశారు. ఢిల్లీలో పిల్లలపై దాడులను చూస్తుంటే ఇద్దరు పిల్లల తండ్రినైన తన మనస్సు చలించిపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.

ఢిల్లీ వీధుల్లో న్యాయం కోసం పోరాడుతున్న యువకులపై ఉగ్ర వాదులు, దేశద్రోహులు, పాకిస్థాన్ నుంచి నిధులు వస్తున్నాయని అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. నిజంగానే కేంద్రానికి బాధ్యత ఉంటే ఉద్యమిస్తున్న విద్యార్థుల వద్దకెళ్లి చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాల్సి ఉండేదన్నారు. మాజీ మంత్రి, బిఆర్ఎస్ఎల్‌పి ఉపనేత హరీష్‌రావు స్పందిస్తూ, దేశంలోని యువతకు ఇది ఒక గొప్ప విజయం అని వ్యాఖ్యానించారు. సామాజిక దృక్పథంలో వస్తున్న మార్పు నిజంగానే కనిపిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులందరికీ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి స్పందిస్తూ , కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువత మొక్కవోని పోరాట పటిమతో సాధించిన ప్రజాస్వామ్య విజయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో మాజీమంత్రి,బిఆర్ఎస్ఎల్‌పి ఉపనేత తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్య విజయం, విద్యార్థుల విజయం అని అభివర్ణించారు. బిఆర్ఎస్ పార్టీ తరఫున విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

# మాపై దాడి చేసిన పాలన కూలిపోయింది

### ఇప్పుడు ఒక గే నియంత పాలనలో ఉంది: ట్రంప్



**వాషింగ్టన్, జులై 25:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్‌లో జరిగిన కాల్పుల ఘటన కారణంగా వాయిదా పడిన వైట్ హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ విందులో ప్రసంగించిన ట్రంప్, గతంలో అమెరికాపై దాడి చేసిన పాలన ఇప్పుడు కూలిపోయిందని, ప్రస్తుతం ఆ దేశాన్ని ఇపుడు ఒక గే నియంత (గే డిక్టేటర్) పాలిస్తు న్నారని వ్యాఖ్యానించారు. అయితే ఆయన ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారో స్పష్టంగా చెప్పకపోయినా, అవి ఇరాన్‌ను ఉద్దేశించినవేనని భావిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో కూడా ట్రంప్ ఇదే అంశంపై వ్యాఖ్యానించారు. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ స్వలింగ సంపర్కుడని అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ) తనకు సమాచారం ఇచ్చిందని అప్పట్లో పేర్కొన్నారు.మీడియా చిట్‌చాట్‌లోకూడా సీఐఏ ఆ విషయం చెప్పింది. అయితే వాళ్లే కాదు, మరికొంత మంది కూడా అదే చెప్పారని ట్రంప్ సమాధానమిచ్చారు. ఈ ఆరోపణ కేవలం నిఘా సంస్థల సమాచారానికే పరిమితం కాదని ఆయన సూచించారు. ఇరాన్‌తో ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఘర్షణను ముగించేందుకు అమెరికాతో ఒప్పందం చేసుకోవాలని టెహ్రాన్ కోరుకుంటోందని ట్రంప్ అన్నారు. ప్రస్తుతం ఆ దేశం చర్చలకు సిద్ధంగా లేదని అభిప్రాయపడ్డారు. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని అమెరికా తీవ్రంగా దెబ్బతీసిందని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌పై మేము భారీ దాడులు చేశాం. వారి నౌకాదళం దాదాపు లేకుండాపోయింది. వైమానిక దళం కూడా నిర్వీర్యమైంది. 250 యుద్ధ విమానాలు, 159 నౌకలు ధ్వంసమయ్యాయి. అవన్నీ ఇప్పుడు సముద్ర గర్భంలో ఉన్నాయని ఆయన అన్నారు.

# మార్కెట్లో పెరిగిన కూరగాయల ధరలు

**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త :** ఎల్‌నినో ఎఫెక్ట్‌తో తెలంగాణలో కూరగాయల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా జూన్, జూలై నెలలో కురవాల్సిన వర్షాలు ఈసారి జాడ లేకపోవడంతో కూరగాయల సాగు తీవ్రంగా దెబ్బతింటోంది. బోర్ నీళ్లనే వర్షం మాదిరిగా స్ప్రే చేస్తూ పంటలను బతికించే ప్రయత్నం చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. ఒకప్పుడు తెలంగాణలో 5.52 లక్షల ఎకరాల్లో పండిన కూరగాయలు ప్రస్తుతం 45 వేల ఎరాలకు పడిపోయింది. మరోపక్క హార్టికల్చర్‌కు కేంద్రంగా ఉండే హైదరాబాద్ చుట్టుపక్కల గ్రామాలు ఇప్పుడు రియల్ ఎస్టేట్ విస్తరణతో కూరగాయల సాగు క్రమంగా తగ్గిపోయిందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో రాష్ట్రంలో కూరగాయల దిగుబడి గణనీయంగా పడిపోయింది. చిక్కుడు, టమాటా, బీన్స్, క్యాబేజీ లాంటి కూరగాయల ఉత్పత్తి తగ్గిపోయింది. వర్షాభావంతో చిక్కుడు పంటలు ఎండిపోతుండగా, టమాటా దిగుబడి కూడా పూర్తిగా పడిపోయింది. మొన్నటి వరకు హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.50 నుంచి రూ.60 మధ్య ఉన్న టమాటా, ఇప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి వస్తే తప్ప హైదరాబాద్ మార్కెట్‌లో దొరకని పరిస్థితి ఏర్పడింది. బీన్స్ రైతు బజార్లోనే కిలో రూ.100 ఉండగా, రిటైల్ మార్కెట్‌లో రూ.150 నుంచి రూ.180 వరకు అమ్ముడవుతోంది. చిక్కుడుకాయ కూడా రైతు బజార్లో రూ.70 నుంచి రూ.80 ఉండగా, బయట మార్కెట్‌లో రూ.150 వరకూ పలుకుతోంది. ఇక రైతు బజార్లలో సరుకు లేకపోవడంతో మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. ఎల్‌నినో పరిస్థితులతో దిగుబడి తగ్గడంతో పాటు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూరగాయల దిగుమతులు తగ్గి, రాష్ట్రంలో కొరత తీవ్రమయ్యే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు.



డాక్టర్ వై.వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిమ్స్ వైద్య బృందం

# వణుకు, పార్కిన్సన్స్ వ్యాధికి అత్యాధునిక చికిత్స

### గంట, రెండు గంటల్లోనే సర్జరీ
### పరికరాలు అమర్చకుండానే వణుకు వ్యాధికి చికిత్స
### మరో మైలురాయిని చేరుకున్న నిమ్స్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జులై 25, ప్రభాతవార్త:** ఫంక్షనల్ న్యూరో సర్జరీ (మెదడు పనితీరుకు సంబంధించిన శస్త్రచికిత్స)లో నిమ్స్ ఆసు పత్రి మరో ముందడుగు వేసింది. పార్కిన్సన్స్ వ్యాధి, చేతులు, కాళ్లలో అదుపులేని వణుకు, కండరాల కదలికల్లో లోపాలు వంటి సమస్యలకు చేసే డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ (మెదడులోని నిర్దిష్ట ప్రాంతాలకు విద్యుత్ సంకేతాలు అందించే చికిత్స) శస్త్రచికిత్సను ఎంపిక చేసిన రోగులకు కేవలం 1–2 గంటల్లోనే పూర్తి చేస్తున్నట్లు నిమ్స్ వైద్యులు తెలిపారు. గతంలో ఈ శస్త్రచికిత్సకు 5–6 గంటల సమయం పట్ట డంతోపాటు రోగి మెలకువగా ఉండాల్సి వచ్చేది. దీంతో రోగులకు అసౌ కర్యం, ఆందోళన, అలసట ఎదురయ్యేవి. ఆధునిక వైద్య సాంకేతికత, స్కానింగ్ ద్వారా మెదడులోని అవసరమైన ప్రాంతాన్ని కచ్చితంగా గుర్తించి, ఇప్పుడు సాధారణ మత్తు మందుతోనే తక్కువ సమయంలో శస్త్రచికిత్స నిర్వహిస్తున్నట్లు న్యూరోసర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ వై.వంశీకృష్ణ తెలిపారు. రెండున్నరేళ్లలో నిమ్స్‌లో 200కుపైగా డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. మందులతో తగ్గని చేతులు, కాళ్ల వణుకు సమస్యకు నిమ్స్ లో ఎంఆర్ఐ స్కానింగ్ సహాయంతో రేడియో తరంగాల ద్వారా మెద డులోని సమస్యాత్మక ప్రాంతానికి చికిత్స చేసే విధానాన్ని సైతం అందు బాటులోకి తెచ్చారు. ఈ చికిత్సలో శరీరంలో ఎలాంటి శాశ్వత పరికరాన్ని అమర్చాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.5 లక్షల వరకు ఖర్చయ్యే ఈ చికిత్సను, అర్హులైన పేదరోగులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే మూత్రాశయంపై మెదడు, నరాల నియంత్రణ దెబ్బతినడం వల్ల వచ్చే సమస్యలకు నరాల విద్యుత్ సంకేతాలను నియంత్రించే సాక్రల్ న్యూరోమాడ్యులేషన్ చికిత్సను సైతం నిమ్స్ ప్రారంభించింది. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రపంచస్థాయి వైద్యసేవలను అందించడంతోపాటు అత్యాధునిక చికిత్సలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడమే నిమ్స్ లక్ష్యమని డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. తక్కువ సమయంలో శస్త్రచికిత్సలు పూర్తిచేయడం వల్ల రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డా. వై.వంశీకృష్ణ, డా. సిరీష యరీడ, డా. వసుంధరలను డైరెక్టర్ అభినందించారు.

# 50,114 సౌర విద్యుత్ కనెక్షన్లు పూర్తి



సౌరవిద్యుత్తు అనుసంధాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎపిసిపిడిసిఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ పి.పుల్లారెడ్డి

- 180 మెగావాట్ల సామర్థ్యం గ్రిడ్‌కు అనుసంధానం
- ఎపిసిపిడిసిఎల్‌లో పిఎం సూర్యఘర్

**ముఫ్త్ బిజ్లీ యోజన మరో మైలురాయి**

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిసిపిడిసిఎల్) పరిధిలో ప్రధానమంత్రి పిఎం సూర్యాఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన అమలులో మరో కీలక మైలురాయిని అధిగమించింది. ఈ పథకం కింద మొత్తం 50,114 సౌర విద్యుత్ (రూఫ్‌టాప్ సోలార్) కనెక్షన్లు పూర్తి చేసి, 180 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని రాష్ట్ర విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు ఎపిసిపిడిసిఎల్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ పి.పుల్లారెడ్డి తెలిపారు. అనుసంధాన కార్యక్రమం అనంతరం సిఎండి మీడియాతో మాట్లాడుతూ, ఏప్రిల్-2025 నాటికి కేవలం 6,489 కనెక్షన్లు మాత్రమే పూర్తి కాగా, గత ఒక్క సంవత్సరం కాలంలోనే మరో 43,625 కనెక్షన్లను పూర్తి చేయడం ద్వారా మొత్తం 50,114 సౌర విద్యుత్ కనెక్షన్ల మైలురాయిని చేరుకోవడం ఎపిసిపిడిసిఎల్‌కు గర్వకారణమని తెలిపారు. అధికారులు, ఇంజనీర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది సమష్టి కృషితో ఈ ప్రగతి సాధ్యమైందన్నారు. వినియోగదారులకు ఇంటింటికీ వెళ్లి పథకం ప్రయోజనాలపై అవగాహన కల్పించడం, దరఖాస్తు నుండి గ్రిడ్ అనుసంధానం వరకు నిరంతరం మార్గనిర్దేశం చేయడం, ప్రతి రోజు వెండార్లతో అధికారులు సమీక్షలు నిర్వహిస్తూ ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించడం, అన్ని విభాగాల మధ్య సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ అద్భుత విజయాన్ని సాధించగలిగామని సిఎండి పేర్కొన్నారు.
పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంపొందించడంలో, పర్యావరణ పరిరక్షణలో పిఎం సూర్యాఘర్ పథకం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో మరింత వేగంగా సౌర విద్యుత్ కనెక్షన్లు అందించి రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ లక్ష్యాల సాధనకు ఎపిసిపిడిసిఎల్ కట్టుబడి పనిచేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఈ విజయానికి కృషి చేసిన డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) టివిఎస్ఎన్ మూర్తి, కార్పొరేట్ కార్యాలయ అధికారులు, ప్రాజెక్ట్స్ విభాగం బృందం, అన్ని సర్కిళ్ల చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, డివిజన్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, వెండార్లను సిఎండి పి.పుల్లారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.



రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

## రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** మచిలీపట్నంకు చెందిన ఒడుగు నరేంద్ర, వనమాడి కుమార్ రోడ్డు ప్రమాదంలో మరణించడం పట్ల మంత్రి తీవ్ర విచారం వ్యక్తంచేశారు. శనివారం ఉదయం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంధ్య ఆక్వాలో రోజు వారీ పని కోసం వెళ్తుండగా లారీ ఢీ కొనడంతో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. బాధిత కుటుంబాల ఆవేదన తీర్చలేనిది. ప్రయాణ సమయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి. అధికారులు కూడా రోడ్డు ప్రమాదాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బ్లాక్ స్పాట్స్ వద్ద స్పీడ్ బ్రేకర్లు, వార్నింగ్ లైట్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

## గోదావరిలో ఇన్‌ఫ్లో బాగా తగ్గిపోయింది

- జలవనరుల శాఖ ఇఎన్‌సి నరసింహామూర్తి

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** గోదావరిలో ఇన్‌ఫ్లో బాగా తగ్గిపోయిందని జలవనరుల శాఖ ఇఎన్‌సి నరసింహామూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో గోదావరి జిల్లాలో 71 శాతం వర్షపాతం తక్కువగా ఉంది. గోదావరి డెల్టా ఆయకట్టు ఖరీఫ్ పంటకు సాగునీటి కొరత ఉండదు. గత 70యేళ్లలో గోదావరి పరివాహక ప్రాంతంలో లేని నీటి కొరత ఇప్పుడు ఏర్పడింది. ప్రస్తుతం 50 టిఎంసిల నీరు గోదావరి డెల్టాకు అందించాం. గోదావరి డెల్టాకు 14,700 క్యూసెక్కులు ఇస్తున్నాం. మరో 80 టిఎంసిలు గోదావరి డెల్టాలో ఖరీఫ్ పంటకు అవసరం. గోదావరిలో లభ్యమయ్యే నీటి నిల్వలతో ఈ పరిస్థితిని అధిగమిస్తాం. డెల్టా గోదావరి నీరు ఇస్తాం. కాకినాడ జిల్లా మెట్ట కోసం వారికి సాగునీరు అందించలేని నీటి అవసరాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. కృష్ణా డెల్టాకు నీటి కొరతపై ప్రత్యేక చర్యలు చూస్తున్నాం. విశాఖ, కాకినాడ జిల్లాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని జలవనరుల శాఖ ఇఎన్‌సి నరసింహామూర్తి తెలిపారు.

## హోం మంత్రి అనిత 'ఎక్స్' అకౌంట్ హ్యాక్

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సామాజిక మాధ్యమం 'ఎక్స్' అకౌంట్ హ్యాక్ అయ్యింది. దీంతో హోం మంత్రి కార్యాలయ అధికారులు అలర్ట్ జారీ చేశారు. మంత్రి అనిత వ్యక్తిగత ఎక్స్ అకౌంట్‌ను కొందరు హ్యాక్ అయ్యిందని, ఈ సమయంలో ఆ అకౌంట్ నుంచి అనధికారిక పోస్టులు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. అకౌంట్ సైబర్ దాడికి గురైన నేపథ్యంలో పోస్ట్ చేసిన అంశాలను అధికారికంగా పరిగణించవద్దని హోంమంత్రి కార్యాలయం ప్రకటించింది. అకౌంట్ హ్యాక్ అవ్వడంపై ఇప్పటికే పోలీసులకు మంత్రి ఫిర్యాదు చేశారు. హ్యాక్ చేసిన వారిని గుర్తించేందుకు, అకౌంట్ రికవరీకి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# అగ్నిప్రమాదాల నివారణపైనే ప్రత్యేక దృష్టి

- అవగాహన కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యమే లక్ష్యం
- అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ పి.వి. రమణ



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 25 ప్రభాతవార్త:** అగ్నిప్రమాదాలు సంభవించిన తర్వాత స్పందించడం కంటే, అవి జరగకుండా ముందుగానే నివారించడమే అగ్నిమాపక శాఖ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ పి.వి.రమణ తెలిపారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, రాజా నగరంలలో నిర్వహిం చిన ఫైర్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం, మాక్ డ్రిల్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జెనరల్ పి.వి. రమణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 60 శాతం ఆసుపత్రుల్లో ఫైర్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు పూర్తి చేశామని, త్వరలోనే పాఠశాలల్లో కూడా ఇదే తరహా కార్యక్రమాలు చేపడతామని పి.వి.రమణ చెప్పారు.
ప్రతి అగ్నిమాపక కేంద్రం పరిధిలో నెలకు నాలుగు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని వెల్లడించారు. విద్యార్థులు, ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా యానిమేషన్ వీడియోలు, జింగిల్స్, కరపత్రాలు, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. సంప్రదాయ ఉప న్యాసాల కంటే దృశ్య రూపంలో ఇచ్చే అవగాహన కార్యక్రమాలు మరింత ప్రభావవంతంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. అనంత రం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధికారులతో అగ్నిమాపక శాఖ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రులు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలు వంటి ప్రజలు అధిక సంఖ్యలో ఉండే భవనాల్లో అగ్ని భద్రతా ప్రమాణాలను రాజీ పడకుండా అమలు చేయాలని ఆయన కోరారు. నిర్మాణ దశలోనే అగ్ని భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా పెద్ద ఎత్తున ప్రాణనష్టాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి సి.హెచ్. మార్టిన్ లూథర్ కింగ్, అగ్ని మాపక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సమస్య పరిష్కారం తొలి ప్రాధాన్యత

**- ప్రజాదర్బార్‌లో టిడిపి ఇన్‌ఛార్జి శ్రీనివాస్**

**తిరుపతి, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తిరుపతి టిడిపి ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్ కసరత్తు చేపట్టారు. ఇందుకోసం శనివారం తొలిసారిగా తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో ప్రజాదర్బార్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) నిర్వహించారు. తిరుపతి నగరవాసుల నుండి డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, వీధి లైట్లు, సిసి రోడ్లు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై అర్జీదారులతో నేరుగా మాట్లాడి వినతులు స్వీకరించారు. 57మంది ఫిర్యాదులు అందించడం విశేషం. సిఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆదేశాలతో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఇది దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి కుమారమ్మ, తాతయ్యగుంట ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జులు దంపూరి భాస్కర్ యాదవ్, శ్రీధర్ వర్మ, మునిశేఖర్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన్ రాజీనామాను స్వాగతిస్తున్నాం: ఆర్‌వైఎస్ఎఫ్

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం పట్ల రైట్స్ ఫర్ యూత్ అండ్ స్టూడెంట్స్ ఫోరమ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, యువజన సంఘాలు దేశవ్యాప్తంగా సాగించిన ఉద్యమాలు, నిరసనలు, ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాల ఫలితంగానే ఈ పరిణామం చోటుచేసుకుందని ఆయన పేర్కొన్నారు. ఇది విద్యార్థి ఉద్యమాల విజయమే కాకుండా ప్రజాస్వామ్య విలువల విజయంగా భావిస్తున్నామని అన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో ఏర్పడిన వివాదాలు, అవకతవకలు, విద్యార్థుల ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ను రద్దు చేసి, ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమాల్లో పాల్గొన్న విద్యార్థులు, యువజనులపై నమోదు చేసిన అన్ని కేసులను ఎలాంటి షరతులు లేకుండా వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. అలాగే పరీక్షల నిర్వహణలో జరిగిన పరిణామాల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు కోటి చొప్పున పరిహారం చెల్లించి, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.



## గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నేతల శాంతియుత సత్యాగ్రహం

**తిరుపతి, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం దుర్మార్గమని ,దీన్ని నిరసిస్తూ విద్యార్థులు ఆందోళన చేస్తే వారిపై దారుణంగా పోలీసులతో లాఠీచార్జి చేయించడం అమానవీయమని కాంగ్రెస్ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నీట్, సిబీఎస్ఈ పరీక్షల్లో అవకతవకలు ప్రశ్నాపత్రాల లీకులు, విద్యార్థులపై పోలీసుల దాడులను నిరసిస్తూ శనివారం తిరుపతిలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు ఆధ్వర్యంలో కొవ్వొత్తులు చేతపట్టుకుని శాంతియుత సత్యాగ్రహం నిర్వహించారు. మాంగాటి గోపాల్ రెడ్డి, కంభంపాటి మురళీకృష్ణ, శివశంకర్, జ్యోతీశ్వర్ నాయక్, సుప్రజ, మునీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం



## భక్తులతో తిరుమలకొండ కిటకిట

- వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు

**తిరుమల, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్షమంది భక్తులు తిరుమలకు చేరుకోవడంతో కొండ కిటకిట లాడుతోంది. వారాంతం శనివారం ఉదయానికి వైకుంఠమ్2లో అన్ని కంపార్టుమెంట్లు నిండాయి. సాయంత్రానికి ఈ రద్దీ మరింతగా పెరిగింది. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 24గంటలు సమయం పడుతోంది. క్యూలైన్లు శిలాతోరణం వరకు విస్తరించాయి. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్దంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. వారాంతం సెలవులు ఆపై తమతమ మొక్కుబడులు తీర్చుకునేందుకు సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకుంటుండటంతో తిరుమల కిటకిట లాడుతోంది. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు 47వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. మరో 25వేల మంది భక్తులు అర్ధరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. శుక్రవారం రాత్రి వరకు 78,721 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం 4.98 కోట్లుగా నమోదైంది.

## టిటిడి ఉద్యోగి సస్పెన్షన్

**తిరుమల, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ధార్మిక సంస్థలో అవినీతికి పాల్పడిన ఓ ఉద్యోగిపై వేటు పడింది. హర్యానాలోని కురుక్షేత్ర వేంకటేశ్వర స్వామి ఆలయంలో అసిస్టెంట్ షరాఫ్‌గా పనిచేస్తున్న పి.గిరిని శనివారం టిటిడి సస్పెండ్ చేసింది. టిటిడి పేరుతో అన్నదానం, కల్యాణోత్స వం, వాహనసేవల పేరుతో భక్తుల నుంచి డబ్బులు వసూలుచేసినట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు.

**మరో అవినీతి ఉద్యోగి...**

దేవుని చెంత నిజాయతీగా విధులు నిర్వహించాల్సిన టిటిడి ఉద్యోగులు కొందరు అవినీతికి పాల్పడుతుండటంతో టిటిడి అధికారులు కొరఢా ఝుళిపించారు. తిరుమలలోని జిఎన్‌సి ప్రాంతంలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్.శరత్ బాబును శనివారం టిటిడి సస్పెండ్ చేసింది. భక్తుల నుండి డబ్బులు డిమాండ్ చేసినట్లు సామాజిక మాధ్యమంలో వీడియో వైరల్ కావడంతో ఆధారంగా విచారణ చేపట్టారు. ప్రాథమికంగా ఉద్యోగి ప్రవర్తన నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించిన టిటిడి క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఆయనను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆగస్టు 6న మిక్సిడ్ రైస్ ఇ వేలం

**తిరుమల, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు టిటిడి అనుబంధ ఆలయాల్లో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన బియ్యాన్ని ఆగస్టు 6న ఇ-వేలం ద్వారా విక్రయించనున్నట్లు టిటిడి తెలిపింది. ఈ వేలంలో మొత్తం 20 లాట్లలో సుమారు 7,938 కిలోల మిక్సిడ్ రైస్ అందుబాటులో ఉంచనున్నారు. ఆసక్తి గల వారు ఆగస్టు 5వ తేదీ సాయంత్రం లోపు కొనుగోలు పోర్టల్ ద్వారా రూ.50వేలు ఇఎండి ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ కార్యాలయం 08772 26442నంబర్‌కు సంప్రదించవచ్చు.



## గోవిందరాజస్వామికి కవచ ప్రతిష్ఠ

**తిరుమల, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక జ్యేష్ఠాభిషేక మహోత్సవాల్లో శనివారం కవచ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. వేదఘోషలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శతకలశ స్నపనం, మహాశాంతి హోమం వైదిక పద్ధతిలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, పసుపు, చందనంతో అభిషేకాలు జరిపి విశేషారాధనలు సమర్పించారు. ప్రత్యేక పూజల అనంతరం కవచ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనం ప్రసాదించారు. స్వామివారి దర్శనార్థం తరలివచ్చిన భక్తులు 'గోవింద' నామస్మరణతో ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ ఏ.బి. నారాయణ చౌదరి, సూపరింటెండెంట్లు శేషగిరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయులు, ఆలయ అర్చకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బృహన్నల వేషంలో అర్జునుని దివ్యదర్శనం

**శ్రీకాళహస్తి, జులై 13 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉత్తర గోగ్రహణం కార్యక్రమాలు జరిగాయి. శుక్రవారం రాత్రి ఆలయంలో అర్జున తపస్సు తరువాత అర్ధరాత్రి దాటిన తరువాత అలుగు కుంభాగ్రాన నిలుపు పవిత్ర కార్యక్రమాల్ని భక్తి శ్రద్దలతో నిర్వహించారు. కుండపై కత్తిని నిలబెట్టడం అనేది అరుదైన కార్యక్రమాలు. రాత్రి పట్టణంలో ఊరేగింపు జరిపిన తరువాత స్థానిక పూజారులు పురుషోత్తం వారి సహచరులు మహిమాన్వితమైన ఈ కార్యక్రమాల్ని చేపట్టారు. అలుగు కుంభాగ్రాన నిలబెట్టు ఉత్సవాన్ని జరిపారు. శనివారం ఉదయం ఉత్తర గోగ్రహణం




సందర్భంగా అర్జునుడు బృహన్నల వేషంలో పట్టణంలో ఊరేగించారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ఆలయ ఎఇఓ హేమామాలిని, చిన్న ఆలయాల ఇన్‌ఛార్జి లక్ష్మయ్య పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవంతో పాటు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం ఉత్సవాల ఇన్‌ఛార్జి దుర్గా ప్రసాద్, దఫేదార్ పర్యవేక్షణలో ఉత్సవం జయరామారావు వీధి, బజారు వీధి, తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధుల మీదుగా సాగింది.

## దాససాహిత్య గాయకులకు ఆగస్టు 1 నుండి దరఖాస్తులు

**తిరుమల, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతిరోజూ నిర్వహించే శ్రీవారి సహస్ర దీపాలంకార సేవ, అలాగే తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో నిర్వహించే దాససాహిత్య సంకీర్తనలను ఆలపించేందుకు ప్రతిభావంతులైన, అర్హులైన సంగీత కళాకారుల నుంచి టిటిడి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ఆడిషన్లు 2026 నవంబరు 27 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు ఆరు రోజులపాటు తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో నిర్వహించబడనున్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 1 నుండి 20వ తేదీ వరకు మాత్రమే ఆన్‌లైన్‌లో 'హెచ్‌టిటిపిఎస్://ఎపిపిఎస్.తిరుమల.ఒఆర్‌జి/డిఎస్‌పి' తమ దరఖాస్తులను సమర్పించాలి. అభ్యర్థుల అర్హతలు, ఆడిషన్ విధానం, సమర్పించాల్సిన ధ్రువపత్రాలు, మార్గదర్శకాలు, ఇతర నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలు టిటిడి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.

# 28న సింహాచలం గిరి ప్రదక్షిణ



**విశాఖపట్నం, జులై 25 ప్రభాతవార్త:** ఈ నెల 28, 29వ తేదీల్లో జరగనున్న సింహాచలం గిరి ప్రదక్షిణను ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై ఆమె సమీక్షించారు. 32 కిలోమీటర్ల మేర జరిగే గిరి ప్రదక్షిణ మార్గంలో భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన ప్రతి చోటా సీసీకెమెరాలు ఏర్పాటు చేసి, అవి పనిచేస్తున్నాయో లేదో పరిశీలించాలని, నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం కొండపై దర్శనాలకు వచ్చే భక్తుల సంఖ్యను అంచనా వేసి తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. భక్తులకు అనువైన ప్రాంతాల్లో నమూనా ఆలయాలను ఏర్పాటు చేసి అక్కడ భద్రతా చర్యలు చేపట్టాలని, పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. తొలి పావంచాతో పాటు నమూనా ఆలయాల వద్ద కూడా కొబ్బరికాయలు కొట్టి భక్తులు గిరి ప్రదక్షిణ ప్రారంభించుకునేలా చర్యలు తీసుకోవచ్చన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సేవలు, భద్రత, ట్రాఫిక్ తదితర అంశాల్లో తగిన చర్యలు తీసుకోవాలని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, ఎమ్మెల్యేలు గణబాబు, పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, తదితరులు పాల్గొన్నారు.


# మదనపల్లిలో అర్ధరాత్రి దొంగల హల్‌చల్

- మారణాయుధాలతో బెదిరించి ఎటిఎం మిషన్ ఎత్తుకెళ్లారు
- ఎటిఎంలో రూ. 13.5 లక్షలు ఉన్నట్లు ప్రాథమిక నిర్ధారణ
- డ్రోన్లతో పోలీసుల ముమ్మర గాలింపు
- నిమ్మనపల్లి వద్ద ధ్వంసమైన మిషన్ గుర్తింపు

**మదనపల్లె (క్రైమ్), జులై 25 ప్రభాతవార్త:** మదనపల్లి పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి దుండగులు దుశ్చర్యకు పాల్పడ్డారు. జాతీయ రహదారి పక్కన ఉన్న ఎస్బీఐ ఏటీఎంను దొంగలు బొలెరో వాహనంలో ఎత్తుకెళ్లిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఎస్బీఐ ఏటీఎంలో సుమారు రూ. 13.5 లక్షల నగదు ఉన్నట్లు బ్యాంక్ అధికారులు ప్రాథమికంగా ధ్రువీకరించారు. ఎస్పీ ధీరజ్ ఆదేశాలతో పోలీసులు చేపట్టిన ముమ్మర గాలింపు చర్యల్లో ధ్వంసమైన ఏటీఎం మిషన్ లభ్యమైంది. స్థానిక శివాజీ నగర్ వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న ఎస్బీఐ ఏటీఎం కేంద్రంలోకి శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు బొలెరో వాహనంతో దూసుకెళ్లారు. ఏటీఎం మిషన్‌ను వాహనంలోకి ఎక్కిస్తుండగా అలికిడి గమనించిన స్థానికఇరుగు పొరుగువారు కొందరు పెద్ద పెద్ద శబ్దాలను గుర్తించి బయటికి రావడానికి ప్రయత్నించగా అప్రమత్తమైన దుండగులు కత్తులు, తుపాకి చూపించి స్థానికులను బెదిరించి, ఏటీఎం మిషన్‌ను వాహనంలో ఎక్కించుకుని వేగంగా పరారయ్యారు. దీంతో వారు 112 కు కాల్ చేయగా సమాచారం అందుకున్న గస్తీ పోలీసులు వెంటనే ఎస్పీ ధీరజ్ కు సమాచారం అందించారు. స్పందించిన ఎస్పీ జిల్లా అంతటా పోలీసులను అప్రమత్తం చేసి, పకడ్బందీగా నాకాబంధీ నిర్వహించారు. ఏటీఎంను తరలిస్తున్న బొలెరో వాహనం వాల్మీకిపురం మండలం కురవతి గ్రామం మీదుగా వెళ్లినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా









పోలీసులు గుర్తించారు. ఈ కోణంలో దర్యాప్తును వేగవంతం చేసి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.

**క్లూస్ టీం విస్తృత తనిఖీలు:** సీటీఎం రోడ్డు, ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపంలోని శివాజీ నగర్ వద్ద దుండగులు ఎస్బీఐ ఏటీఎంను అపహరించిన ప్రదేశాన్ని శనివారం జిల్లా క్లూస్ టీం నిపుణులు సందర్శించి కీలక ఆధారాలు సేకరించారు. క్లూస్ టీమ్ సిబ్బంది.. ఘటన స్థలంలో నిందితుల వేలిముద్రలు, పాదముద్రలతో పాటు టెక్నికల్ ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే ఏటీఎం పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరా ఫుటేజీలను సేకరించి విశ్లేషిస్తున్నారు.

**8 ప్రత్యేక బృందాలతో గాలింపు:** పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఎస్బీఐ ఏటీఎం చోరీ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. పరారీలో ఉన్న దొంగల ముఠాను పట్టుకోవడానికి 8 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి తెలిపారు.
సీసీటీవీ ఫుటేజ్, సెల్‌ఫోన్ వీడియోల ఆధారంగా నిందితుల కదలికలను నిరంతరం ట్రాక్ చేస్తున్నామని, నిమ్మనపల్లె పరిసర ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో ముమ్మర గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని ఆయన చెప్పారు. త్వరలోనే దుండగులను అదుపులోకి తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ఒరుగులు

## బెండ



**కావలసినవి:** బెండకాయలు-కిలో, ఉప్పు-రుచికి తగినంత, చిక్కటి మజ్జిగ-3 కప్పులు, పసుపు-స్పూన్, కారం- ఒకటిన్నర స్పూన్లు.

**తయారీ :** పుచ్చులేని బెండకాయలను ఎంచుకోవాలి. వాటిని బాగా కడిగి.. తొడిమెలు తీసేయాలి. కూరలోకి కోసుకున్నట్టు కాకుండా కాస్త పెద్ద ముక్కలుగా కట్ చేసుకోవాలి. వెడల్పాటి పాత్రలో మజ్జిగ పోసి.. కారం, ఉప్పు, పసుపు వేసి.. బాగా కలపాలి. కప్పుడు బెండకాయ ముక్కలు జోడించాలి. ఈ మిశ్రమాన్ని రెండు మూడు ప్లేటుల్లోకి తీసి.. ఎండబెట్టాలి. సాయంత్రం ఇంట్లోకి తెచ్చి మర్నాడు మళ్లీ ఎండలో ఉంచాలి. అలా ముక్కలు పెళుసుగా అయ్యేవరకూ ఎండబెడుతుండాలి. బాగా ఎండిపోయాక గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకుంటే.. కూర చేసుకోవచ్చు. సాంబార్‌లో వేసుకోవచ్చు. వీటిలో ఉప్పు ఉంటుంది. కాబట్టి మళ్లీ వేయనవసరం లేదు.

## కాకర :

**కాకరకాయలు**-కిలో, కారం-నాలుగు స్పూన్లు, ఉప్పు-రుచికి తగినంత, పసుపు, మెంతి పొడి-స్పూన్ చొప్పున, డ్రై జింజర్ పౌడర్-ముప్పావు స్పూన్, ఆవపొడి- టేబుల్ స్పూన్, ఆమ్‌చూర్ పౌడర్- అర స్పూన్



**తయారీ :** కడిగిన కాకరకాయలను తడిలేకుండా తుడిచి సన్నటి చక్రాల్లా కోయాలి. ఈ ముక్కల్లో ఉప్పు, పసుపు జోడించి.. రెండు గంటలు పక్కనుంచాలి. అందులో ఊరిన నీరు తీసేసి.. డ్రై జింజర్, ఆమ్‌చూర్ పౌడర్లు, కారం, మెంతి, ఆవపొడులు వేసి కలపాలి. వాటిని వస్త్రం మీద పరిచి ఎండబెట్టాలి. ముక్కలు పెళుసుగా కావడానికి మూడు నాలుగు రోజులు పడుతుంది. నాలుగైదు నెలలు నిల్వ ఉండే ఈ ఒరుగులతో కూర, వేపుడు ఏదైనా చేసుకోవచ్చు.

## అరటి ..



**కావలసినవి :** పచ్చి అరటికాయలు-కిలో, పసుపు-ఒకటిన్నర స్పూన్లు, ఉప్పు-రుచికి తగినంత, కారం-రెండు స్పూన్లు, ఆవపొడి-ముప్పావు స్పూన్

**తయారీ :** అరటికాయల చెక్కు తీసి గుండ్రంగా ముక్కలు కోయాలి. సగం పసుపును నీళ్లలో కలిపి.. ముక్కలను అందులో వేసి ఐదు నిమిషాలుంచాలి. తర్వాత ఆ నీళ్లు వంపేసి.. మిగిలిన పసుపు, ఆవ పొడి, కారం, ఉప్పు జోడించి బాగా కలపాలి. ఈ ముక్కలను వస్త్రంమీద పరిచినట్లు వేసి మూడు రోజులు ఎండబెట్టాలి. బాగా ఎండి.. తుంచితే సాగకుండా మిరిగిపోయేట్లు అయ్యాక.. గాలిచొరబడని సీసాలో భద్రం చేసుకోవలి. వీటితో కూర, పులుసు చేసుకోవడమే కాదు..వడియాల్లా వేయించి తినొచ్చు కూడా..

## బీట్ రూట్ ...

**కావలసినవి:** బీట్‌రూట్-అరకిలో, నిమ్మకాయలు-రెండు, పసుపు-పావు స్పూన్, మిరియాల పొడి-అర స్పూన్, ఉప్పు-రుచికి తగినంత, నిమ్మరసం-మూడుస్పూన్లు



**తయారీ :** బీట్‌రూట్ దుంపల చెక్కు తీసి.. స్లైసులుగా చేసుకోవలి. ఒక పాత్రలో నిమ్మరసం, పసుపు మిరియాల పొడి, ఉప్పు వేసి బాగా కలపాలి. అందులో బీట్‌రూట్ ముక్కలు జోడించి.. ఎగరేసినట్లు చేయాలి. నిమ్మరసం ముక్కలకు పట్టే వరకూ అలా చేయాలి. వాటిని రెండు ప్లేటుల్లో పరిచినట్లు పేర్చి ఎండబెట్టాలి. పచ్చితనం అంతాపోయి తుంచితే విరిగేట్లు అయ్యాక గాజు లేదా ప్లాస్టిక్ కంటెయినర్‌లోకి తీసుకోవాలి. కారం, ఉప్పు, పులుపు ఉన్న పదార్థాలు వేటినీ కూడా స్టీలు పాత్రల్లో నిల్వవుంచకూడదు.

## టొమాటో.

**కావలసినవి :** టొమాటోలు-కిలో, ఉప్పు-రుచికి తగినంత, పసుపు-ముప్పావు స్పూన్, కారం-రెండు స్పూన్లు, డ్రై జింజర్ పౌడర్-ముప్పావు స్పూన్



**తయారీ :** కడిగిన టమాటోలను తడి లేకుండా తుడవాలి. ఒక్కోదాన్ని నిలువుగా ఎనిమిది లేదా పది ముక్కలుగా కోసుకోవాలి. అందులో కారం, ఉప్పు, పసుపు వేసి కలపాలి. ఆ ముక్కలను వస్త్రం మీద పరిచి.. ఎండబెట్టాలి. బాగా ఎండిన తర్వాత సీసాలోకి తీసి భద్రం చేసుకుంటే ఎక్కువ రోజులు నిల్వ వుంటాయి. □

### చిట్కా

**ముద్గధాలి గధవ్యాలి:** అన్ని రకాల పప్పు ధాన్యాలలో, పచ్చ పెసలు ఉత్తమమైనవి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇతర పప్పు ధాన్యాలు అన్నీ, ఒకటి లేదా మరొకటి దుష్ప్రభావాలను కలిగి ఉంటాయి.

**బాగ్నస్తి సంధనకరో రాసోనాహ:** వెల్లుల్లి విరిగిన ఎముకలతో కలుస్తుంది. వెల్లుల్లి తరచుగా తినేవారిలో ఎముకలు, వాటి జాయింట్లు గట్టిగా ఉంటాయి. ✦ అతి సర్వత్రా వర్జయేత్:అధికంగా తినేది ఏదైనా, అది మంచి రుచిని కలిగి ఉన్నా, ఆరోగ్యానికి మంచిది కాదు. మితంగా (తక్కువ) తినండి.

**నాస్తిమూలం అనౌషాధం:** శరీరానికి ఎటువంటి ఔషధ ప్రయోజనం లేని కూరగాయలు అంటూ లేవు.

**నా వైద్యా ప్రభుయుయుషా:** ఏ డాక్టర్ కూడా మన దీర్ఘాయువుకు ప్రభువు కాదు. వైద్యులకు కొన్ని పరిమితులు ఉన్నాయి. □

# రుతు చక్రం గుండె లయ తప్పేనా ?



**మహిళల శరీరం సహజ హార్మోన్ల మార్పులకు ఎలా స్పందిస్తుందనే అంశంపై ఎన్నో పరిశవోదనలు జరుగుతున్న విషయం విదితమే మహిళలు, క్రీడాకారిణులు, వైద్య నిపుణులు గుండె ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షల ఫలితాలను అర్థం చేసుకునేటప్పుడు రుతుచక్ర దశలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని పరిశోధకులు సూచిస్తున్నారు.**

మహిళల రుతుచక్రం కేవలం పునరుత్పత్తికే పరిమితం కాదు. కొన్ని సందర్భాల్లో గుండె పనితీరుపైనా ప్రభావం చూపుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. నెలసరి సమయంలో శరీరంలో జరిగే హార్మోన్ల మార్పులు గుండె స్పందన నియంత్రణ వ్యవస్థలో మార్పులకు కారణమవుతాయని పరిశోధకులు గుర్తించారు. అయితే ఈ మార్పులు కండరాల బలం, మానసిక స్థితి లేదా పనులు చేయాలనే ఉత్సాహంపై గణనీయ మైన ప్రభావం చూపవంటోంది. గుండె ఒకే రీతిలో కొట్టుకుం టున్నట్లు కనిపించిన ప్పటికీ, ప్రతి స్పందన మధ్య విరామం స్వల్పంగా మారుతూ ఉంటుంది. హార్ట్ రేట్ వెరీయబిలిటీ (హెచ్‌ఆర్‌వి) అంటే గుండె కొట్టుకునే ప్రతి రెండు స్పందనల మధ్య ఉండే సమయ వ్యవధిలో కనిపించే చిన్నచిన్న తేడాలను సూచిస్తుంది. సాధారణంగా హెచ్‌ఆర్‌వి ఎక్కువగా ఉంటే శరీరం ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటోందని భావిస్తారు. ఈ అధ్యయనంలో సహజంగా రుతుచక్రం ఉన్న ఆరోగ్యవంతమైన మహిళలను ఎంపిక చేసి, వారి రుతుచక్రంలోని వివిధ దశల్లో గుండె పనితీరు, కండరాల బలం, మానసిక స్థితి, పనులు చేయాలనే ఉత్సాహాన్ని పరిశీలించారు. ప్రారంభ ఫాలిక్యులర్ దశ, అండోత్సర్గం దశ, ల్యూటియల్ దశలలో హెచ్‌ఆర్‌వితో పాటు ఇతర శారీరక మార్పులను పోల్చి హార్మోన్ల ప్రభావాన్ని విశ్లేషించారు రుతు సమయంలో వస్తున్న మార్పులు గమనిస్తే.. రుతుచక్రంలోని ప్రతి దశలో హెచ్‌ఆర్‌విలో స్పష్టమైన మార్పులు కనిపించాయి. హార్మోన్ల స్థాయిలు మారేకొద్దీ గుండెను నియంత్రించే స్వయంచాలక నాడీ వ్యవస్థ పనితీరులో కూడా మార్పులు నమోద య్యాయి. ముఖ్యంగా ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరోన్ హార్మోన్ల హెచ్చుతగ్గులు గుండె స్పందన నియంత్రణపై ప్రభావం చూపుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. మహిళల మానసిక స్థితి, పనులు చేయాలనే ఉత్సాహం కూడా రుతుచక్రంలోని వివిధ దశల్లో పెద్దగా మారలేదని అధ్యయనం తెలిపింది. అంటే హార్మోన్ల మార్పులు గుండె నియంత్రణ వ్యవస్థపై ప్రభావం చూపినా, శారీరక పనితీరు మాత్రం చాలా వరకు స్థిరంగానే ఉంటుందని పరిశోధకులు పేర్కొన్నారు. ఈస్ట్రోజెన్ రక్తనాళాల ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడటంతో పాటు గుండె స్పందనను ప్రశాంతంగా ఉంచే వ్యవస్థకు మద్దతు ఇస్తుంది. మరోవైపు ప్రొజెస్టెరోన్ కొన్ని దశల్లో గుండె స్పందనను వేగవంతం చేసే నాడీ వ్యవస్థను ఎక్కువగా చురుకుగా మారుస్తుంది. అందువల్ల ఈ రెండు హార్మోన్ల స్థాయిల్లో నెలనెలా జరిగే మార్పులు హెచ్‌ఆర్‌వి లో తేడాలకు కారణమవు తాయి. ఈ ఫలితాల ప్రకారం స్మార్ట్‌వాచ్‌లు లేదా ఫిట్‌నెస్ ట్రాకర్ల ద్వారా హెచ్‌ఆర్‌విని గమనించే మహిళల్లో నెలసరి సమయంలో సహజంగానే కొన్ని మార్పులు గమనిస్తుం టారు. అలాంటి మార్పులు కనిపించిన ప్రతిసారి ఆందోళన చెందాల్సిన అవసరం ఇది పరిశోధకులు చెప్పే మాట. □

# సుతి మెత్తగా..!

**ఉద్యోగం, సంపాదన, నూతన లక్ష్యలు... కారణా లేమైతేనేం అమ్మాయిలది ఉరుకుల పరుగుల జీవితమే ఒత్తిడి పెరిగిపోయి హార్మోనుల అసమతుల్యత, హృద్రోగాలూ వస్తున్నాయి.**



అయితే, వీటితోపాటే ఆరోగ్యంకోసం వెల్నెస్ ట్రెండ్‌లూ వస్తున్నాయి. వాటిలో టే అటానమస్ సెన్సరీ మెరీడియన్ రెస్పాన్స్ ట్రెండ్. దీన్నే సింపుల్గా ఏఎస్ఎమ్ఎర్ అని అంటారు. అందులో ఏం చేస్తారో తెలుసా? చిన్నతనంలోనే కాదు ఇప్పటికీ చాలామందికి బబుల్ ర్యాప్ చూస్తే దాన్ని టపీమని ఒత్తేయాలనిపిస్తుంది. మెత్తగా, నున్నగా ఉన్న ఇసుకలో బొమ్మలు వేయాలని పిస్తుంది. ఈ అనుభూతులన్నింటికీ కారణం జ్ఞానేంద్రియాలే అందుకే మానసిక ప్రశాంతత పొందడానికి అప్పుడప్పుడూ జ్ఞానేంద్రియాలను ఉత్తేజ పరుస్తుంది. అందులో భాగంగా వచ్చిందే ఈ ఎస్ఎన్ఆర్ ట్రెండ్ కూడా. దీన్లో భాగంగా మైక్రోఫోన్‌లో మంత్రంగా మాట్లాడడం, చిన్న శబ్దాలు చేయడం, నెమ్మదిగా చేతివేళ్లను కదిలించే లాంటి వీడియోలు చూడడం లేదా వినడం చేస్తారు. ఇక రంగు రుఁగుల సబ్బుల్ని చాకుతో తురమడం, మెత్తగా జెల్లీలా ఉన్న పదార్థాలను తాకుతుండే వీడియోలు చూడడమూ దీన్లో భాగమే. అంతెందుకు మన తలకు ఎవరైనా మసాజ్ చేసినా, చెవిలో ఇయర్ మనకు మనమే సుతిమెత్తగా తిప్పినా అలాంటి అనుభూతినే పొందుతాం. ఆ సంతృప్తే... అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేస్తుందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ చేసిన పరిశోధ నలు చెబుతున్నాయి. హాయినిచ్చే ఇలాంటి వీడియోలను చూసిన ప్పుడు మెదడులో రివార్డు, ఎమోషనల్ భాగాలు యాక్టివేట్ అవుతా యట. న్యూరో హార్మోనులైన ఆక్సిటో, డోపమైన్, ఎండార్ఫిన్లు విడుదలై మూడ్ని మెరుగుపరుస్తాయిట. అనేక దీర్ఘకాల నొప్పులనూ తగ్గిస్తాయట. ఏకాగ్రతను పెంచడంతో పాటు, రిలాక్స్ అయ్యేలా చేసి మంచి నిద్ర పట్టేలానూ చేస్తాయట. ఆందోళన, ఒత్తిడి, బీపీ వంటి సమస్యలు తగ్గిపోతాయి. ఎప్పుడైనా నిద్రపట్టనప్పుడూ, ఆందోళనగా అనిపించినప్పుడూ... అందుకే కుర్చీలోనో, బెడ్మీదో కూర్చోని ఇలాంటి వీడియోలు చూస్తే మనసు కుదుటపడుతుంది. □

# తెర

## 'శ్రీనివాస మంగాపురం' బాబాయ్‌కి నచ్చింది. : జై కృష్ణ



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జై కృష్ణ ఘట్టమనేని అజయ్ భుపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు.

**మీకు యాక్టర్ కావాలనే ఆలోచన ఎప్పుడు మొదలైంది?**

నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టం. నా 16వ ఏటా యాక్టర్ కావాలని నిర్ణయించుకున్నాను. డిసైడ్ అయిన తర్వాత ప్రాపర్‌గా ట్రైనింగ్ స్టార్ట్ చేశాను. రెండేళ్లు ముంబై వెళ్లాను. తర్వాత పాండిచ్చేరి వెళ్లాను. అక్కడ కొంతకాలం శిక్షణ తీసుకున్న తర్వాత న్యూయార్క్ వెళ్లాను. అక్కడ కూడా రెండు సంవత్సరాలు శిక్షణ తీసుకున్నాను. తిరిగి వచ్చిన తర్వాత కథలు వినడం మొదలు పెట్టాను..

**శ్రీనివాస మంగాపురం జర్నీ ఎలా స్టార్ట్ అయింది?**

జెమినీ కిరణ్ ద్వారా ఈ జర్నీ స్టార్ట్ అయింది. ఆయనే అజయ్‌ని పరిచయం చేశారు. అలా ఈ సినిమా మొదలైంది. ఇంతకుముందు కూడా నేను కొన్ని కథలు విన్నాను. కాకపోతే అజయ్ చెప్పిన కథ చాలా అద్భుతంగా అనిపించింది.

**మీ ఫ్యామిలీ సపోర్ట్ ఎలా ఉంది? మహేష్ ఈ సినిమా చూశారా ?**

నాకు ఫ్యామిలీ సపోర్ట్ ఉంది. ప్రతి అడుగులో బంగారు తాతయ్య ప్రోత్సాహం ఉంది.

మహేష్ బాబాయ్ ప్రతి విషయంలో గైడెన్స్ ఇస్తారు. ఆయన ఆయన సినిమా కూడా చూశారు. చాలా హ్యాపీగా ఫీలయ్యారు. ఆయనకు చాలా నచ్చింది.

**వైజయంతి మూవీస్‌లో మీ తొలి సినిమా చేయడం ఎలా అనిపిస్తోంది?**

అశ్వినీ దత్‌తో నాకు మంచి అనుబంధం ఉంది. వైజయంతి మూవీస్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలో లాంచ్ కావడం చాలా ఆనందంగా ఉంది. బాబాయ్ తొలి సినిమా కూడావైజయంతి మూవీస్‌లోనే వచ్చింది.

**మీ ఫ్యామిలీ నుంచి ఒక హీరో వస్తు న్నారంటే చాలా అంచనాలు ఉంటాయి కదా... మీ మీద ఆ ఒత్తిడి ఉందా?**

నేను ఈ సినిమా చేస్తున్నానని తెలియక ముందే ఘట్టమనేని అభిమానులు నాకు ఎంతో సపోర్ట్ చేశారు. .

**రాషా తడానీ గురించి?**

రాషా ఈ సినిమా చేయడం ఈ సినిమాకి ఒక మంచి అసెట్. తనతో వర్క్ చేయడం చాలా మంచి ఎక్స్‌పీరియన్స్.

**ఇందులో మీరు చేసిన శ్రీను పాత్ర ఎలా ఉండబోతుంది?**

శ్రీను వెరీ ఫన్ లవింగ్. తనలో అల్లరి ఉం టుంది. తనకేం కావాలో తనకి క్లియర్‌గా తెలుసు. తను మంగని ప్రేమిస్తాడు. ఆ తర్వాత కథ ఎలా సాగు తుందనేది చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది.

**షూటింగ్ ఎక్స్‌పీరియన్స్ గురించి?**

ఈ సినిమా కోసం 70 రోజుల పాటు అవుట్‌డోర్ షూటింగ్ చేశాం. ప్రతిదీ పబ్లిక్‌లోనే షూట్ చేశాం. ఈ ప్రయాణంలో చాలా విషయాలు నేర్చుకున్నాను.


**మోహన్‌బాబుతో వర్కింగ్ ఎక్స్ పీరియన్స్ గురించి?**

మోహన్ బాబు వెరీ స్వీట్. చాలా క్లోజ్‌గా ఉంటారు.

**నాన్నగారు మీకు చిన్నప్పుడు ఏమైనా చెప్పేవారా?**

ఆయన చాలా సినిమాలు చూసే వారు. మేమిద్దరం సినిమా గురించి చాలా మాట్లాడుకునేవాళ్లం.

## సైకలాజికల్ థ్రిల్లర్ 'లూసీ' షూటింగ్ పూర్తి



విభిన్న కాన్సెప్ట్‌తో రూపొందుతున్న 'లూసీ' చిత్రానికి సంబంధించిన షూటింగ్ విజయ వంతంగా పూర్తైంది. మైండ్‌బెండింగ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కు తున్న ఈ సినిమా ప్రేక్షకులను సస్పెన్స్, థ్రిల్, ఊహించని మలుపులతో అలరించనుందని చిత్ర బృందం తెలిపింది. సైన్మా స్టూడియోస్ బ్యానర్‌పై రాఘువేంద్ర పూజారి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అండాలమ్మ పిక్చర్స్ సమర్పిస్తోంది. ప్రస్తుతం ఎన్ఐటీ వరంగల్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న రాఘువేంద్ర పూజారి, టాలీవుడ్‌లో అత్యంత చిన్న వయసులో చదువును కొనసాగిస్తూనే సినీ నిర్మాణ రంగంలో నిర్మాత గా కూడా తన ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగించాలనే లక్ష్యంతో వరుస సినిమాలను నిర్మించేందుకు ఆయన సిద్ధమవు తున్నారు. మహదేవ్ చిరంజీవి కథ, దర్శకత్వం వహించగా, ఆశిష్ పసుల, కిరణ్ పట్టేటి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో చరణ్ రాజ్, శశాంక్ బాలు, ప్రశాంతి ఏడే, బల్వీర్ సింగ్, రంజిత్ నగెల్లి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సాంకేతిక విభాగంలో లీది సినిమాటోగ్రఫీతో పాటు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించగా, వియాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. నాగేష్ అడపా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తవడంతో ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగు తున్నాయి. త్వరలోనే టీజర్, ట్రైలర్, విడుదల తేదీకి సంబంధించిన అధికారిక ప్రకటనలు వెలువడనున్నాయి. సైకలాజికల్ థ్రిల్లర్‌లను ఇష్టపడే ప్రేక్షకులకు 'లూసీ' ఒక కొత్త అనుభూతిని అందించ నుందనే నమ్మకాన్ని చిత్ర బృందం వ్యక్తం చేస్తోంది.

## 'విశ్వనాథ్ సన్స్' 'ది వెడ్డింగ్ సాంగ్' విడుదల



'ది వెడ్డింగ్ సాంగ్'లో మెరిసిపోతున్న సూర్య, మమితా బైజుతమిళ అగ్ర కథానాయుడు సూర్య ప్రధాన పాత్రలో ప్రతిభగల దర్శకుడు వెంకీ అట్లూరి రూపొందిస్తోన్న చిత్రం 'విశ్వనాథ్ సన్స్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన తొలి గీతం 'నేనో బటర్‌ఫ్లై' విశేషంగా ఆకట్టుకుంది. ఆ ఉత్సాహంతో విశ్వనాథ్ సన్స్ చిత్ర బృందం, 'ది వెడ్డింగ్ సాంగ్' రూపంలో అభిమానులకు మరో కానుకను తీసుకొచ్చింది. ఈ రెండవ గీతం విడుదలైన తక్షణమే అందరినీ అలరిస్తూ, అసలుసిసలైన వేడుకల గీతంగా ప్రశంసలు అందుకుంటోంది. ఉత్సాహభరితమైన, పండుగ వాతావరణాన్ని తలపించే ఈ పాటలో.. సూర్య, మమితా బైజు తమ అద్భుతమైన నృత్యంతో తెరపై వెలుగులు నింపుతూ, ఒక ఘనమైన కుటుంబ వివాహంలోని ఆనందాన్ని, ఆత్మీయతను కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఈ పాటను సూర్య స్వయంగా ఆలపించడం మరింత ప్రత్యేకంగా, హృదయానికి హత్తుకునే సంగీత అనుభూతిగా మార్చింది. ఈ గీతానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చగా, రామజోగయ్య శాస్త్రీ సాహిత్యం అందించారు. ఈ అద్భుతమైన సంగీత సాహిత్య కలయిక, పాటకు సంబరాల అనుభూతిని జోడించింది. కేవలం ప్రకటనతోనే 'విశ్వనాథ్ సన్స్' సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. పోస్టర్లు, టీజర్ ఆకట్టుకోవడంతో పాటు.. 'నేనో బటర్‌ఫ్లై', 'ది వెడ్డింగ్ సాంగ్' వంటి వరుస చార్ట్‌బస్టర్లతో ఈ సినిమాపై అంచనాలు రోజురోజుకి పెరుగుతున్నాయి. ఈ కుటుంబ కథా చిత్రం స్వాతంత్ర్య దినోత్సవం కానుకగా ఒకరోజు ముందుగా ఆగస్టు 14, 2026 న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది.

## 'ది మేజ్' ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్



తమిళ, తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న హీరో శ్రీరామ్ (శ్రీకాంత్) నటిస్తున్న కొత్త సినిమా 'ది మేజ్'. ఈ మూవీలో ప్రియాంక, ప్రీతిక శ్రీనివాస్, కమల్ కామరాజు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని డాక్టర్ నైమిష రెడ్డి కసిరెడ్డి సమర్పణలో శ్రౌష కమల ఆర్ట్స్, యూఆర్ క్రియేషన్స్ బ్యానర్స్ పై డాక్టర్ ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి, డాక్టర్ కేఎస్ఆర్ (కరెడ్డి శ్రీధర్ రెడ్డి), డాక్టర్ భరత్ రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్ రెడ్డి సోమ నిర్మిస్తున్నారు. 'ది మేజ్' చిత్రాన్ని సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు డాక్టర్ రవికిరణ్ గడలాయ్ రూపొందిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ను ఈ రోజు మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో లీడ్ యాక్టర్స్ ఇంటెన్స్ లుక్స్‌లో కనిపిస్తుండగా, వారి బ్యాక్ డ్రాప్‌లో ఒక మహానగరాన్ని చూపించారు. లీడ్ యాక్టర్స్ అంతా బ్లాక్ కాస్ట్యూమ్స్‌లో ఉండటం ఆసక్తి కలిగి స్తోంది. న్యూ ఏజ్ కమర్షియల్ థ్రిల్లర్ మూవీని చూడబోతున్నామనే ఇంప్రెషన్ 'ది మేజ్' ఫస్ట్ లుక్ పోస్టర్ తో ఏర్పడుతోంది.

## "అమ్మా.. నాకు ఆ అబ్బాయి కావాలి' ఆగస్టు 7న విడుదల



జిఎస్ఆర్ మూవీ మేకర్స్ పతాకంపై పవన్ మహావీర్ ను హీరోగా పరిచయం చేస్తూ... ప్రముఖ మహిళా వ్యాపారవేత్త శైలజ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న విభిన్న ప్రేమకథా చిత్రం "అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి". పవన్ మహావీర్ లండన్ లో వైద్య విద్య అభ్యసిస్తూ హీరోగా నటించడం విశేషం. శివాల ప్రభాకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వర్షిక, సుహానా హీరోయిన్లు. సుమన్, రావు రమేష్, రాజీవ్ కనకాల, సత్యకృష్ణ, సుజాత తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్ విడుదల చేశారు!!హైదరాబాద్, ప్రసాద్ ల్యాబ్ లో అత్యంత ఘనంగా జరిగిన ఈ వేడుకకు ప్రముఖ దర్శకులు దర్శకుల సంఘం అధ్యక్షులు వి.ఎన్. ఆదిత్య ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ప్రముఖ దర్శకులు సి.రాంప్రసాద్, శివనాగు, ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ విశిష్ట అతిధులుగా పాల్గొన్నారు. "నిర్మాత జి. శైలజరెడ్డి మాట్లాడుతూ... "అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి" అద్భుతంగా వచ్చేందుకు సహకరించిన సాంకేతిక నిపుణులకు, నటీనటులకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. డాక్టర్ టర్నెడ్ హీరో మహావీర్ మాట్లాడుతూ.... "డాక్టర్‌గా వైద్యం... హీరోగా వినోదం అందించాలనే తన సంకల్పం కార్యరూపం దాల్చడానికి కారకురాలైన దేవతలాంటి మా అమ్మకు ఈ జన్మంతా రుణపడి ఉంటాను. ఈ చిత్రం ఇంత గొప్పగా రావడం కోసం మనసుపెట్టి పనిచేసిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు

## 'నేను రెడీ' మూవీ సాంగ్ లాంచ్



సాంగ్ లాంచ్ ఈవెంట్ లో బ్లాక్ బస్టర్ డైరెక్టర్ బాబీ కొల్లి 'నేను రెడీ' నా కెరీర్ ్లలో బెస్ట్ మూవీ అవుతుంది: హీరో హావిష్‌హావిష్, కావ్య థాపర్, నర్గీస్ ఫక్రీ 'నేను రెడీ' నుంచి అదిరిపోయే రొమాంటిక్ 'కొంచెం కొంచెం' సాంగ్ లాంచ్‌యంగ్ హీరో హవీష్ కథానాయకుడిగా, కమర్షియల్ హిట్ చిత్రాల దర్శకుడు త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫుల్ ఎంటర్‌టైనర్ 'నేను రెడీ' ఇప్పటికే టీజర్, ఇతర ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని పెంచింది. హార్నిక్స్ ఇండియా ఎల్ఎల్‌పి బ్యానర్‌పై కోనేరు సత్యనారాయణ, నిఖిల కోనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో కావ్యా థాపర్ కథానాయికగా నటిస్తున్నారు. మెలోడీ స్పెషలిస్ట్ మిక్కీ జే మేయర్ స్వరపరిచిన 'కొంచెం కొంచెం' రొమాంటిక్ మెలోడీగా ఆకట్టుకుంటోంది. పాటలోని రొమాంటిక్ మూడ్‌ను అందంగా ప్రజెంట్ చేసిన ట్యూన్‌తో పాటు, మ్యూజిక్ అరేంజ్‌మెంట్ ఈ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. సరస్వతీపుత్ర రామజోగయ్య శాస్త్రి రాసిన సాహిత్యం హీరో, హీరోయిన్ల మధ్య ప్రేమను సరదాగా ప్రజెంట్ చేస్తోంది. సమీరా భరద్వాజ్ తన మెలోడీ వోకల్స్‌తో పాటలోని భావాలను మరింత అందంగా పలికించారు. ఈ పాటలో హవీష్, కావ్యా థాపర్ మధ్య కనిపించే రొమాంటిక్ కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ స్పెషల్ అప్పియరెన్స్‌తో తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. ఆమె గ్లామర్‌తో పాటు స్టైలిష్ డ్యాన్స్ మూవ్స్ కూడా పాటకు మరింత స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాయి. ఆకట్టుకునే ట్యూన్, సరదా సాహిత్యం, మెలోడీ వోకల్స్, స్టైలిష్ విజువల్స్‌తో కొంచెం కొంచెం పూర్తి స్థాయి రొమాంటిక్ సాంగ్‌గా అలరిస్తోంది.

## టి20ల్లో జింబాబ్వేపై

## నంబర్ వన్ అభిషేక్

# భారత్ యంగ్ ప్లేయర్ల రికార్డ్


అభిషేక్ శర్మ


శుభమన్ గిల్


రుతురాజ్ గైక్వాడ్


కేఎల్ రాహుల్


యశస్వి జైస్వాల్

**న్యూఢిల్లీ:** టీమిండియా యంగ్ బ్రిగేడ్ అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో సంచలనాలు సృష్టిస్తోంది. జింబాబ్వేపై టీమిండియాకు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. ముఖ్యంగా జింబాబ్వేతో జరిగిన టి20 మ్యాచ్‌లలో భారత యంగ్ బ్యాటర్లు తమ బ్యాట్‌కు పనిచెప్పి భారీగా పరుగులు సాధించారు. ఆ వికెట్లపై ఆధిపత్యం చెలాయిస్తూ జట్టుకు అద్భుతమైన విజయాలను అందించారు. జింబాబ్వేపై టి20ల్లో భారత్ తరఫున అత్యధిక రన్స్ చేసిన టాప్ 5 బ్యాటర్లలో యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ అగ్ర స్థానంలో ఉన్నాడు. అభిషేక్ జింబాబ్వేపై ఇప్పటివరకు ఆరు మ్యాచ్‌లలో 35.80 సగటుతో ఏకంగా 179 పరుగులు సాధించాడు. మెరుపు ఇన్నింగ్స్‌లతో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపిస్తూ ఈ లిస్ట్‌లో నంబర్ వన్ పొజిషన్‌ను సొంతం చేసుకున్నాడు. టీమిండియా వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండో స్థానంలో నిలిచాడు. గిల్ జింబాబ్వేపై ఐదు టి20 మ్యాచ్‌లు ఆడి 170 పరుగులు చేశాడు. ఈ క్రమంలో రెండు హాఫ్ సెంచరీలు కూడా బాదాడు. మైదానంలో నిలకడగా ఆడుతూ జట్టుకు కొండంత అండగా నిలవడంలో శుభ్‌మన్ సక్సెస్ అయ్యాడు. భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ చాలా తక్కువ మ్యాచ్‌లలోనే అద్భుత రికార్డు నమోదు చేసి మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. జైస్వాల్ జింబాబ్వేపై కేవలం మూడు టి20 మ్యాచ్‌లు మాత్రమే ఆడి, ఏకంగా 141 పరుగులు రాబట్టాడు. క్రీజులోకి వచ్చిన ప్రతిసారీ వేగంగా పరుగులు సాధిస్తూ జట్టుకు మంచి ఆరంభాలు అందించాడు. క్లాస్ బ్యాటింగ్‌కు మారుపేరైన రుతురాజ్ గైక్వాడ్ ఈ లిస్ట్‌లో నాలుగో స్థానంలో ఉన్నాడు. రుతురాజ్ జింబాబ్వేపై మూడు ఇన్నింగ్స్‌లలో 66.50 సగటు, 158.33 స్ట్రైక్ రేట్‌తో మొత్తం 133 పరుగులు చేశాడు. ఇందులో ఒక హాఫ్ సెంచరీ కూడా ఉంది. బాధ్యతాయుతంగా ఆడుతూనే అవసరమైనప్పుడు బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. టీమిండియా స్టార్ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఐదో స్థానంలో నిలిచాడు. రాహుల్ జింబాబ్వేపై నాలుగు టీ20 మ్యాచ్‌లు ఆడి 120 పరుగులు సాధించాడు. రాహుల్ ఖాతాలో కూడా జింబాబ్వేపై ఒక హాఫ్ సెంచరీ ఉంది. కీలక సమయంలో ఇన్నింగ్స్‌ను నిలబెట్టి జట్టును విజయం దిశగా నడిపించడంలో రాహుల్ తన మార్కు చూపించాడు.





## జింబాబ్వేతో రెండో టి20.. విక్టరీతో

# టీమిండియా సిరీస్ కైవసం

**న్యూఢిల్లీ:** జింబాబ్వేతో జరిగిన రెండో టి20లోనూ టీమిండియా ఘన విజయం సాధించింది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే శనివారం ఈ సిరీస్‌ను భారత జట్టు దక్కించుకుంది. టీమిండియా అందించిన 220 పరుగుల లక్ష్య ఛేదనలో జింబాబ్వే టీం కేవలం 17.5 ఓవర్లలో 129 పరుగులకే పరిమితమైంది. భారత్ తరఫున యశ్ ఠాకూర్, ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్, శివమ్ దూబె, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ వికెట్లు తీశారు. బ్రియన్ బెన్నెట్ (32 పరుగులు)ను ఔట్ చేయడం ద్వారా యశ్ తన తొలి టి20 వికెట్‌ను సాధించాడు. ప్రిన్స్, బెన్ కర్రన్, సికందర్ రజాలను ఔట్ చేశాడు. తడివానషే మరుమణి, న్యూమాన్ న్యామ్హురి క్రీజులో ఉన్నారు. అంతకుముందు, హరారేలో టాస్ ఓడిపోయి బ్యాటింగ్ చేసిన భారత్, 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్లు రెచ్చిపోయారు. ఇషాన్ కిషన్ (44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 81), తిలక్ వర్మ (29 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 60 నాటౌట్) చెలరేగారు. దీంతో ఇండియా 20 ఓవర్లలో 5 వికెట్లకు 219 పరుగులు చేసింది. వైభవ్ సూర్యవంశీ అతి కష్టం మీద 9 బంతుల్లో 20 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఇషాన్, శ్రేయస్ అయ్యర్ (25) మూడవ వికెట్‌కు 66 పరుగులు జోడించగా, ఇషాన్, తిలక్ నాలుగవ వికెట్‌కు 94 పరుగులు జతచేశారు. జింబాబ్వే తరఫున, న్యూమాన్ న్యామ్హురి, రిచర్డ్ నగరవా, బ్రయాన్ బెన్నెట్, బ్లెస్సింగ్ ముజరబాని, సికందర్ రజా తలా ఒక వికెట్ తీసుకున్నారు. జింబాబ్వేపై బ్యాటింగ్ లో అదరగొట్టిన భారత్ ప్రపంచ రికార్డు సమం చేసింది. ఒకే క్యాలెండర్ ఇయర్ లో అత్యధిక సార్లు 200 కంటే ఎక్కువ పరుగులు చేసిన జట్టుగా నిలిచి తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

## పురుషుల బాక్సింగ్..

# ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు శివాచ్



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ ప్లేయర్ సచిన్ శివాచ్ దూసుకుపోతున్నాడు. స్కాటిష్ ఈవెంట్ క్యాంపస్‌లో శనివారం జరిగిన పురుషుల 60 కేజీల రౌండ్ ఆఫ్ 32 బాక్సింగ్ బౌట్‌లో, రెండవ రౌండ్ మధ్యలో, కెనడాకు చెందిన కియోమా అల్‌అహ్మదీప్‌పై భారత ఆటగాడు సచిన్ శివాచ్ తొలుత అలసిపోవడం ప్రారంభించినా తదుపరి పుంజుకున్నాడు. 26 యేళ్ల శివాచ్ తీవ్రంగా పోరాడి 4-1 తేడాతో స్ప్లిట్ డెసిషన్ విజయాన్ని నమోదు చేసి ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు, అక్కడ అతను ఇంగ్లాండ్‌కు చెందిన విలియం హెవిట్‌ను ఎదుర్కొంటాడు. మాజీ కామన్వెల్త్ యూత్ గేమ్స్ ఛాంపియన్ సచిన్, తన తొలి దాడి అయిన రైట్ హుక్‌నుగురితప్పాడు. కానీ ఆ కెనడియన్ దానిని వేగంగా తప్పించుకున్నాడు. దానికి ప్రతిస్పందనగా కెయోమా, సచిన్ ముఖంపై కుడి చేతితో ఒక పంచ్ విసిరాడు. అయితే, ఆ భారత ఆటగాడు పోటీలో కుదురుకుని, రెండు చేతులతో పదునైన ఎదురుదాడి చేసి తిరిగి పట్టు సాధించి, హోరాహోరీగా సాగిన తొలి రౌండ్‌లో 3-2 తేడాతో విజయం సాధించాడు. మొదటి రౌండ్‌లో ఓడిపోయిన తర్వాత కోలుకోవాలని చూస్తున్న కియోమా, రెండవ రౌండ్‌లో వేగాన్ని పెంచాడు. ఒత్తిడిలో కూడా సచిన్ నిలకడగా ఉంటూ, అనేక దాడులను తప్పించుకుని, ఎదురుదాడిలో కచ్చితమైన కాంబినేషన్ల వర్షం కురిపించాడు. అతని క్రమశిక్షణకు ఐదుగురు న్యాయనిర్ణేతల నుండి ఏకగ్రీవంగా 10-9 తీర్పు లభించి, అతను ఆ రౌండ్‌ను 5-0తో గెలుచుకున్నాడు. మూడవ రౌండ్ కూడా హోరాహోరీగా సాగింది.



## స్కాటిష్ ఓపెన్‌లో..

# పుంజుకున్న దీక్షా దాగర్

**న్యూఢిల్లీ:** భారత క్రీడాకారిణి దీక్షా దాగర్, స్కాటిష్ ఓపెన్‌లో కష్టమైన ఆరంభం తర్వాత అద్భుతంగా పుంజుకుంది. మొదటి రౌండ్‌లో రెండో ఓవర్ 74 స్కోరుతో 33వ స్థానంలో నిలిచి పటిష్టంగా నిలుపుకుంది. స్కాట్‌లాండ్‌లో శనివారం జరిగిన ఈ గోల్ఫ్ టోర్నమెంట్‌లో డండొనాల్డ్ లింక్స్‌లో సవాలుతో కూడిన పరిస్థితులలో ఆడుతూ, 10 హోల్స్ పూర్తయ్యేసరికి ఆరు ఓవర్‌కు పడిపోయిన తర్వాత దీక్ష అద్భుతంగా కోలుకుంది. తక్కువ స్కోర్లు సాధించడం కష్టంగా ఉన్నా, ఈ 24 యేళ్ల క్రీడాకారిణి తన చివరి ఎనిమిది హోల్స్‌లో నాలుగు బర్డీలు సాధించి, పోరాడి 74 స్కోరుతో ముగించింది. ఆమె రౌండ్‌లో మొదటి, రెండవ, నాల్గవ హోల్స్‌లో బోగీలు చేసి, ఆ తర్వాత ఏడవ హోల్‌లో బర్డీ సాధించింది. ఎనిమిదవ హోల్‌లో ట్రిపుల్ బోగీ, 10వ హోల్‌లో మరో బోగీ ఆమెను బాగా వెనుకబడేలా చేశాయి. కానీ 11, 14, 17, 18వ హోల్స్‌లో చేసిన బర్డీలు అద్భుతమైన పునరుద్ధరణకు దారితీశాయి. ఈ సీజన్‌లో లేడీస్ యూరోపియన్ టూర్‌లో ఇప్పటికే నాలుగు సార్లు టాప్10లో నిలిచిన దీక్ష, ఈ పోటీలో పాల్గొన్న ముగ్గురు భారతీయ గోల్ఫర్లలో అత్యుత్తమ స్థానంలో నిలిచింది. ఇక ప్రశాంత్ 8 ఓవర్లలో 80 స్కోరుతో తడబడి 116వ స్థానంలో నిలవగా, ప్రణవి ఉర్స్ 12 ఓవర్లలో 84 స్కోరు చేసి తొలి రోజును 138వ స్థానంతో ముగించింది. లీడర్‌బోర్డ్ లో దక్షిణ కొరియాకు చెందిన జెన్నీ షిన్, అమెరికాకు చెందిన లారెన్ కప్లిన్ 6అండర్ 66 స్కోరుతో సంయుక్తంగా అగ్రస్థానాన్ని పంచుకున్నారు. మరో దక్షిణ కొరియా క్రీడాకారిణి, ఎ లిమ్ కిమ్, 5అండర్ 67 స్కోరుతో మూడవ స్థానం, జర్మనీకి చెందిన ఎస్తేర్ హెన్సెలీట్, జపాన్‌కు చెందిన ఎరికా హారా, మియు యమషిత, స్వీడన్‌కు చెందిన అన్నా నార్డ్‌క్విస్ట్ 3అండర్ 69 స్కోరుతో ఐదవ స్థానాన్ని పంచుకున్నారు.

## మహిళల పెయిర్స్ బౌల్స్‌లో..

# టోంగాను ఓడించిన భారత్



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ 2026లో భాగంగా లాన్ బౌల్స్ మహిళల పెయిర్స్ ఈవెంట్‌లో రూపారాణి తిర్కే, పింకీ సింగ్ జోడీ ట్రైబ్రేక్‌లో టోంగాపై విజయం సాధించి వరుసగా మూడో గెలుపును నమోదు చేసింది. ఈ కామన్వెల్త్ గేమ్స్ 2026లో భాగంగా జరుగుతున్న సెక్షనల్ ప్లేలో ట్రైబ్రేక్‌లో శనివారం టోంగాను ఓడించినతర్వాత, భారతబౌల్స్ మహిళల జంట జట్టు రూపా రాణి టిర్కీ-పింకీ సింగ్ తమ విజయ పరంపరను కొనసాగించారు. ఈ భారత జంట తొలి సెట్‌ను 5-2తో గెలుచుకుని, రెండో సెట్‌ను 4-6 తేడాతో కోల్పోయింది. కానీ ట్రైబ్రేక్‌లో ఒత్తిడిలో కూడా పింకీ అద్భుతంగా ఆడి, ప్రత్యర్థులపై తమ జట్టు విజయం సాధించడంలో సహాయపడింది. ట్రైబ్రేకర్‌లో భారత్ 2-0తో టోంగాను ఓడించి మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. మహిళల పెయిర్ సెక్షనల్ ప్లేలో భారత్‌కు ఇదివరుసగా మూడోవిజయం. దీనికి ముందు మాల్టా, దక్షిణాఫ్రికాలను ఓడించిన భారత్, ఇప్పుడు మూడు మ్యాచ్‌లలో ఓటమి ఎరుగని ఇంగ్లాండ్ వెనుక రెండో స్థానంలో నిలిచింది. ఈ సెక్షన్ నుండి సెమీఫైనల్స్‌కు ఒకే జట్టు మాత్రమే వెళ్తుంది కాబట్టి, తమ చివరి సెక్షనల్ మ్యాచ్‌లో తలపడనున్న భారత్, ఇంగ్లాండ్ జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకునేందుకు సిద్ధమవుతున్నాయి.

## మార్కెట్‌లోకి ఎనిమిది కొత్త ఫండ్ ఆఫర్స్

**ముంబయి,జులై 25:** మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేసే ఇన్వెస్టర్లకోసం ప్రస్తుతం మార్కెట్లో 8 కొత్త న్యూ ఫండ్ ఆఫర్స్ సబ్‌స్క్రిప్షన్‌కు తెరిచి ఉన్నాయి. ఈఫండ్ల ద్వారా అసెట్ మేనేజ్మెంట్ కంపెనీలు తమ ప్రొడక్ట్ పోర్ట్ ఫోలియోను విస్తరించడంతో పాటు ఇన్వెస్టర్లకు కూడా కొత్త పెట్టుబడి అవకాశాల్ని అందిస్తున్నాయి. ఈ ఎన్‌ఎఫ్‌ఒల్లో ఇటిఎఫ్‌లు, ఫ్లెక్సీ క్యాప్, లార్జ్ అండ్ మిడ్ క్యాప్, మిడ్ క్యాప్, సెక్టోరల్ ఫండ్స్, ఫండ్ ఆఫ్ ఫండ్స్, ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్స్ వంటి విభిన్న కేటగిరీలు ఉన్నాయి. కొన్ని స్కీమ్‌ల్లో కేవలం రూ. 100 తోనే పెట్టుబడి ప్రారంభించే అవకాశం ఉండటం విశేషం. ప్రస్తుతం సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉన్న ఎన్‌ఎఫ్‌ఒల్లో ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ బీఎస్‌ఈ ఇన్సూరెన్స్ ఇటిఎఫ్ ఇది ఇటిఎఫ్ కేటగిరీకి చెందినది. ఈనెల 28 ఇక్కడ లాస్ట్ డేట్. ఇందులో కనీసం రూ.1000 పెట్టుబడితో చేరొచ్చు. ఎడెల్‌వీస్ బిఎస్‌ఇ టాప్ 10 బ్యాంక్ ఇటిఎఫ్ ఇది కూడా ఇటిఎఫ్ కేటగిరీకి చెందినదే. ఈనెల 30 లాస్ట్ డేట్. కనీసం రూ. 100 తోనే చేరొచ్చు. ఆల్ఫాగ్రెప్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ కేటగిరీ ఫండ్‌లో చేరేందుకు ఆగస్ట్ 4ఆఖరి తేదీ . ఇందులో కనీస పెట్టుబడి రూ. 5 వేలుగా ఉంది. అబాక్కస్ లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్ ఈనెల 29 లాస్ట్ డేట్. కనీస పెట్టుబడి రూ. 5 వేలు. ది వెల్త్ కంపెనీ మిడ్ క్యాప్ ఫండ్‌లో చేరేందుకు ఆఖరి తేదీ ఈనెల 29గానే ఉండగా కనీసం రూ. 1000 పెట్టుబడితో చేరొచ్చు.

## 676.24 బిలియన్ డాలర్లకు పెరిగిన ఫారెక్స్ ఖజానా




**ముంబయి,జులై 25:** దేశ విదేశీ మారక నిల్వలు ఈనెల 17తో ముగిసిన వారంలో 1.08 బిలియన్ డాలర్లు పెరిగి 676.237 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్బీఐ డేటా విడుదల చేసింది. అంతకుముందు వారంలో కూడా ఫారెక్స్ నిల్వలు 964 మిలియన్ డాలర్లు పెరిగి 675.157 బిలియన్ డాలర్లకు చేరాయి.ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో దేశ విదేశీ మారక నిల్వలు రికార్డు స్థాయిలో 728.494 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అనంతరం మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు ప్రారంభం కావడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగింది. రూపాయి విలువను స్థిరీకరించేందుకు ఆర్‌బీఐ డాలర్ల విక్రయాల ద్వారా విదేశీ మారక మార్కెట్లో జోక్యం చేసుకోవాల్సి రావడంతో ఫారెక్స్ నిల్వలు వరుసగా తగ్గుముఖం పట్టాయి.ఈ నేపథ్యంలో విదేశీ మారక నిల్వలను కాపాడేందుకు ప్రధాని నరేంద్ర మోడీ మే 11 నుంచి పలుమార్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విదేశీ పర్యటనలను తగ్గించుకోవడం, ఇంధన వినియోగాన్ని పరిమితం చేయడం, యేడాది పాటు బంగారం కొనుగోళ్లను తగ్గించడం ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్‌బిఐ వివరాల ప్రకారం, ఈనెల 17తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వల్లో కీలక భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 4.549 బిలియన్ డాలర్లు పెరిగి 551.057 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.డాలర్ల పరంగా లెక్కించే విదేశీ కరెన్సీ ఆస్తుల్లో యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికాతర కరెన్సీల విలువల్లో వచ్చిన పెరుగుదల లేదా తగ్గుదల ప్రభావం కూడా ప్రతిబింబిస్తుందని ఆర్‌బిఐ పేర్కొంది. దేశ బంగారం నిల్వల విలువ 3.48 బిలియన్ డాలర్లు తగ్గి 101.749 బిలియన్ డాలర్లకు చేరింది. మరోవైపు స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 44 మిలియన్ డాలర్లు పెరిగి 18.67 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఆర్‌బిఐ వెల్లడించింది.అదే సమయంలో అంతర్జాతీయ ద్రవ్య నిధి ఐఎంఎఫ్ వద్ద భారత్‌కు ఉన్న రిజర్వ్ పొజిషన్ 32 మిలియన్ డాలర్లు తగ్గి 4.761 బిలియన్ డాలర్లకు చేరింది.

# మణిపాల్ హెల్త్ భారీ ఐపిఒ

## రూ.9,275 కోట్ల సమీకరణ




**ముంబయి,జులై 25:** భారత్‌లో ఇష్యూ పరిమాణం పరంగా అతిపెద్ద హెల్త్‌కేర్ ఐపిఒను మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్ ఈనెల 29న ప్రారంభించనుంది. ఈ ఐపిఒ ద్వారా కంపెనీ రూ.9,275.22 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఒక్కో షేరు ధరను రూ.560-590 మధ్య నిర్ణయించింది. టెమాసెక్ మద్దతు ఉన్న ఈ ఆస్పత్రుల సంస్థ, గరిష్ఠ ధర బ్యాండ్ వద్ద సుమారు రూ.77,607 కోట్ల మార్కెట్ విలువను పొందనుంది.ఈ ఐపిఒ జులై 31న ముగియనుండగా, యాంకర్ ఇన్వెస్టర్ల కోసం 28న ప్రత్యేకంగా బిడ్డింగ్ నిర్వహించనున్నారు. ఈ ఐపిఒలో రూ.8వేల కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్ల జారీ, గరిష్ఠ ధర వద్ద రూ.1,275.22 కోట్ల విలువ చేసే 2.161 కోట్ల షేర్ల ఆఫర్ ఫర్ సేల్ ఉంటుంది. ప్రమోటర్లైన ఇంపీరియస్ హెల్త్‌కేర్ ఇన్వెస్ట్‌మెంట్స్, మణిపాల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ గ్రూప్ ఇండియా, టిజిపి ఎస్‌జి మ్యాగజైన్, సెవెంటీ సెకండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ, అమ్మార్ ఎస్‌డిఎన్ బిహెచ్‌డీ, నోవో హోల్డింగ్స్ ఇన్వెస్ట్ ఏషియా, ఫీనిక్స్ బేర్ ఇన్వెస్ట్‌మెంట్స్ తమ వాటాల్లో కొంత భాగాన్ని ఒఎఫ్‌ఎస్ ద్వారా విక్రయించనున్నాయి. ఫ్రెష్ ఇష్యూ ద్వారా వచ్చే నిధుల్లో రూ.5,552.8 కోట్లను అనుబంధ సంస్థ మణిపాల్ హాస్పిటల్స్ తీసుకున్న రుణాలు మరియు వాటిపై ఉన్న వడ్డీని చెల్లించడానికి వినియోగించనున్నారు. మరో రూ.574 కోట్లను స్టెప్‌డౌన్ అనుబంధ సంస్థ సహ్యాద్రి హాస్పిటల్స్‌లో మైనారిటీ వాటా కొనుగోలుకు కేటాయించగా, మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నారు. లిస్టింగ్ అనంతరం ప్రధానంగా విస్తరణపైనే దృష్టి సారిస్తామని మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ దిలీప్ జోస్ తెలిపారు. ప్రస్తుతం గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 3,000 పడకల సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ఇవి వచ్చే మూడు సంవత్సరాల్లో అందుబాటులోకి వస్తాయని చెప్పారు.అవకాశాలు వచ్చినప్పుడు మాత్రమే కొత్త ఆస్పత్రుల కొనుగోళ్లను పరిశీలిస్తామని, ప్రస్తుతం సహ్యాద్రి హాస్పిటల్స్ సమీకరణ పూర్తి చేయడం, ఇప్పటికే ఉన్న నెట్‌వర్క్‌లో పడకల వినియోగాన్ని మరింత పెంచడంపైనే ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

2026 మార్చి 31 నాటికి మణిపాల్ హెల్త్ దేశవ్యాప్తంగా 49 ఆస్పత్రులను నిర్వహిస్తూ, 13,037 లైసెన్స్ పొందిన పడకల సామర్థ్యాన్ని కలిగి ఉంది.కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 2024లో రూ.6,171.6 కోట్ల నుంచి 2026లో రూ.10,335.8 కోట్లకు పెరిగింది. ఇదే కాలంలో నికర లాభం రూ.533.2 కోట్ల నుంచి రూ.916.5 కోట్లకు పెరిగింది.

## పెండింగ్ ఐటి అప్పీళ్ల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి: నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ,జులై 25:** దేశంలో పెండింగ్‌లో ఉన్న పన్ను అప్పీళ్ల పరిష్కార ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు అధికారులను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదేశించారు. ప్రస్తుతం పరిష్కారం కాని పన్ను వివాదాల్లో రూ.5 లక్షల కోట్లకు పైగా మొత్తం చిక్కుకుపోయిందని ఆమె పేర్కొన్నారు. సీనియర్ ఆదాయపన్ను అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడిన నిర్మలా సీతారామన్, పెండింగ్ అప్పీళ్ల సంఖ్య తగ్గుతున్నప్పటికీ ఆ ప్రక్రియ ఆశించినంత వేగంగా లేదని వ్యాఖ్యానించారు. పెండింగ్ కేసుల నిర్వహణను సమీక్షించి, మరిన్ని అప్పీళ్లను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పన్ను సంబంధిత వ్యాజ్యాలను తగ్గించడం, పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడం సిబిడిటి అత్యంత ప్రాధాన్య అంశాల్లో ఒకటిగా కొనసాగాలని ఆమె స్పష్టం చేశారు. పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరాన్ని కూడా మంత్రి నొక్కి చెప్పారు. పన్ను శాఖతో వ్యవహరించిన తర్వాత చాలా మంది పన్ను చెల్లింపుదారులు అసంతృప్తితో వెళ్తున్నారని పేర్కొంటూ, ఆ పరిస్థితిని మార్చే బాధ్యత అధికారులదేనని అన్నారు. పన్ను చెల్లింపుదారులు దేశ అభివృద్ధికి భాగస్వాములు. వారికి తగిన గౌరవం ఇవ్వాలని అన్నారు. పన్ను చట్టాల అమలులో అతిగా కఠినంగా వ్యవహరించడం గానీ, అత్యంత సడలింపు చూపించడం గానీ సరైన విధానం కాదని హెచ్చరించారు. స్వచ్ఛంద పన్ను చెల్లింపులను మరింత ప్రోత్సహించడం, పన్ను చెల్లింపుదారులకు సులభమైన విధానాలను అమలు చేయడం, పన్ను వ్యవస్థలో స్పష్టత మరియు విశ్వసనీయతను పెంచడం వంటి అంశాలపై పైనా సిబిడిటి ప్రత్యేక దృష్టి సారించాలని నిర్మలా సీతారామన్ సూచించారు.

# ఇక దేశవ్యాప్తంగా సికెవైసి

## ఒకే కస్టమర్ ఐడితో అన్ని సేవలు:ఆర్బీఐ కసరత్తులు




**ముంబయి,జులై 25:** ఆర్బీఐ,స్టాక్‌మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ, బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డియేలు సంయుక్తంగా అమలు చేస్తున్న సెంట్రల్ కెవైసి 2.0తో ఇకపై దేశంలోని బ్యాంకులు, బీమా సంస్థలు, మ్యూచువల్ ఫండ్ సంస్థలు కూడా ఒకే కస్టమర్ ఐడీని వినియోగించే వీలు కల్పిస్తున్నాయి. ప్రస్తుతం ఒక ఆర్థిక సంస్థలో కెవైసి పూర్తి చేసినా, మరో సంస్థలో కొత్తగా మళ్లీ అదే ప్రక్రియ చేయాల్సి వస్తోంది. కొత్త సీకేవైసీ 2.0 అమల్లోకి వస్తే తర్వాత కస్టమర్ ఒకసారి మాత్రమే కెవైసి చేస్తే సరిపోతుంది. తర్వాత వేరే బ్యాంకు లేదా బీమా సంస్థ లేదా ఇతర ఏదైనా ఆర్థిక సంస్థలో అకౌంట్ తెరవాలంటే కస్టమర్ అనుమతితో కేంద్ర రిజిస్ట్రీనుంచి నేరుగా వివరాల్ని పొందగలుగుతాయి. బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థలు ఈ వ్యవస్థను ఆగస్ట్ నుంచే దశలవారీగా అమలు చేయనున్నాయి. మ్యూచువల్ ఫండ్ సంస్థలు, బ్రోకరేజీ కంపెనీలు కూడా ఈ సంవత్సరం చివరి నాటికి ఈ విధానంలో చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దేశంలో ఇప్పటికే 120 కోట్లకుపైగా సికెవైసి రికార్డ్స్ ఉన్నప్పటికీ డేటాలో డూప్లికేట్లు, అసంపూర్తి సమాచారం వంటి కారణాలతో వాటి వినియోగం మాత్రం పరిమితంగానే ఉంది. బ్యాంకులు ఆ డేటాను పూర్తిగా స్వీకరించకపోవడంతో కస్టమర్లు మాత్రం ప్రతిసారీ ప్రతి సంస్థకు వేర్వేరుగా కెవైసి చేయాల్సి వస్తోంది. ఆధార్ తరహా 14 అంకెల నంబర్‌ను ఆర్బీఐ జారీచేస్తుండటంతో ఇక కెవైసి తిప్పలుండవు. సికెవైసి 2.0లో మాత్రం ప్రతి రికార్డుకూ కాన్ఫిడెన్స్ స్కోర్ ఉంటుంది. ఆ సమాచారం ఎంత వరకు ధ్రువీకరించిందో తెలుస్తుంది. ఇంకా ఏయే సంస్థ ఆవివరాల్ని వెరిఫై చేసిందో కూడా సమాచారం ఉంటుంది. దీంతో డేటాపై నమ్మకంపెరగడంతోసహా మోసాల్నికూడా గుర్తించడం ఈజీ అవుతుందని నియంత్రణ సంస్థలు భావిస్తున్నాయి.

## రూ.20వేలకోట్ల నిధుల సమీకరణకు ఐడిఎఫ్‌సి బ్యాంకు

**ముంబయి,జులై 25:** ప్రైవేట్ రంగానికి చెందిన ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ డైరెక్టర్ల మండలి రూ.20వేల కోట్ల నిధులు సమీకరించేందుకు అనుమతినిచ్చింది. ఈ మేరకు శనివారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు బ్యాంక్ సమాచారం అందించింది. వ్యాపార విస్తరణ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని మూలధన సమృద్ధిని కొనసాగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు బ్యాంక్ వెల్లడించింది.బోర్డు నిర్ణయం ప్రకారం, రూ.7,500 కోట్ల వరకు ఈక్విటీ షేర్ల జారీ ద్వారా సేకరిస్తారు. అదేవిధంగా రూ.12,500 కోట్ల వరకు రుణ పత్రాలు (డెట్ సెక్యూరిటీస్) మరియు ఇతర అర్హత కలిగిన ఆర్థిక ఉత్పత్తుల జారీకి కూడా బోర్డు ఆమోదం తెలిపింది. ఈ నిధులను ఒకటి లేదా అంతకంటే ఎక్కువ విడతల్లో భారతీయ రూపాయిల్లో లేదా అనుమతించబడిన విదేశీ కరెన్సీల్లో సమీకరించవచ్చని బ్యాంక్ పేర్కొంది. వాటాదారులు, నియంత్రణ సంస్థల ఆమోదం వచ్చిన తర్వాత రానున్న వార్షిక సాధారణ సమావేశం ముగిసిన తేదీ నుంచి ఒక సంవత్సరం వరకు ఈ అనుమతి అమల్లో ఉంటుంది. ఇదిలా ఉండగా, నికరలాభం రూ.1,075 కోట్లకు పెరిగింది. గత యేడాది ఇదే కాలంలో రూ.463 కోట్లుగా ఉన్న నికర లాభం ఈసారి రూ.1,075 కోట్లకు పెరిగింది.నికర వడ్డీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 21 శాతం వృద్ధితో రూ.4,933 కోట్ల నుంచి రూ.5,972 కోట్లకు చేరుకుంది. బ్యాంకు ఆపరేటింగ్ లాభం కూడా 14 శాతం పెరిగి రూ.2,239 కోట్ల నుంచి రూ.2,553 కోట్లకు నమోదైంది.అదే సమయంలో, ప్రొవిజన్లు గత ఏడాది రూ.1,659 కోట్లతో పోలిస్తే ఈసారి రూ.1,144 కోట్లకు తగ్గాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.